

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి.
పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 170

శనివారం 9-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



19,800 స్థాయి పైకి నిఫ్టీ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 2% రాణించడంతో స్టాక్ సూచీలు ఆరో రోజూ లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలను ఇన్వెస్టర్లు విస్మరించారు. దేశీయం నెలకొన్న సానుకూల పరిణామాల దృష్ట్యా సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 333 పాయింట్లు ఎగసి 66,599 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు బలపడి 19,820 వద్ద స్థిరపడింది. -11లో

మన పెద్దవాళ్లు వృద్ధాప్యంలో కూడా ఎంతో బలంగా ఉండేవారు.. అయితే మారుతున్న జీవనశైలి కారణంగా వారిలో కూడా శరీర సమస్యలు వస్తున్నాయి. చాలా మంది వృద్ధుల్లో మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. దీంతోపాటు ఆధునిక జీవన శైలికి అలవాటు పడ్డ యువతలో కూడా ఇవే సమస్యలు వస్తున్నాయి. మోకాళ్లనొప్పుల కారణంగా నడవడానికి చాలామంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మోకాళ్ల నొప్పులు ఇతర సమస్యలకు కూడా దారి తీయొచ్చు. మోకాళ్ల నొప్పులను తట్టుకోలేక చాలామంది పెయిన్ కిల్లర్స్ అంటే నొప్పి నివారణిలను ఆశ్రయిస్తుంటారు. వీటివల్ల ఎన్నో దుష్ప్రభావాలు కలుగుతాయి. అందువల్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని సహజ చిట్కాలను తెలుసుకుందాం.



నీ పెయిన్స్‌కి సహజ నివారణ ఇలా...

ఆర్థరయిటీస్, ఆస్టో ఆర్థరయిటీస్, రుమటాయిడ్ ఆర్థరయిటీస్ వంటి కొన్ని రకాల అనారోగ్య కారణాలతోపాటు సరైన దినచర్యను పాటించకపోవడం, తీసుకునే ఆహారాల్లో తగినన్ని పోషకాలు లేకపోవడం, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా కూడా మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. అయితే ఈ నొప్పులు ఎందుకు వస్తున్నాయో తెలుసుకుని ఆ తర్వాత ఈ సమస్యల నుంచి శాశ్వతంగా ఉపశమనం పొందడానికి కొన్ని మార్గాలను అన్వేషిద్దాం.



కలబంద

ఆయుర్వేద నిపుణులు కలబందను ఔషధంగా భావిస్తారు. ఇందులో శరీరానికి కావాల్సిన చాలారకాల ఔషధ గుణాలు లభిస్తాయి. కాబట్టి తీవ్ర మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు నొప్పి ప్రభావిత ప్రాంతంలో ప్రతిరోజు అలోవెరా జెల్‌ను అప్లై చేసి సున్నితంగా మర్దన చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల సులభంగా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా మోకాళ్ల వాపులు కూడా తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు.



పసుపు

పసుపు యాంటీ బాక్టీరియల్‌గా పని చేస్తుంది. ఇందులో అనేక రకాల ఔషధ గుణాలు లభిస్తాయి. కాబట్టి దీనిని అన్నిరకాల వ్యాధులకు వినియోగించవచ్చని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు. మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు ప్రతిరోజు పసుపును వినియోగించడం వల్ల సులభంగా ఉపశమనం లభిస్తుంది. అయితే దీనిని వినియోగించే ముందు ఒక బౌల్ తీసుకుని అందులో ఆవాల నూనెను వేసి.. ఒక టీ స్పూన్ పసుపును వేసి బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ప్రభావిత ప్రాంతంలో అప్లై చేస్తే తక్షణ ఉపశమనం లభిస్తుంది.



అల్లం

మోకాళ్ల నొప్పుల నివారణకు ఉపయోగించే మందులలో అల్లాన్ని బాగా ఉపయోగిస్తారు. కొన్ని అల్ల ముక్కలను తీసుకుని వాటిని గ్లాసు నీళ్లలో వేసి బాగా మరగబెట్టాలి. మనం తీసుకున్న నీటి పరిమాణం సగానికి తగ్గిందని నిర్ధారించుకున్న తర్వాత స్టవ్ మీదినుంచి దింపి గోరువెచ్చగా అయిన తర్వాత వడకట్టి తాగాలి. రుచికి తేనె, నిమ్మరసం వంటివి కలుపుకోవచ్చు.



కర్పూర తైలం

తీవ్ర మోకాళ్ల నొప్పుల కారణంగా బాధపడేవారు కర్పూరం నూనెను కూడా వినియోగించవచ్చని ఆయుర్వేద నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు అన్ని రకాల నొప్పుల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి. దీనిని వినియోగించాలనుకునేవారు ముందుగా కర్పూరం నూనె తీసుకుని బౌల్‌లో పోసుకుని గోరువెచ్చగా చేయాలి. ఆ తర్వాత ఈ నూనెను ప్రభావితం ప్రాంతంలో అప్లై చేసి 15 నిమిషాల పాటు బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల సులభంగా తీవ్ర మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

చింతగింజల పొడి

మోకాళ్లలో గుజ్జు అరిగిపోవడం వల్ల వచ్చే నొప్పులు తగ్గాలంటే కాస్తంత చింతగింజల పొడిని వేడినీళ్లలో వేసి బాగా మరగబెట్టి వడకట్టి తాగుతుండాలి. అలాగే దీనిలో పాలు కలపకుండా బెల్లం పొడి వేసి పాయసంలా చేసుకుని కూడా తాగచ్చు.

నల్లేరు కాడలతో తయారు చేసిన పచ్చడిని, బెండకాయలను, గోరుచిక్కుడు కాయలను ఆహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల మోకాళ్ల నొప్పుల నుంచి సహజ ఉపశమనం లభిస్తుంది.

ఏదైనా గాయం వలన కానీ మెడికల్ కండిషన్ వలన కానీ మీరు రోజూ చేసే పనులన్నీ బట్టి కానీ మోకాళ్ళ నొప్పులు సహజంగా వచ్చే అవకాశం ఉంది.

ఎక్కువగా మోకాళ్ల నొప్పులు ఉంటే కచ్చితంగా డాక్టర్ సలహా తీసుకోవాలి. మోకాళ్ళ నొప్పులు తగ్గాలంటే అల్లం, పసుపు బాగా పని చేస్తాయి. ఒక గ్లాసు నీళ్ల తీసుకుని అందులో అల్లం, పసుపు వేసి 15 నిమిషాల పాటు ఆ నీటిని మరిగించండి. తర్వాత ఈ జ్యూస్ తీసుకున్నట్లయితే మోకాళ్ళ నొప్పులు తగ్గే అవకాశం ఉంది.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువగా ఉంటే కనక హీట్, కోల్డ్ కంప్రెస్ అంటే కాపడం పెట్టవచ్చు. హీట్ కంప్రెస్‌ని నొప్పి ఎక్కువ ఉంటే మాత్రం వాడకూడదు. ఎందుకంటే ఇంకా నొప్పి కలుగుతుంది. ఆర్థరైటిస్‌తో బాధపడే వాళ్ళకి వేడినీటి కాపడం బాగా పనిచేస్తుంది. ఆటలు సమయంలో గాయాలైనప్పుడు కోల్డ్ కంప్రెసర్ బాగా తోడ్పడుతుంది.

ఎప్సం సాల్ట్‌ని స్నానం చేసే నీళ్లలో వేసుకుని స్నానం చేస్తే ఉపశమనం లభిస్తుంది.



అరకప్పు ఆపిల్ సైడర్ వెనిగర్‌ని ఒక గ్లాసు నీళ్లలో వేసుకుని తాగితే మోకాళ్ళ నొప్పులు బాగా తగ్గుతాయి. రాత్రి నిద్రపోయేటప్పుడు తాగితే చాలా చక్కగా ఈ చిట్కా పనిచేస్తుంది.

బరువు నియంత్రణ

సాధ్యమైనంత వరకు మన వెయిట్ మానేజ్ చేసుకుంటూ ఉండాలి. ఎక్కువ బరువు పెరగడం వల్ల మోకాళ్ల పైన భారం పడి, మోకాళ్ళ నొప్పులు పెరిగే అవకాశం ఉంది. అందుకని బరువుని మేనేజ్ చేసుకుంటూ మోకాళ్లపై ఒత్తిడి పడకుండా చూసుకోవాలి. బరువు తగ్గడం కోసం వ్యాయామాలు కూడా చేసుకోవచ్చు.

మీకు తెలుసా?

స్నానానికి వేడినీళ్లా? చన్నీళ్లా?



కొందరు చన్నీళ్ల స్నానమే మంచిదంటారు. మరికొందరు వేడి వేడి నీళ్ల వల్ల హానికారక క్రిములన్నీ తొలగిపోయి ఆరోగ్యం సమకూరుతుందనుకుంటారు. ఈ రెండూ అపోహలే. స్నానానికి నీళ్ల మరీ చల్లగా ఉండకూడదు. మరీ వెచ్చగా ఉండకూడదు. గోరువెచ్చని నీళ్లతో స్నానమే ఆరోగ్యం. ఇక బలహీనంగా ఉన్నవాళ్లు, వయసుపైబడిన వృద్ధులు మరీ ఎక్కువ చన్నీళ్ల స్నానం కాని, మరీ ఎక్కువ వేణ్ణీళ్లతో కానీ స్నానం చేయద్దు.

ఒకవేళ మీరు మీ వృత్తిరీత్యా వేరే ఊళ్లలో ఉండటం వల్ల వేణ్ణీళ్ల పెట్టుకోవడం సాధ్యం కావడం లేదా? ఇలా మరీ చన్నీళ్ల స్నానమే చేయడం తప్పకపోతే... స్నానం చేసే వ్యవధిని వీలైనంత కుదించండి. నీళ్ల ఎంత చల్లగా ఉంటే... స్నానం వ్యవధి అంతగా తగ్గాలి. చన్నీళ్లతో స్నానం చేసే అలవాటు ఉన్నవారు... స్నానానికి ముందర చల్లటి నీళ్లు తాగకండి.

చన్నీళ్లు గానీ లేదా వేణ్ణీళ్లు గానీ... వాటితో స్నానం చేశాక ఒకవేళ తల నొప్పి లేదా జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తే... అవి (చన్నీళ్లు / వేణ్ణీళ్లు) మీకు అంతగా సరిపడవని గుర్తించి, ఆ మేరకు గోరువెచ్చని నీటికి షిఫ్ట్ అవడం మంచిది.

గ్రీన్ టీ తాగుతున్నారా? అయితే ఇది మీ కోసమే!



బరువు తగ్గాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలనుకునే వారు చాలామంది తమ ఆహారంలో భాగంగా గ్రీన్ టీ తీసుకుంటారు. ఎందుకంటే ఇది మన శరీరానికి చాలా ప్రయోజనాలను అందిస్తుంది. అయితే రోగ్యానికి మంచిదని అధికంగా తీసుకోవడం వల్ల మన శరీరంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. గ్రీన్ టీ ఎక్కువగా తాగడం వల్ల కొందరిలో కాలేయ సమస్యలు వస్తాయని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రీన్ టీ తీసుకునేటప్పుడు గర్భిణులు, పాలిచ్చే తల్లులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాలేయ వ్యాధులు ఉన్నవారు గ్రీన్ టీ తీసుకోకపోవడమే మంచిది. గ్రీన్ టీ తాగేవారికి ఇతర మందులతో రియాక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల మీరు ఇప్పటికే ఏవైనా ఇతర మందులు వాడుతున్నట్లయితే ఒకసారి వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే మీరు దీన్ని మీ ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.

గ్రీన్ టీ అధికంగా తీసుకోవటం వల్ల తలనొప్పి రావచ్చు. ఇది రక్తపోటును అమాంతం తగ్గించే అవకాశం ఉంది. ఇది అశాంతిని కలిగిస్తుంది. నిద్రలేమికి కారణం అవుతుంది. జీర్ణవ్యవస్థకు చికాకు కలిగిస్తుంది. భయాన్ని, ఆందోళనను కలిగిస్తుంది.గ్రీన్ టీ తీసుకున్న తర్వాత ఏవైనా సైడ్ ఎఫెక్ట్స్ గమనించినట్టయితే... మీరు వెంటనే మీ వైద్యుడిని సంప్రదించాలి.

ఆరోగ్యానికి ఆవ పెట్టండి!



వంటలు మరింత రుచిగా రావడం కోసం పోపు పెట్టడం తెలుగువారి అలవాటు. ఈ పోపులో ఎక్కువగా వినియోగించే వాటిల్లో ఆవాలు ఒకటి. ఆవాలు ఆహార పదార్థాలకు రుచిని ఇవ్వడమే శరీరానికి చాలా రకాలుగా సహాయపడతాయి. ఇందులో ఉండే ఔషధ గుణాలు అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ప్రస్తుతం చాలామందికి వీటిని తినడమే తప్ప వీటివల్ల కలిగే లాభాలు ఏంటో తెలియదు. ఆవాలను తీసుకోవడం వల్ల కలిగే లాభాలేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

పోపులో వేసే దినుసులలో ఎవరైనా సరే ముందుగా చెప్పేది ఆవాలనే. ఈ ఆవాల వల్ల ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం ఉంది. వాటిలో గాయాలు తొందరగా మానడం ముందుగా చెప్పుకోవచ్చు. ఈ గాయాలు తగిలిన చోట ప్రతి రోజు ఆవాల పొడిని అప్లై చేయడం వల్ల తొందర్లోనే మంచి ఫలితాలు పొందుతారు. ఆధునిక జీవనశైలి కారణంగా చాలామందిలో దంతాల సమస్యలు వస్తున్నాయి. తరచు దంతాల నొప్పితో బాధపడే వారు ఆవాలను నీటిలో మరిగించి ఆ నీటిని పుక్కిలించి ఉమ్మెయ్యడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయి. అంతేకాకుండా దంతాల నొప్పి నుంచి సులభంగా లభిస్తుంది.

ఆవాలు శ్వాస కోసం సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగించేందుకు సహాయపడతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తరచుగా ఇలాంటి సమస్యలతో బాధపడే వారు ఒక టీ స్పూన్ ఆవాల పొడిలో, ఒక టీ స్పూన్ ఆవాలను కలుపుకొని తీసుకోవడం వల్ల సులభంగా శ్వాస కోసం వ్యాధులనుంచి ఉపశమనం కలుగుతుంది. ఆవాలు కీళ్ల నొప్పుల నుంచి కూడా ప్రభావంతంగా ఉపశమనం కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. కీళ్ల నొప్పుల కారణంగా నడవలేకపోతున్నవారు ఒక టీ స్పూన్ ఆవాలు నూనె ఓ చిన్న గిన్నెలో తీసుకొని అందులోనే ఒక టీ స్పూన్ ఆవాల పొడి, కర్పూరం వేసి పేస్టులా తయారు చేసి ప్రభావిత ప్రాంతంలో అప్లై చేయడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. ఆవపిండితో తయారు చేసిన ఆహారాన్ని రోజూ తినడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా.. జీర్ణ క్రియ సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

డేట్ సెట్ గురూ..



సినిమా సెట్ అనుకున్నప్పుడే చూచాయగా రిలీజ్ డేట్ కూడా సెట్ చేస్తుంటారు మేకర్స్. అలా కాకపోయినా షూటింగ్ సగం పూర్తయ్యాక సెట్ చేస్తారు. వన్ ఫైన్ డే ఆ డేట్‌ని అధికారికంగా ప్రకటిస్తారు. కానీ.. సెట్ చేసిన డేట్‌కి కొన్ని సినిమాలు విడుదల కాకపోవచ్చు. సాంకేతిక కారణాలు, ఇతర కారణాల వల్ల వాయిదా పడుతుంటాయి. అలా ప్రస్తుతం అరడజను చిత్రాల దాకా వాయిదా పడ్డాయి. ఏ సినిమా కారణం ఆ సినిమాది. ఇక అనుకున్న డేట్‌కి రాకుండా కొత్త డేట్ సెట్ చేసుకుని సిల్వర్ స్క్రీన్ పైకి రానున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

● ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సలార్'. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అందులో భాగంగా 'సలార్: పార్ట్ 1–సీజ్‌ఫైర్'ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెలాఖరులో ప్రభాస్ ఫ్యాన్స్‌కి, సినిమా లవర్స్‌కి పండగే. అయితే ఈ సినిమా రిలీజ్ వాయిదా వేస్తున్నారంటూ వార్తలు షికారు చేస్తున్నాయి. గ్రాఫిక్స్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో విడుదల వాయిదా పడనుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. అయితే 'సలార్' రిలీజ్ వాయిదాపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అనేదానిపై పాన్ ఇండియా స్థాయిలో చర్చ జరుగుతోంది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ సినిమాని దీపావళి కానుకగా నవంబర్‌లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. ముందుగా అనుకున్నట్లు ఈ నెల 28న సినిమాని విడుదల చేస్తారా? లేదా అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాలి. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటించారు.

★★★



● రామ్ పోతినేని హీరోగా నటించిన తొలి పాన్ ఇండియా చిత్రం 'స్కంద' కూడా ముందు అనుకున్న తేదీకి కాకుండా వేరే తేదీకి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వినాయక చవితి సందర్భంగా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే తాజాగా మేకర్స్ సినిమా విడుదలను వాయిదా వేశారు. ఈ నెల 15న కాకుండా 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అయితే సినిమా విడుదల తేదీ ఎందుకు మార్చాల్సి వచ్చిందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

★★★



● రజనీకాంత్ హీరోగా జ్యోతిక టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'చంద్రముఖి' (2005). పి. వాసు దర్శకత్వం వహించిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాదాపు 18 ఏళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'చంద్రముఖి 2'. తొలి భాగానికి దర్శకత్వం వహించిన పి. వాసునే రెండో భాగాన్ని తీశారు. అయితే సీక్వెల్‌లో హీరో, హీరోయిన్ మారారు. రాఘవ లారెన్స్ హీరోగా, కంగనా రనౌత్ టైటిల్ రోల్‌లో నటించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని వినాయక చవితి సందర్భంగా ఈ నెల 15న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే తాజాగా ఈ సినిమా విడుదల వాయిదా పడింది. ఈ నెల 15న కాకుండా 28న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాల వల్లే విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కాగా 'చంద్రముఖి 2'ని తెలుగులో రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకటరత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు.

★★★



● వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆదికేశవ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా విడుదల కూడా వాయిదా పడింది. తొలుత ఈ చిత్రాన్ని జూలైలో రిలీజ్ చేయాలనుకున్నారు.. చేయలేదు. ఆ తర్వాత ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఆ తర్వాత అది కూడా వాయిదా పడి చివరికి నవంబర్ 10వ తేదీకి ఫిక్స్ అయింది. ఫారిన్‌లో కొంత షూటింగ్ బ్యాలెన్స్ ఉండటం వల్లే విడుదల వాయిదా వేస్తున్నట్లు 'ఆదికేశవ' చిత్రబృందం ప్రకటించింది.

★★★



● సిద్ధు జొన్నలగడ్డ, నేహా శెట్టి జంటగా విమల్ కృష్ణ దర్శకత్వం వహించిన 'డీజే టిల్లు' (2022) సినిమా సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రూపొందింది. ఈ చిత్రానికి డైరెక్టర్, హీరోయిన్ మారారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించారు. 'డీజే టిల్లు'ని నిర్మించిన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ మూవీని కూడా ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే విడుదల వాయిదా పడింది. ''టిల్లు స్క్వేర్' పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. క్వాలిటీ ఔట్‌పుట్ కోసం విడుదల వాయిదా వేయక తప్పడం లేదు. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అంటూ మేకర్స్ ప్రకటించారు.

★★★




● 'నారప్ప' వంటి హిట్ మూవీ తర్వాత శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు–1'. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా నటించారు. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని తొలుత ఆగస్టులో విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించినా, వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు? అనేదానిపై తాజాగా చిత్ర యూనిట్ స్పష్టత ఇచ్చింది. ఈ నెల 29న 'పెదకాపు –1' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పబ్ రంజన్!


● కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి

'ప్రతి తండ్రి నన్ను చూసి నేర్చుకోవాల. అమ్మ పాలిచ్చి పెంచుద్ది, అయ్య మందిచ్చి ఓదార్చాల. చెప్పు నాన్న ఏం తాగుతావు?' (గోపరాజు రమణ). 'బీర్ ఓకే' (కిరణ్ అబ్బవరం) అనే సంభాషణలతో మొదలవుతుంది 'రూల్స్ రంజన్' ట్రైలర్. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రూల్స్ రంజన్'. నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీకృష్ణ వేమూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'మా ఆఫీస్‌లో వీకెండ్స్ వస్తే నన్ను ఏమంటారో తెలుసా.. మనోరంజన్ కాదు.. పబ్ రంజన్ అంటారు (కిరణ్ అబ్బవరం), 'ఈ రూల్స్ రంజన్ పంబ్ రంజన్‌గా ఎందుకు మారాడు? (మరో పాత్రధారి) అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. మెహర్ చాహల్, వెన్నెల కిశోర్, సుబ్బరాజు, హైపర్ ఆది, వైవా హర్ష, అన్నూ కపూర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అమ్రిష్ గణేష్, సహనిర్మాత: రింకు కుక్రెజ.

కోట బొమ్మాళి పాట


● శ్రీకాంత్, రాహుల్ విజయ్

మలయాళ హిట్ ఫిల్మ్ 'నాయట్టు' (2021)కు తెలుగు రీమేక్‌గా 'కోట బొమ్మాళి పీఎస్' చిత్రం రూపొందుతోంది. శ్రీకాంత్ మేకా, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తేజ మార్ని దర్శకత్వంలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలో ఉన్న శ్రీకాకుళం ఫోక్ సాంగ్‌ను ఈ నెల 11న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. ''పూర్తి స్థాయి ఫోక్ సాంగ్‌గా రానున్న ఈ పాట ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్.

ద్రోహి వస్తున్నాడు


● సందీప్, క్రిష్, విజయ్ పెందుర్తి

సందీప్ కుమార్ బొడ్డపాటి, దీప్తి వర్మ జంటగా విజయ్ పెందుర్తి దర్శకత్వంలో రూపొందిన ఫిల్మ్ 'ద్రోహి'. 'ది క్రిమినల్' అనేది ఉప శీర్షిక. శ్రీకాంత్ రెడ్డి, విజయ్ పెందుర్తి, ఆర్. రాజశేఖర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు క్రిష్ మాట్లాడుతూ– ''ఈ సినిమా లుక్, గ్లింప్స్ ప్రామిసింగ్‌గా ఉన్నాయి. ఈ సినిమాకు పని చేసిన అందరికీ ఈ చిత్రం మంచి పేరు తీసుకు రావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ప్రేక్షకులు మెచ్చే అన్ని థ్రిల్లర్ అంశాలున్న చిత్రం ఇది. ఈ నెలలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు దర్శక–నిర్మాతలు. డెబి, 'షకలక' శంకర్, నిరోజ్, శివ, మహేశ్ విట్టా కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనంత్ నారాయణ.

ఓ విద్యార్థిని పోరాటం


● సదానంద్ శారద, ముఠా గోపాల్, శ్రీమాన్ గుమ్మడవెల్లి

శాన్వీ మేఘన, కౌశిక్ బాబు జంటగా శ్రీమాన్ గుమ్మడవెల్లి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నేనే సరోజ: ఉరఫ్ కారం చాయ్'. గాళ్స్ సేవ్ గాళ్స్ కాన్సెప్ట్ ఆధారంగా ఎస్ 3 క్రియేషన్స్ పతాకంపై రచయిత డా. సదానంద్ శారద నిర్మించిన చిత్రం ఇది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన శాసన సభ్యులు ముఠా గోపాల్ మాట్లాడుతూ– ''ఉన్మాదులను ఎదిరించే కాలేజీ విద్యార్థిని పాత్రలో శాన్వీ మేఘన పవర్‌ఫుల్‌గా నటించారు. ఓ సామాజిక అంశాన్ని తీసుకుని ఈ తరహా సినిమాను నిర్మించిన దర్శక–నిర్మాతలను అభినందిస్తున్నాను. ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఆడపిల్ల మీద దాడి చేసే ఉన్మాదులకు, వివక్ష చూపించేవారికి తాగిస్తాం కారం చాయ్ అంటూ గుణపాఠం చెప్పేలా సరోజ పాత్ర ఉంటుంది. కుటుంబసమేతంగా చూడాల్సిన చిత్రం ఇది'' అన్నారు శ్రీమాన్ గుమ్మడవెల్లి. ''ఆలోచనాత్మక సంభాషణలు.. శాన్వి వీరోచిత పోరాటాలు, ఆర్. ఎస్. నంద హాస్యం.. ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలు'' అన్నారు రచయిత, నిర్మాత సదానంద్ శారద.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 170

శనివారం 9-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



బొప్పన జోడీ రన్నరప్‌తో సరి

యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ ఫైనల్లో పరాజయం - 11లో



రిలయన్స్ సూపర్ కంప్యూటర్స్

ఎన్‌విడియాతో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ల అభివృద్ధి -11లో

'రక్షణ' బంధం బలీయం



ఢిల్లీలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రధాని మోదీ మాటామంతి

- జీ20 సదస్సుకు భారత్ విచ్చేసిన బైడెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు
- పలు రంగాల్లో సహకారంపై సంయుక్త ప్రకటన విడుదల
- ఎంక్యూ-9బీ రకం 31 డ్రోన్ల విక్రయానికి బైడెన్ పచ్చజెండా
- భారత్‌లో జీఈ ఎఫ్414 జెట్ ఇంజన్ల సంయుక్త తయారీకి ఓకే

6లో

జీ20 కూటమి ఏ విధంగా గొప్ప ఫలితాలను రాబట్టగలదన్న దానిని జీ20 సారథిగా భారత్ నిరూపించి చూపింది. ఈ సదస్సు తాలూకు ఫలితాలు మున్ముందు మరిన్ని ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశిస్తాయి.

- అమెరికా అధ్యక్షుడు బైడెన్

స్వేచ్ఛాయుత, పారదర్శక, సమ్మిళిత ఇండో–పసిఫిక్ కోసం క్వాడ్ కూటమి అత్యావశ్యకం. వచ్చే ఏడాది భారత్‌లో జరిగే క్వాడ్ (అమెరికా, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియా) కూటమి సదస్సుకు బైడెన్ రావాలి.

- ప్రధాని నరేంద్ర మోదీ



బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ దంపతులకు స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి అశ్వనీ చౌబే

బాబు ముఠా పరార్

విదేశాలకు ఉడాయించిన ముడుపుల పాత్రధారులు

- సీఐడీ నోటీసులతో విచారణ నుంచి తప్పించుకునేందుకే..
- చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు పలాయనం
- షాపూర్జీ-పల్లోంజి ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని దుబాయ్‌కి జంప్.. పత్తాలేని షెల్ కంపెనీల ప్రతినిధి యోగేశ్ గుప్తా
- తాను అరెస్టయితే సానుభూతి పొందే వ్యూహంతోపాటు అల్లర్లకు బాబు పథకం



సాక్షి, అమరావతి: తన అవినీతి బండారం బట్టబయలు కావడంతో మాజీ సీఎం చంద్రబాబు బెంబేలెత్తుతున్నారు. షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని కాజేసిన వైనం ఆధారాలతో సహా వెలుగులోకి రావడంతో ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులు రాత్రికి రాత్రే విదేశాలకు పరారయ్యారు. బాబు తరఫున అన్నీ తామై వ్యవహరించిన తన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెని ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తాలకు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేయడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. దీంతో చంద్రబాబు ఆదేశాలతో ఆయన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని హఠాత్తుగా విదేశాలకు పరారయ్యారు. మరో బినామీ యోగేశ్ గుప్తా ఆచూకీ తెలియడం లేదు.

ఆ ముగ్గురే కీలకం..

తన అవినీతి పాపాలు పండటంతో బాబు రోజుకో ఎత్తుగడ వేస్తున్నారు. తాను అధికారంలో ఉండగా యథేచ్ఛగా సాగించిన అవినీతి వ్యవహారాలను

మిగతా 7వ పేజీలో ▶

మార్గదర్శి ముసుగులో
ఆర్థిక దోపిడీ

- 'సాక్షి' టీవీ చర్చా గోష్ఠిలో ఆర్థిక, న్యాయ నిపుణులు
- రామోజీ అరెస్టు ఖాయం
- బాబు అండతోనే అక్రమాలు
- చందాదారుల సొమ్ము సొంత పెట్టుబడులుగా మళ్లించారు
- అక్రమ డిపాజిట్లతో నల్లధనం దందా.. చిట్‌ఫండ్, ఫెమా, ఫెరా చట్టాల ఉల్లంఘన

2లో





గురివిందకు ముదిరిన
'పచ్చ' కామెర్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఉన్మాద స్థాయికి చేరిన కక్ష

- సీఎం వ్యక్తిగత పర్యటనలో విమాన ప్రయాణాలపై రామోజీ దుష్ప్రచారం
- వ్యక్తిగత పర్యటనలకు ప్రభుత్వ సొమ్ము పైసా తీసుకోని సీఎం జగన్
- రవాణా సహా ఖర్చులన్నీ జేబు నుంచే
- నాడు బాబు కుటుంబం ఫైవ్ స్టార్ హోటల్ పార్క్ హయత్‌లో నివాసం
- ఇందుకు ఖజానా నుంచి ఏకంగా రూ.30 కోట్లు చెల్లింపు
- అప్పట్లో క్యాంపు కార్యాలయాల పేరుతో ఇష్టారాజ్యంగా సొమ్ము ఖర్చు
- మదీనగూడలో చంద్రబాబు ఇంద్రభవనంలో ఇంటీరియర్ కోసం సీఆర్‌డీఏ నిధులు
- బాబు విదేశీ పర్యటనలకు నాలుగేళ్లలో రూ.100 కోట్లు చెల్లింపు
- 'పచ్చ' కామెర్లతో బాధ పడుతున్న రామోజీకి ఇవన్నీ కనిపించని వైనం

8లో

తండ్రి ఎవరో చెప్పుకోలేని
దౌర్భాగ్య స్థితి బాబుది



- కన్నవారు చనిపోతే తలకొరివి పెట్టని వాడు చంద్రబాబు
- ఎవరిది నీచపు పుట్టుకో ఆయన తెలుసుకోవాలి
- మాజీమంత్రి పేర్ని నాని ఫైర్

8లో

ముందస్తు రబీకి
ముమ్మర కసరత్తు



- వర్షాభావంతో ఖరీఫ్ సాగుకు దూరమైన రైతులు
- ఈసారి రబీ సాగు లక్ష్యం 57.5 లక్షల ఎకరాలు
- 20.5 లక్షల ఎకరాల్లో వరి సాగు

2లో

క్లుప్తంగా...

ఉద్యోగుల అన్ని సమస్యలకూ దశలవారీ పరిష్కారం

ఏపీజీఈఎఫ్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి



నరసరావుపేట: ఉద్యోగుల అన్ని సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తూ వస్తోందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏపీ జీఈఎఫ్)చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి చెప్పారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా కన్వీనర్ రొద్దా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఏపీజీఈఎఫ్ పల్నాడు జిల్లా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సెక్రటరీ జనరల్ అరవపాల్ మాట్లాడుతూ ఏపీజీఈఎఫ్ పల్నాడు జిల్లా నూతన చైర్మన్‌గా జి.వందనబాబుతో పాటు మరో 49 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. సెక్రటరీగా ఆళ్ల శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్‌గా కె.రామకృష్ణ తదితరులు ఎంపికయ్యారు.

మరిన్ని పరిశోధనలకు స్ఫూర్తి

- ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ



వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులతో డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు(తిరుపతి జిల్లా): అధునాతన పదార్థాల రంగంలో తాజా పరిణామాలు, ఆవిష్కరణలను పంచుకున్నట్టు ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. మూడో రోజు శుక్రవారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ప్రాసెసింగ్, ఫ్యాబ్రికేషన్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌పై 29వ అంతర్జాతీయ సదస్సు ముగిసింది. ఆయన మాట్లాడుతూ అధునాతన మెటీరియల్స్ రంగంలో మరిన్ని పరిశోధనలు, ఆవిష్కరణలకు ఈ సదస్సు స్ఫూర్తినిస్తుందని, దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్‌లు డాక్టర్ ఆర్‌కేరే, ఏపీఎస్ ప్రసాద్, శ్రీవాత్సవ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

11న కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఉభయ రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి కృష్ణా బోర్డు ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ ఈ నెల 11న జలసౌధలో సమావేశం కానుంది. తాగు, సాగునీటి అవసరాలకు 38.73 టీఎంసీలు కావాలని తెలంగాణ ఇండెంట్ సమర్పించగా, ఏపీ 30.09 టీఎంసీలు కావాలని కోరింది. వాస్తవానికి గత నెల 21న త్రిసభ్య కమిటీ సమావేశం జరగగా, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ గైర్హాజరయ్యారు. సమావేశంలో ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డితో చర్చించిన తర్వాత ఏపీకి 25.29 టీఎంసీలు, తెలంగాణకు 6 టీఎంసీలను కేటాయింపులను ప్రతిపాదిస్తూ కృష్ణా బోర్డు ముసాయిదా మినిట్స్‌ను తయారుచేసి రెండు రాష్ట్రాలకు పంపించింది. దీనిపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అసలు త్రిసభ్య కమిటీ సమావేశం జరిగినట్టు తాము పరిగణనలోకి తీసుకోవడం లేదని, ఆ కేటాయింపులు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 11న మరోసారి సమావేశం నిర్వహించాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది.

నేడు ఏయూ స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ జస్టిస్ నజీర్

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) 87,88,89,90ల సంయుక్త స్నాతకోత్సవం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో జరగనుంది. చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ముఖ్య అతిథి గా జీఎంఆర్ సంస్థల అధినేత ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ జీఎం రావు ప్రసంగిస్తారు.

'చంద్రయాన్-3' విజయం భారత్ సత్తాను చాటింది

ఇస్రో శాస్త్రవేత్త సురేష్‌బాబు



అల్లవరం: చంద్రయాన్-3 విజయం అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశ సత్తాను చాటిందని ఇస్రో శాస్త్రవేత్త, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ బలభద్ర సురేష్‌బాబు అన్నారు. చంద్రయాన్-3 విజయం అనంతరం తన స్వగ్రామం అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని దేవగుప్తం వచ్చిన సురేష్‌బాబును ఆయన చదివిన పాఠశాలలో శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయంతో ప్రపంచంలో ఏ దేశం సాధించలేని కీర్తిని భారత్ సొంతం చేసుకుందని చెప్పారు.

ముందస్తు రబీకి ముమ్మర కసరత్తు

- శనగ విత్తనాల పంపిణీ కోసం 15 నుంచి ఆర్బీకేల్లో నమోదు
- 2022–23లో 1.15 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాల పంపిణీ
- ఈ రబీలో 3.40 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరమని అంచనా
- అక్టోబర్ 1 నుంచి మిగిలిన విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద 80% సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు రబీ కోసం సిద్ధమవుతున్న రైతులకు అవసరమైన విత్తనాల సరఫరాపై దృష్టి సారించింది. ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తొలుత సెప్టెంబర్ 15వ తేదీ నుంచి శనగ విత్తనాలు, అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత మిగిలిన విత్తనాలు పంపిణీ చేయనున్నారు. వచ్చే రబీలో 57.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగును వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానంగా 20.5 లక్షల ఎకరాల్లో వరి, 10.92 లక్షల ఎకరాల్లో శనగ, 8.25 లక్షల ఎకరాల్లో మినుము, 5.37 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 2.57 లక్షల ఎకరాల్లో జొన్నలు సాగవుతాయని అంచనా వేశారు. ఆ మేరకు విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు దూరంగా ఉన్న రైతులు ముందస్తు రబీకి సిద్ధమవుతుండడంతో అందుకు తగినట్లుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

3.98 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

రబీ 2022–23లో 2,83,672 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయగా రైతులు 1,78,818 లక్షల క్వింటాళ్ల విత్తనాలను తీసుకున్నారు. రానున్న రబీ సీజన్ కోసం 3.98 లక్షల క్వింటాళ్ల విత్తనాలను ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధం చేస్తోంది. గత రబీలో 1,26,656 క్వింటాళ్ల శనగ విత్తనాలను సిద్ధం చేయగా, 1.15 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులు తీసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌కు దూరంగా ఉన్న రైతులు ముందస్తు రబీలో శనగ సాగుకు మొగ్గు చూపుతుండడంతో ఈసారి 3.40 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. ఆ తర్వాత సాగయ్యే పంటలకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఇండెంట్ మేరకు 36,121 క్వింటాళ్ల వరి, 14,163 క్వింటాళ్ల మినుము, 4,353 క్వింటాళ్ల పెసలు, 2,064 క్వింటాళ్ల పచ్చిరొట్ట, 727 క్వింటాళ్ల వేరుశనగ, 502 క్వింటాళ్ల చిరుధాన్యాలు, 142 క్వింటాళ్ల కంది విత్తనాలు అవసరమని గుర్తించి ఈ మేరకు వాటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

సెప్టెంబర్ 15 నుంచి నమోదు, పంపిణీ

ఏటా అక్టోబర్ 1 నుంచి రైతుల వివరాలు నమోదు చేసుకుని, 15 నుంచి పంపిణీ మొదలుపెడతారు. కానీ ఈసారి సెప్టెంబర్ 15 నుంచే విత్తన పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. తొలుత శనగ విత్తనాలను, తర్వాత వరితో సహా మిగిలిన వాటిని స్థానిక డిమాండ్‌ను బట్టి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన విత్తనాలతో పాటు ప్రైవేటు కంపెనీల నుంచి సేకరించే విత్తనాలను సైతం అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌లో పరీక్షించి సర్టిఫై చేసిన తర్వాత ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచనున్నారు.

> **పంపిణీకి రబీ విత్తనాలు సిద్ధం**
>
> ముందస్తు రబీకి సిద్ధమవుతున్న రైతులకు అవసరమైన విత్తనాల సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నాం. 3.98 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేశాం. వీటిలో 3.40 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాలను పొజిషన్ చేస్తున్నాం.
>
> – డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధిసంస్థ

రాష్ట్ర విద్యార్థులకు బంగారు భవిత

- నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ రాబర్ట్ క్రైమెర్
- పూళ్ల, కొవ్వలి హైస్కూల్లో పాల్ ప్రాజెక్టు అమలు పరిశీలన


కొవ్వలి ఉన్నత పాఠశాల తరగతి గదిలో నోబెల్ గ్రహీత క్రెమెర్ బృందం

భీమడోలు/దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని నోబెల్ అవార్డు గ్రహీత (అర్థ శాస్త్రం) ప్రొఫెసర్ మైకేల్ రాబర్ట్ క్రెమెర్ చెప్పారు. విద్యారంగంలో పథకాలు, సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. వీటి సత్ఫలితాలు భవిష్యత్తులో ప్రతి ఒక్కరం చూస్తామని, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల, దెందులూరు మండలం కొవ్వలి జెడ్పీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం చికాగోలోని దిల్ యూనివర్సిటీకి చెందిన ఎమిలీ క్యుపిటో బృందంలోని ఐదుగురు సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు, టీచర్లకు గణిత విద్యాబోధన, వాటిలోని మెలకువలను నేర్చుకునేందుకు అందజేసిన గణిత ట్యాబ్‌ల పనితీరును పరిశీలించారు. బైజూస్ ట్యాబ్‌లను 8వ తరగతి చిన్నారులు అర్థవంతంగా వినియోగించడం చూసి మెచ్చుకున్నారు. 8, 9 తరగతి గదుల్లోని చిన్నారులు గణిత ట్యాబ్‌ల వినియోగించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గణిత పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ఈ ట్యాబ్‌లు ఎలా ఉపయోగపడుతున్నాయి, ఇబ్బందులు పడుతున్నారా, ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. నోటు పుస్తకాలను పరిశీలించారు. గణితాభ్యసన కార్యక్రమాల అమలు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తరగతుల్లో ఎక్కువమంది విద్యార్థులు ఉంటున్నారని, ట్యాబ్‌లలో గణిత బోధనను వినే సమయంలో వినికిడి ఆటంకాలు లేకుండా హెడ్‌ఫోన్స్ ఇవ్వాలని పూళ్ల హైస్కూలు విద్యార్థులు ఆ బృందం సభ్యులను కోరారు. ఈ సందర్భంగా క్రైమెర్ మాట్లాడుతూ తాము అందజేసిన గణిత ట్యాబ్‌లు సబ్జెక్టుకు సంబంధించిన విద్యాసామర్థ్యాలను పెంపొందించేందుకు దోహద పడుతున్నాయని, బైజూస్ ట్యాబ్‌లు 8వ తరగతిలోని అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించేందుకు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థి దశ నుంచి నేర్చుకోవడం ద్వారా ప్రగతి సాధిస్తారన్నారు. పాల్ ప్రాజెక్టు ద్వారా కోవిడ్ సమయంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామని, విద్యార్థులు వాటిని వినియోగించే విషయంలో ఉపాధ్యాయులు తీసుకున్న శ్రద్ధ బాగుందని చెప్పారు. అనంతరం క్రైమెర్‌ను పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, హెచ్‌ఎం భువనేశ్వరరావు, ఉపాధ్యాయులు, కొవ్వలిలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సత్కరించారు. రాష్ట్ర కో ఆర్డినేటర్ కె.వి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్స్ పేరుతో డాష్ బోర్డు

- ఎప్పటికప్పుడు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల సమాచారం వెల్లడి
- ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్యాప్, న్యాక్‌ల శిక్షణ వివరాలు పోర్టల్‌లో నమోదు
- త్వరలో పోర్టల్‌ను ఆవిష్కరించనున్న ఏపీఎస్ఎస్‌డీసీ
- నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై సమీక్షలో మంత్రి బుగ్గన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్వహించే నైపుణ్య శిక్షణ కోర్సులు, ఉపాధి కల్పన వంటి వివరాలు 24గంటలు అందుబాటులో ఉండేవిధంగా 'స్కిల్ యూనివర్స్' పేరుతో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ మేరకు ప్రత్యేక పోర్టల్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) త్వరలో అందుబాటులోకి తీసుకువస్తుందని చెప్పారు. విజయవాడ ఆటోనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి బుగ్గన శుక్రవారం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్లకు సంబంధించిన సమగ్ర సమాచారం యువతకు ఎప్పటికప్పుడు తెలిసేలా డాష్ బోర్డును తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్యాప్, న్యాక్, పీఏడీఏ వంటి వివిధ సంస్థలకు చెందిన శిక్షణ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్ర యువతి, యువకులు నైపుణ్య శిక్షణ కోసం నమోదు చేసుకునేవారు, శిక్షణ దశలో ఉన్నవారు, శిక్షణ పూర్తి చేసుకున్నవారు, ఉద్యోగాల్లో చేరినవారు... ఇలా సమగ్ర సమాచారం ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యే విధంగా డ్యాష్ బోర్డును అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. సాంకేతిక, నైపుణ్య విద్యను అభ్యసించే యువతి, యువకులకు అధ్యాపకుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతన పోర్టల్‌లో అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలతో కరిక్యులమ్(రెజ్యూమ్) తయారు చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. వాటర్ మేనేజ్‌మెంట్, ప్లంబింగ్ స్కిల్ కౌన్సిల్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ సాధించిన అవార్డును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పరిశీలించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ కార్యదర్శులు, ఎండీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను మంత్రి అభినందించారు. ఈ సమావేశంలో సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నాగరాణి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ డాక్టర్ వినోద్‌కుమార్, ఈడీ దినేష్‌కుమార్, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ నవ్య, సీడ్యాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు ఇక మరింత క్షేమం

- భద్రత, విద్య, ఆహారం, ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రధానంగా దృష్టి
- అమలులోకి 'సమగ్ర ప్రామాణిక ఆపరేటివ్ విధానం'
- రాష్ట్రంలోని 3,783 వసతి గృహాల్లో పటిష్టంగా ప్రభుత్వం కార్యాచరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు(హాస్టల్స్)లో విద్యార్థులు మరింత క్షేమంగా ఉండేలా ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు సన్నాహక సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలో 3,783 హాస్టళ్లు, రెసిడెన్షియల్ హాస్టళ్లలో తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. హాస్టళ్లలో ఐదు అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం 'సమగ్ర ప్రామాణిక ఆపరేటివ్ విధానం (ఎస్‌ఓపీ)ని అమలులోకి తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ, వికలాంగుల, జువైనల్ సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, ఆహారం, ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రధానంగా దృష్టి సారించింది. అవసరమైన మార్గదర్శకాలను అన్ని సంక్షేమ శాఖలకు ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామ, మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలోని సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా హాస్టళ్లను పర్యవేక్షించేలా క్యాలెండర్ (టైమ్ టేబుల్)ను నిర్దేశించింది. వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణ, భద్రతాపరమైన చర్యలు తీసుకోవడంలోను అప్రమత్తం చేసింది. సురక్షితమైన ఆహారం, నీరుతోపాటు ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. హాస్టళ్ల పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశాలున్న పక్షంలో వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

మార్గదర్శకాలు ఇవీ..


- వసతి గృహాలకు నిరంతరం అందుబాటులో ఉండేలా సిబ్బంది స్టాఫ్ క్వార్టర్స్‌లో ఉండాలి. ఒకవేళ క్వార్టర్స్ అందుబాటులో లేకపోతే సమీపంలోనే నివాసం ఉండాలి.
- అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడానికి సంబంధిత ఉద్యోగులు పూర్తి చిరునామాలు, ప్రత్యామ్నాయ ఫోన్ నంబర్లను హాస్టల్ రిజిస్టర్, నోటీస్ బోర్డుల్లో ఉంచాలి.
- జాబ్ చార్ట్‌లోని విధుల పట్ల అలక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు కచ్చితంగా హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలి.
- అధికారులు, ప్రజాప్రతినిధులు, నిపుణులు, వ్యవస్థాపకులు ఎవరైనా హాస్టళ్లను సందర్శించినప్పుడు వారి వివరాలు, చర్చించిన అంశాలను విజిటర్స్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- విద్యార్థులకు భోజన మెనూ, సౌకర్యాలు, కిచెన్ గార్డెన్, మరుగుదొడ్ల నిర్వహణ, సురక్షితమైన మంచినీరు, మెస్ కమిటీ, పేరెంట్స్ కమిటీ వంటి కీలక విషయాల్లో ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను సక్రమంగా వినియోగించుకుని ప్రతి నెల రెండో శనివారం ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించాలి.
- వారానికి ఒకసారి వైద్య ఆరోగ్య సిబ్బంది స్వయంగా హాస్టల్ విద్యార్థులు ప్రతి ఒక్కరిని పరీక్షించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది.

మార్గదర్శి ముసుగులో ఆర్థిక దోపిడీ

- 'సాక్షి' టీవీ చర్చా గోష్టిలో ఆర్థిక, న్యాయ నిపుణులు
- రామోజీ అరెస్టు ఖాయం
- జీజే రెడ్డి షేర్లు శైలజా కిరణ్‌కు ఎలా బదిలీ అయ్యాయి?

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో చెరుకూరి రామోజీరావు అతి పెద్ద ఆర్థిక అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించారని ఆర్థిక, న్యాయ రంగాలకు చెందిన నిపుణులు స్పష్టం చేశారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టంతోపాటు ఫెమా, ఫెరా చట్టాలను ఉల్లంఘించిన రామోజీరావును అరెస్టు చేసి ఆయన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. "చిట్టీల మాటున చీకటి వ్యాపారం' అనే అంశంపై సాక్షి టీవీ శుక్రవారం నిర్వహించిన చర్చా గోష్టిలో పలువురు నిపుణులు, ప్రముఖులు పాల్గొన్నారు. చందాదారుల నిధులను అక్రమంగా సొంత వ్యాపార ప్రయోజనాలకు మళ్లించడమే కాకుండా వారిని వేధించి ఆస్తులు సైతం రాయించుకున్న ఘనత మార్గదర్శి చిట్‌ఫండ్స్‌దేనన్నారు. న్యాయస్థానాల ద్వారా పరిష్కరించాల్సిన అంశాలను కూడా చిట్ రిజిస్ట్రార్‌కు అప్పగించి చంద్రబాబు ప్రభుత్వం రామోజీ అక్రమాలకు వత్తాసు పలికిందన్నారు. ఢిల్లీ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి రామోజీరావు తన కోడలు శైలజాకిరణ్‌కు అక్రమంగా షేర్లు కట్టబెట్టారని వెల్లడించారు. ఫెమా, ఫెరా చట్టాలను ఉల్లంఘించిన రామోజీరావును అరెస్టు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.


రామోజీకి శిక్ష ఖాయం



చట్టం కళ్లు గప్పి 1962 నుంచి చేస్తున్న ఆర్థిక అక్రమాల ఊబిలో రామోజీరావు పూర్తిగా కూరుకుపోయారు. ఆయన దాన్నుంచి బయటకు రాలేరు. ఆయన మా మామగారు కలిసే అన్నదాత పత్రికను పెట్టారు. రామోజీరావు ప్రజల డబ్బుతో చట్ట విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నారని, ఏదో ఒక రోజు చట్టానికి దొరికిపోతారని మా మామ 30 ఏళ్ల క్రితమే చెప్పారు. రామోజీ అక్రమాలన్నీ ఇప్పుడు బయటకు వస్తున్నాయి. ఘోస్ట్ చందాదారుల పేరిట భారీ ఎత్తున ఆర్థిక అక్రమాలకు పాల్పడుతున్నారు. చందాదారులుగా ఉన్నవారిలో చాలా మందికి అసలు ఆ విషయమే తెలియదు. వారి సంతకాలను ఫోర్జరీ చేసి వారి పేరిట అక్రమంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. చిట్‌ఫండ్ చట్టం ప్రకారం డిపాజిట్లు సేకరించకూడదు. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులకు చిట్టీ పాట మొత్తం చెల్లించకుండా అక్రమ డిపాజిట్లుగా మళ్లిస్తోంది. రామోజీకి చట్ట ప్రకారం శిక్ష విధించమే మిగిలింది.

– నాగార్జునరెడ్డి, ప్రముఖ ఆర్థిక నిపుణుడు


ఫెమా, ఫెరా చట్టాల ఉల్లంఘన



చంద్రబాబు అధికారంలో ఉండగా రాష్ట్రంలో కొన్ని వందల చిట్‌ఫండ్ కంపెనీలను మార్గదర్శి వ్యాపార ప్రయోజనాల కోసం బలవంతంగా మూసివేశారు. చిట్టీ పాడుకున్న వ్యక్తి ఏ కారణంతోనైనా వాయిదాలు చెల్లించకపోతే చిట్ రిజిస్ట్రార్ దగ్గర కేసులు వేసి వేధించారు. అందుకు చంద్రబాబు ప్రభుత్వం సహకరించింది. కోర్టుల ద్వారా సివిల్ సూట్‌లు వేయాల్సిన సందర్భంలో చిట్ రిజిస్ట్రార్‌కు చంద్రబాబు ప్రభుత్వం హక్కులు కల్పించడం నిబంధనలకు విరుద్ధం. అదే అదనుగా చందాదారుల ఆస్తుల జప్తు, శాలరీ అటాచ్‌మెంట్‌లకు పాల్పడి రామోజీరావు తన సొంత ఆస్తులు పెంచుకున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు మూడు రాష్ట్రాలకు సంబంధించింది. విదేశాల్లో ఉన్న వాళ్లు కూడా చిట్స్ వేశారు. ఇది కచ్చితంగా ఫెరా, ఫెమా చట్టాల ఉలంఘనే. ఈ కేసులో రామోజీరావుకు నోటీసులు ఇవ్వడమే కాదు అరెస్టు చేయాలి.

– అరుణ్ కుమార్, హైకోర్టు న్యాయవాది


జీజే రెడ్డి దగ్గర గుమాస్తాగా చేరి



మార్గదర్శి చిట్‌ఫండ్స్ రామోజీరావు ఆర్థిక అక్రమ సామ్రాజ్యం. కృష్ణా జిల్లా జొన్నపాడుకు చెందిన గాదిరెడ్డి జగన్నాథరెడ్డి (జీజే రెడ్డి) దగ్గర రామోజీరావు గుమాస్తాగా చేరారు. తర్వాత పరిణామాలతో పలు కేసులతో జీజే రెడ్డి అదృశ్యమయ్యారు. అప్పటికి మార్గదర్శిలో రామోజీరావుకు కొద్ది షేర్లు మాత్రమే ఉండగా జీజే రెడ్డికి 288 షేర్లు ఉన్నాయి. ఆయన ఆస్తులు, షేర్లు జప్తు చేయాలని ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు ఆదేశించింది. కానీ జీజే రెడ్డి షేర్లను అప్పగించకుండా అలానే కొనసాగించి 2016లో శైలజా కిరణ్ పేరిట బదిలీ చేశారు. ఇప్పుడు వాటి విలువ దాదాపు రూ.200 కోట్లు వరకు ఉండొచ్చు. ఆ షేర్లను శైలజా కిరణ్ పేరిట ఎలా బదిలీ చేశారు? అందుకు షేర్ వ్యాల్యూషన్ సర్టిఫికేషన్ ఎవరు చేశారు? ఎవరి ద్వారా విక్రయించారో రామోజీరావు వెల్లడించాలి. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు ఈ దిశగా దర్యాప్తు చేయాలి.

– వెంకట్రామిరెడ్డి, కార్పొరేట్ న్యాయ నిపుణుడు

ముసుగులో నల్లధనం దందా



మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెబుతున్న రామోజీరావు అధికారుల తనిఖీలకు ఎందుకు సహకరించడం లేదు? అక్రమాలకు పాల్పడ లేదంటే ఫైళ్లను చూపించాలి కదా? ఫిర్యాదు చేయలేదు కాబట్టి దొంగతనం జరిగినా, ఎవరినైనా హత్య చేసినా పోలీసు అధికారి చర్యలు తీసుకోకూడదా? రామోజీరావు అడ్డగోలు వాదన అలానే ఉంది. ఎవరైనా చందాదారులు తమ ఆర్థిక అవసరాల కోసమే చిట్టీ పాట పాడతారు. అప్పుడు కూడా చిట్టీ మొత్తం ఇవ్వకుండా డిపాజిట్‌గా మళ్లిస్తామంటే ఎలా? బ్యాంకులో డిపాజిట్ చేస్తే 7 శాతం వడ్డీ వస్తుంది. మార్గదర్శి అక్రమ డిపాజిట్లుగా మళ్లిస్తూ 4 శాతమే ఇస్తోంది. అది దోపిడీ కాదా? రూ.కోటికంటే ఎక్కువ డిపాజిట్లు చేసినవారు 800 మందికిపైగా ఉన్నారని వెల్లడైంది. అదంతా నల్లధనం దందానే కదా.

– కొమ్మినేని శ్రీనివాసరావు, చైర్మన్, ఏపీ మీడియా అకాడమీ

చందాదారుల సొమ్ముతో సొంత పెట్టుబడులు



కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల నిధులను తమ సొంత వ్యాపార ప్రయోజనాల కోసం మళ్లించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును ఉషోదయ ఎంటర్‌ప్రైజస్, ఉషా కిరణ్ మీడియా లిమిటెడ్ సంస్థల్లో 87 శాతం వాటా కింద తమ సొంత పెట్టుబడిగా మళ్లించారు. నిధులు ఎలా మళ్లించారన్నదానికి రామోజీరావు సమాధానం చెప్పాలి. 2014 నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తమ చందాదారుల వివరాలను ఆంధ్రప్రదేశ్ చిట్ రిజిస్ట్రార్‌కు సమర్పించడం లేదు. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం ఉంది కాబట్టి ఆంధ్రప్రదేశ్ చిట్ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వబోమనడం సరికాదు. 37 బ్రాంచీల వివరాలను ఏపీ చిట్ రిజిస్ట్రార్‌కు సమర్పించాలి.

– వై.నాగార్జున యాదవ్, చైర్మన్, ఏపీఈడబ్ల్యూఐడీసీ

ప్రభుత్వ టీచర్లకు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కోర్సులు

- సాల్ట్ ప్రాజెక్టులో భాగంగా ప్రత్యేక శిక్షణ
- ఫిర్కి యాప్‌లో ఆన్‌లైన్ కోర్సుల కంటెంట్
- నవంబర్ 30 లోగా టీచర్లు కోర్సులు పూర్తి చేయాలి
- సమగ్ర శిక్ష ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు టీచర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కోర్సుల నిర్వహణకు సమగ్ర శిక్ష అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యాస ఫలితాలు, బోధన పద్ధతుల్లో నాణ్యత పెంపే లక్ష్యంగా చేపట్టిన సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమంలో భాగంగా ఈ కోర్సులు నిర్వహిస్తున్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాలను పెంపొందించేలా ఈ కోర్సులు ఉంటాయి. వీటిని బ్లెండెడ్ మోడల్ విధానంలో టీచర్లకు అందిస్తారు. ఆన్‌లైన్ శిక్షణలో భాగంగా వీడియోలు, రీడింగ్ మెటీరియల్, పలు రకాల టెస్టులు వీటిలో ఉంటాయి. ఈ ఆన్‌లైన్ కోర్సులు 'ఫిర్కి' అనే ఉపాధ్యాయ శిక్షణ వేదిక యాప్ ద్వారా చేపడతారు. కోర్సులో నమోదైన ఉపాధ్యాయులు నిర్దిష్ట సమయంలో ఒక మాడ్యూల్‌ను పూర్తి చేసిన తరువాత స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో నిర్వహించే పీర్ లెర్నింగ్ సర్కిళ్ల ద్వారా ఆఫ్‌లైన్ శిక్షణ అందిస్తారు. టీచర్లందరూ నవంబరు 30వ తేదీలోగా ఈ కోర్సులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లాల విద్యాశాఖాధికారులకు సమగ్ర శిక్ష ఆదేశించింది. టీచర్లు శిక్షణ యాప్ ఫిర్కిని డౌన్‌లోడ్ చేసుకొనేలా చూడాలని సూచించింది. లేదా హెచ్‌టీటీపీఎస్://ఫిర్కి.కామ్‌లో నమోదు కావచ్చని పేర్కొంది. ఎస్సీఈఆర్టీ ఇప్పటికే 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్, సైన్సు, సోషల్ సైన్సు, గణితం ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా 'డెవలపింగ్ ఇంగ్లిష్ పెడగోగి' పేరుతో మొదటి కోర్సును చేపట్టింది. ఈ కోర్సు మూడు మాడ్యూళ్లలో ఉంది. నెలకొకటి చొప్పున ఈ మాడ్యూళ్లను టీచర్లకు అందిస్తున్నారు.

దుఃఖాలలో ఉద్వేగం పొందనివాడు,
సుఖాలకోసం తహతహ పడనివాడు,
రాగ, భయ, క్రోధాలను విడిచినవాడు స్థితప్రజ్ఞుడు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 9 సెప్టెంబర్ 2023

సంపన్న దేశాల కర్తవ్యం


నేటి నుంచి ప్రారంభం కాబోయే రెండు రోజుల జీ–20 శిఖరాగ్ర సదస్సుకు ఢిల్లీ సర్వసన్నద్ధమైంది. ఈ చరిత్రాత్మక సమావేశాలకు వివిధ దేశాధినేతలతోపాటు తరలివచ్చే వారి మంత్రులు, ఉన్నతాధికార గణం, వేలాదిమంది సిబ్బందితో దేశ రాజధాని నగరం సందడిగా మారింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తదితరులు ఢిల్లీ చేరుకున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాలు జీ–20లో సభ్యదేశాలుగా ఉన్నాయి. భారత్‌కు అధ్యక్ష హోదా వంతులవారీగా వచ్చిందే కావొచ్చుగానీ, వచ్చిన సమయం అత్యంత కీలకమైనది. కరోనా మహమ్మారి పర్యవసానంగా ప్రపంచం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అంతో ఇంతో కోలుకుంటుండగా ఉక్రెయిన్‌లో రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం మరింత కుంగదీసింది. పైకి రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పోరుగా కనబడుతున్నా అక్కడ వాస్తవంగా తలపడుతున్నది అమెరికా, రష్యాలే. ఇటు అమెరికా–చైనాల మధ్య తీవ్ర వైరుధ్యాలున్నాయి. చైనాకూ మనకూ మధ్య ఉన్న సమస్యలు సరేసరి. సరిహద్దుల్లో ఏదో సాకుతో గిల్లికజ్జాలకు దిగటం, కొత్త మ్యాప్‌లు ముద్రిస్తూ కవ్వించాలని చూడటం చైనాకు రివాజైంది. ఈ సమస్యలేవీ జీ–20లో ప్రస్తావనకు రాకున్నా, ఎజెండాలో ఈ అంశాలే లేకున్నా, వాటి నీలినీడలు శిఖరాగ్ర సదస్సుపై పడకతప్పదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ సమావేశాలకు హాజరు కాబోరని ఆ దేశం ప్రకటించింది. ఉక్రెయిన్ విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్ నేపథ్యమే ఇందుకు కారణం. ఇక అమెరికాతోపాటు మనపైనున్న కంటగింపు పర్యవసానంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ముఖం చాటేశారు. ఆయన బదులు పెద్దగా అధికారాలు లేని ప్రధాని లీ కియాంగ్‌ను ఆ దేశం పంపుతోంది.

ప్రపంచ ఆర్థిక, ద్రవ్య సంబంధ అంశాలతోపాటు మారిన కాలానికి అనుగుణమైన నియంత్రణ వ్యవస్థలను అమల్లోకి తీసుకురావటం, వాతావరణ సమస్యలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలు, కార్పొరేట్ దిగ్గజ సంస్థలపై విధించే పన్నులు, బహువిధ అభివృద్ధి బ్యాంకులను వర్తమాన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దటం వంటి అంశాలు జీ–20లో ప్రధానంగా చర్చకు రాబోతున్నాయి. వీటన్నిటిపైనా ఎంతవరకూ ఏకాభిప్రాయం కుదురుతుందో, శిఖరాగ్ర సమావేశాల అనంతరం సంయుక్త ప్రకటన వెలువడేందుకు ఏమాత్రం అవకాశం ఉంటుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. 'ఒకే భూమి – ఒకే కుటుంబం – ఒకే భవిష్యత్తు' మకుటంతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సదస్సు విజయ వంతమైతే ఆ కీర్తిప్రతిష్ఠలు మనకే దక్కుతాయి. అయితే దేశాలు చీలికలు పేలికలుగా విడిపోయిన వర్తమాన యుగంలో అదెంతవరకూ సాధ్యమో చెప్పలేం. మారిన అంతర్జాతీయ పరిస్థితులు ఐక్యరాజ్యసమితి మొదలుకొని డబ్ల్యూహెచ్‌ఓ, డబ్ల్యూటీవో వరకూ అనేకానేక వేదికలపై ప్రతిబింబిస్తున్నప్పుడు జీ–20 వాటికి భిన్నంగా ఉండాలనుకోవటం అత్యాశే కావొచ్చు. కానీ సామరస్యత కోసం ప్రయత్నించటం కొనసాగాలి.

రష్యా, చైనా ఒక పక్క– అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి సంపన్న దేశాలు మరో పక్క మోహరించివున్న ప్రస్తుత వాతావరణంలో పేద దేశాల స్వరాన్ని గట్టిగా వినిపించాల్సిన చారిత్రక అవసరం ఎంతో ఉంది. ధనిక, బీద దేశాలకు సభ్యత్వం ఉండి, వాటిమధ్య సంభాషణలు సాగే అతి తక్కువ అంతర్జాతీయ వేదికల్లో జీ–20 ఒకటి. అగ్ర దేశాల పంచాయతీకే ఈ సంస్థ పరిమితమైతే పేద దేశాల సమస్యలకు చోటుండదు. పేద దేశాల సమస్యలు సాధారణమైనవి కాదు. ఇన్నేళ్లా అభివృద్ధి పేరుతో, లాభార్జనే ధ్యేయంగా ధనిక దేశాలు విచ్చలవిడిగా వినియోగించిన శిలాజ ఇంధనాల కారణంగా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగి భూగోళం వేడెక్కింది. ఇందువల్ల దక్షిణార్థ గోళంలో ఉన్న పేద దేశాలకే అధిక నష్టం సంభవిస్తోంది. వచ్చే నవంబర్ నెలాఖరులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన దుబాయ్‌లో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ) సదస్సు జరగబోతోంది. పర్యావరణ సమస్యలన్నీ అక్కడే చర్చించవచ్చునని ధనిక దేశాలు తప్పించుకునే ప్రయత్నం చేయొచ్చు. దీన్ని సాగనీయకూడదు. 2021లో రోమ్‌లో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు 'అర్థవంతమైన చర్యల ద్వారా భూగోళానికి ముప్పు కలగకుండా చూస్తామనీ, విదేశాల్లోని బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కర్మాగారాలకు ఆర్థిక సాయం అందకుండా చూస్తామ'నీ ధనిక దేశాలు హామీ ఇచ్చాయి. ఈ వాగ్దానంలో ధనిక దేశాల్లోని కర్మాగారాల ఊసు లేదు. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి రికార్డు స్థాయికి చేరింది. వర్తమాన సంవత్సరంలో ఈ రంగంలో పెట్టుబడులు ఎన్నడూ లేనంతగా 15,000 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని అంచనా. అంటే రోమ్‌లో చేసిన బాసలకు విలువే లేదన్న మాట. దీనిపై ప్రస్తుత సదస్సులో నిలదీయాలి. జీ–20 సభ్యత్వంలోనూ ఎన్నో తిరకాసులున్నాయి. నూతన ఆర్థిక శక్తిగా ఎదగటం మాట అటుంచి, కనీసం 20 ఉన్నత స్థాయి ఆర్థిక వ్యవస్థల్లో కూడా ఒకటిగా లేని అర్జెంటీనాకు సంస్థలో సభ్యత్వం ఉంది. పోర్చుగల్, ఈజిప్టు వంటి దేశాలకు చోటులేదు. ఒక సంస్థగా చెప్పుకోదగిన విజయాలు ఎందుకు సాధించలేదో, అందుకు అడ్డుపడుతున్నవేమిటో జీ–20 ఆత్మవిమర్శ చేసుకోవాలి. భవిష్యత్తరాలకు సురక్షితమైన భూగోళాన్ని అప్పగించాలంటే సంపన్న దేశాలుగా తాము చేయాల్సిందేమిటో అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలు ఆలోచించాలి. అంతర్జాతీయ సంబంధాలు ఛిద్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తలకిందులయ్యే ప్రమాదం ఉంటుందని గుర్తెరిగి ధనిక దేశాలు బాధ్యతగా మెలగాలి.

నెత్తురంటిన ఆ చేతులెవరివి బాబూ?

విశ్లేషణ



కంచ ఐలయ్య షెపర్డ్

కొన్నేళ్ల పాటు మావోయిస్టుగా గడిపిన అజ్ఞాత జీవితం, విప్లవ గాయకుడిగా, గ్రామాల్లో, నగరాల్లో బహిరంగ ప్రదర్శనలు ఇచ్చిన జీవితం, దశాబ్దాలుగా ఎదుర్కొన్న రాజ్య నిర్బంధం అనేవి గద్దర్ పాటను దాదాపు ప్రతి ఇంటికీ మోసుకెళ్లాయి. భారత దేశవ్యాప్తంగా విశిష్టమైన రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక చిహ్నంగా ఆయన ఉండిపోయారు. ప్రభుత్వ ఏజెన్సీలు 1997లో ఆయనపై బుల్లెట్లు పేల్చాయి. దాదాపు 25 ఏళ్లపాటు వెన్నెముకలో దిగిన బుల్లెట్‌తోనే ఆయన జీవించారు. అలాంటి జీవితం మానవ చరిత్రలో కనీవినీ ఎరుగం. ఆ సమయంలో రాష్ట్రపాలకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు చేతులకు నెత్తురంటింది. శ్మశానంలో ఉన్న గద్దర్ దేహంలోని బుల్లెట్ దీనికి శతాబ్దాలపాటు సాక్షీభూతంగా నిలుస్తుంది.

2023 ఆగస్ట్ 6న ప్రజాగాయకుడు గద్దర్ అనూహ్య మరణం, కడసారి చూడడానికి తరలి వచ్చిన వేలాది ప్రజల మధ్య బౌద్ధ ఆచారాలతో జరిగిన ఆయన ఖననం... భారతీయ కమ్యూనిస్టులకు కొత్త దారి చూపాయి. గద్దర్ కమ్యూనిస్టు విప్లవ గాయకుడిగా, పాటల రచయితగా, కళాకారుడిగా సుపరిచితుడు. కొన్నేళ్ల పాటు మావోయిస్టుగా గడిపిన అజ్ఞాత జీవితం, విప్లవ గాయకుడిగా, గ్రామాల్లో, నగరాల్లో బహిరంగ ప్రదర్శనలు ఇచ్చిన జీవితం, దశాబ్దాలుగా ఎదుర్కొన్న రాజ్య నిర్బంధం అనేవి గద్దర్ పాటను దాదాపు ప్రతి ఇంటికీ మోసుకెళ్లాయి. ప్రభుత్వ ఏజెన్సీలు 1997లో ఆయనపై బుల్లెట్లు పేల్చాయి. ఆ సమయంలో రాష్ట్రపాలకుడిగా ఉన్న చంద్రబాబు నాయుడు చేతులకు నెత్తురంటింది. శ్మశానంలో ఉన్న గద్దర్ దేహంలోని బుల్లెట్ దీనికి శతాబ్దాల పాటు సాక్షీభూతంగా నిలుస్తుంది. గద్దర్ దేహాన్ని దహనం చేసివుంటే, అది గుర్తించలేని బూడిదగా మారిపోయేది. సజీవమైన చారిత్రక సాక్ష్యం మిగిలి ఉండేది కాదు. మావోయిస్టుగా జీవించినప్పటికీ, బౌద్ధ అంత్యక్రియల ద్వారా బౌద్ధ అంబేడ్కరిస్టుగా మరణించిన ఆయన, శాంతికి ప్రతినిధిగా, 25 సంవత్సరాల పాటు గాయపడిన దేహ బాధితుడిగా మనకు మిగిలిపోయారు.

దాదాపు 25 ఏళ్లపాటు వెన్నెముకలో దిగిన బుల్లెట్‌తో ఆయన జీవించారు. అలాంటి జీవితం మానవ చరిత్రలో కనీవినీ ఎరుగం. శరీరంలోని పలు అవయవాల్లో ఆరు బుల్లెట్లు దూరిన స్థితితో ఆయన మనగలిగారు. శరీరంలో ఆరు బుల్లెట్లు దూరినప్పటికీ బతికి, చివరి వరకూ శరీరంలో ఒక బుల్లెట్‌తో జీవించినట్టు యుద్ధంలో పోరాడిన ఏ సైనికుడి గురించీ మనకు తెలీదు. ఆ రకంగా మానవ చరిత్రలోనే గద్దర్ ఒక విశిష్ట వ్యక్తి. అలాంటి జీవితం ఆయన్ని అపార ప్రజాదరణ, ప్రేమాదరణలు కలిగిన మనిషిగా మార్చింది. 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజన జరగడానికి ముందున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గద్దర్ పాడిన పాటలు, చేసిన ప్రదర్శనలు ఆయనకు ఎంతోమంది అభిమానులను సాధించిపెట్టాయి. ఆకలి, దోపిడీల నుంచి మానవ విముక్తి లక్ష్యం పట్ల ఆయన వహించిన నిబద్ధత... ఆయన్ని బాధామయ జీవితంలో గడిపేలా చేసింది.

అనంతరం 1996 నుంచి 2014 వరకు ప్రత్యేక రాష్ట్రంకోసం జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఆయన వహించిన పాత్ర వల్ల ఆంధ్రా ప్రజలు ఆయన పట్ల అయిష్టత ప్రదర్శించి ఉండవచ్చు. అయితే, ఒక రచయితగా, కళాకారుడిగా గద్దర్ భారత దేశవ్యాప్తంగా విశిష్టమైన రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక చిహ్నంగా ఉండిపోయారు.

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు పార్టీ ముందు అనేక తీవ్రమైన సైద్ధాంతిక అంశాలను లేవనెత్తి, 2012లో ఆ పార్టీ నుంచి విడిపోయారు. మార్క్స్, లెనిన్, మావోతోపాటు భారతీయ పరిస్థితులకు అనుగుణంగా మహాత్మా పూలే, అంబేడ్కర్‌లను కూడా గుర్తించడం



ద్వారా మావోయిస్టు పార్టీ కులానికీ, వర్ణానికీ వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందని గద్దర్ ప్రతిపాదించారు. భారతదేశంలో కులం ప్రతికూల పాత్ర గురించి పాటలు రాయడం, వేదికల మీద ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. దాంతో మావోయిస్టు పార్టీ గద్దర్ పనిని పార్టీ వ్యతిరేకమైనదిగా పరిగణించడమే కాదు... ఆయన అవగాహనను మార్క్సిజం కాదని ముద్రవేసి, ఆయన ప్రతిపాదనలను తిరస్కరించి, 2010లో షోకాజ్ నోటీసు ఇచ్చింది. విప్లవ పార్టీ తనను బహిష్కరించడం ఖాయమని గ్రహించిన గద్దర్ 2012లో మావోయిస్టు పార్టీకి రాజీనామా చేశారు. అయితే భారతీయ కుల–వర్గ దోపిడీకి అనుగుణంగా తన పార్టీ పంథాను మార్చడానికి గద్దర్ చేసిన ప్రయత్నం విస్మరణకు గురి కాకూడదు.

అంబేడ్కరైట్ నవయాన బౌద్ధమతం పట్ల తన ఆధ్యాత్మిక సామాజిక విధేయతను గద్దర్ బహిరంగంగా ప్రకటించారు. దళితుల, మహిళల అణచివేతపై అనేక పాటలు రాశారు. అతను ఒక యాంత్రిక మార్క్సిస్ట్, బౌద్ధ లేదా అంబేడ్కరైట్ కాదు. అత్యంత సున్నితత్వం కలిగిన మానవుడు.

భారతదేశంలోని కమ్యూనిస్టు నాయకులు వర్గపోరాటంతోపాటు సామాజిక సంస్కరణలను అవసరమైన అంశంగా ఎన్నడూ అంగీకరించలేదన్న విషయం అందరికీ తెలిసిందే. భారతీయ సాంఘిక సంస్కరణలో ఆధ్యాత్మిక సంస్కరణతో పాటు శ్రమకు గౌరవం, పురుషులతో స్త్రీల సమానత్వం కూడా భాగమై ఉన్నాయి. దానికి అంతిమ రూపం ఏదంటే కుల అసమానతలను, మహిళల అసమానతలను నిర్మూలించడం. అయితే, భారతీయ కమ్యూనిస్టులు ఆధ్యాత్మిక పరంగా తమను తాము నాస్తికులుగా ప్రకటించుకున్నారు. పైగా, ఆర్థిక నియతి వాదులుగా (ఆర్థికమే అన్నింటినీ నిర్దేశిస్తుంది అనే వాదం) వారు వర్గ ప్రశ్నలపైనే ప్రాథమికంగా దృష్టి పెట్టారు. కానీ వాస్తవానికి వారిలో ఎక్కువ మంది హిందువులుగానే మరణిస్తున్నారు. రోజువారీ జీవితంలో వారి నాస్తికత్వం ఎలాంటి సామాజిక సంస్కరణకు సంబంధించినదిగా లేదు. గద్దర్ తన మరణంతో వారికి ఒక పెద్ద సామాజిక, ఆధ్యాత్మిక సంస్కరణ కార్యక్రమాన్ని అందించారు.

అంబేడ్కర్ ఇలా అన్నారు: ''నేను అంటరాని వ్యక్తిని అనే కళంకంతో జన్మించిన దురదృష్టవంతుడిని. అయితే, ఇది నా తప్పు కాదు. కానీ నేను హిందువుగా మరణించను, ఎందుకంటే ఇది నా చేతుల్లో ఉంది.'' ఇలా ప్రకటించిన తర్వాతే ఆయన బౌద్ధుడు అయ్యారు, బౌద్ధుడిగా మరణించారు.

గద్దర్ అంటరాని వ్యక్తిగా జన్మించారు. అది ఆయన చేతుల్లో లేనిది. అనేక సాయుధ దళాలను కలిగి ఉన్న కమ్యూనిస్ట్ విప్లవ పార్టీలో పనిచేశారు. ఆయన వారి ప్రజా యుద్ధ నౌక. అయితే మరణ సమయంలో తన చేతుల్లో ఉన్న అధికారాన్ని ఉపయోగించి శాంతి సందేశంతో బౌద్ధుడిగా మరణించిన అంబేడ్కర్ జీవన సారాంశాన్ని గద్దర్ గ్రహించారు. తాను జీవితాంతం సమర్థించిన తుపాకులు ఆ అంటరానితనం నుండి విముక్తి చేయలేదు. అందువల్లనే గద్దర్ బౌద్ధుడయ్యారు, అంటరానితనం నుండి విముక్తి పొందారు. ముఖ్యంగా, బూటకపు ఎన్‌కౌంటర్లలో చిత్రహింసలు పెట్టి, వందలాది మృతదేహాలను తగులబెట్టిన ఆ రాజ్య వ్యవస్థకు వ్యతి రేకంగా పోరాడిన వ్యక్తిగా, తన శరీరాన్ని, బుల్లెట్‌ని దహనం చేసేస్తే ఆ తర్వాత తనను హింసించినట్లు ఎటువంటి ఆధారాలు మిగిలి ఉండ వని గద్దర్ గ్రహించారు.

ఆ మృతదేహాలను ఖననం చేసినట్లయితే, దశాబ్దాల తర్వాత కూడా వాటిని వెలికితీసి మళ్లీ పరీక్షించవచ్చు. అందువల్ల గద్దర్ తన శరీరంలోని బుల్లెట్‌తో పాటు ఖననం చేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. 1997లో చంద్రబాబు నాయుడి క్రూర పాలనకు నిదర్శనంగా ఆయన వెన్నులో బుల్లెట్ అలాగే ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చంద్రబాబు కబ్జా చేసిన పార్టీకి ఆయన మామ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ అని పేరు పెట్టారు. అదే సమయంలో గద్దర్ తెలుగు నేల అందించిన అత్యంత శక్తిమంతమైన తెలుగు రచయిత, గాయకుడు, సంభాషణకర్త.

గద్దర్ నివసించిన బస్తీలో మహాబోధి విద్యాలయం పేరుతో ఆయన స్థాపించిన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుల్లెట్‌తోపాటు ఆయన భౌతికకాయాన్ని ఖననం చేశారు. చంద్రబాబు ఆ సమాధి వద్దకు వెళ్లి, సాష్టాంగ నమస్కారం చేసి, తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1997 ఏప్రిల్ 6న ఏమి జరిగిందో కనీసం ఇప్పుడైనా నిజం చెప్పినట్లయితే, దేశం మొత్తం చంద్రబాబుని క్షమిస్తుంది. అలా పశ్చాత్తాపం ప్రకటించిన తర్వాత చంద్రబాబు తన జీవితాంతం కచ్చితంగా మనిషిగా జీవించగలరు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అభ్యర్థిని ఎన్నుకోవాలి



ముఖ్యమైన ఏ రాజకీయ పార్టీ అంతర్గత ఎన్నికలు నిర్వహించడం లేనందున, వాటిని మనం(బీజేపీ) అనుసరించాలని సూచిస్తున్నాను. యూఎస్ విధానంలో ఆశావహులు వివిధ అంశాల మీద చర్చలు జరిపాక, ఎంపికైనట్టుగానే మనం కూడా ప్రధానమంత్రి అభ్యర్థిని అలా ఎన్నుకోవాలి.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

పెరుగుతున్న ప్రాధాన్యం



జీ–20 శిఖరాగ్ర సమావేశాలకు ముందు రష్యా విదేశాంగ మంత్రి లవ్‌రోవ్‌కు, సమావేశం అయిన వెంటనే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రోన్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇస్తోంది. గొప్ప అధికార పోటీదారులకు యుద్ధక్షేత్రంగా, సరితూనికగా భౌగోళిక రాజకీయాల్లో బంగ్లాదేశ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత ఇప్పుడు విస్మరించలేనిది.

– మైకేల్ కుగెల్‌మాన్, కాలమిస్ట్

నా సానుభూతి



మారిముత్తు (నటుడు, దర్శకుడు) అద్భుతమైన మనిషి. ఆయన మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎడబాటుకు గురైన ఆయన కుటుంబానికి హృదయపూర్వక సానుభూతి.

– రజనీ కాంత్, నటుడు

బాధాకరం



అజిత్ నైనన్ (కార్టూనిస్ట్) మనల్ని విడిచి వెళ్లడం బాధాకరం. ఇప్పుడు మనం జీవిస్తున్న కష్టకాలంలో ఆయన ఇల్లస్ట్రేషన్లు సూక్ష్మమైన లోచూపును అందిస్తాయి. ప్రగాఢ సానుభూతి.

– సీతారాం యేచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

ఇంత హడావుడా?




సాధారణ సమావేశాలను అసాధారణమైనవిగా కనబడేలా చేయడమే ఇండియా జీ–20 సమావేశాల నిజమైన ఉద్దేశం అని నేను అనుకుంటున్నాను.

– ప్రవీణ్ సహానీ, జర్నలిస్ట్

బ్లూ ఎకానమీ గురించి మాట్లాడరా?

విశ్లేషణ



జాన్ సన్ చోరగుడి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తన ఐదవ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఈ ఆగస్టు 15న వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి – 'అంటరానితనం' అనే పదాన్ని తన అధికారిక ప్రసంగంలో ప్రస్తావించి, అనూహ్యంగా మరోసారి పరిశీలకుల దృష్టిని తన వైపుకు తిప్పుకున్నారు. ప్రగతిశీల వాదులు సైతం – ఇంకా అదెక్కడ ఉందంటూ కనిపిస్తున్న దాన్ని – 'కార్పెట్' కిందికి తోస్తుంటే; అదేమీ కాదని జగన్ పనిమాల – 'అంటరానితనం' ప్రస్తావనను అధికారిక వేదికపై తెచ్చారు. దాంతో ఇంతకూ అదిప్పుడు ఉందా లేదా? ఉంటే ఏమిటి? అనే చర్చను మన ముందుకు తెచ్చారు. ఇక ఇప్పుడు కార్య సాధకులు కనుక ఎవరైనా ఉంటే వారు ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను అబద్ధం చేసే పని చేపట్టవచ్చు.

సీఎం మాటల్లోనే అది– 'ఈ నాలుగేళ్ల పాలనలోనే, రూపం మార్చుకున్న అంటరానితనం మీద, పేద వర్గాలను అణచివేస్తున్న ధోరణుల మీద యుద్ధాన్ని ప్రకటించాం. అంటరానితనం అంటే, ఫలానా వ్యక్తుల్ని కేవలం భౌతికంగా ముట్టుకోటానికి వీల్లేదని దూరం పెట్టటం మాత్రమే కాదు, పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో ఆ గవర్న మెంట్ బడిని పాడుపెట్టటం, పేదలు ఏ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారో ఆ ఉచిత సేవలు వారికి అందకుండా ఖరీదు చేయటం, పేదలు ఏ బస్సు ఎక్కుతున్నారో ఆ బస్సును ప్రైవేటుకు అమ్మేయాలని చూడటం, పేదలు కోరుకునే చిన్నపాటి ఇళ్ళ స్థలాలన్నీ ఇంటిసీ వారికి ఇవ్వకుండా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం... ఇవన్నీ రూపం మార్చుకున్న అంటరానితనంలో పేదల మీద పెత్తందారీ భావజాలంలో భాగాలే. పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడేవరకూ ఇటువంటి అంటరానితనం మీద ఈ యుద్ధం కొనసాగుతుంది.' ఇలా సాగింది ఆ సందేశం.

ఈ సందేశం– 'గ్రామర్' ఏమై ఉంటుంది అని చూసినప్పుడు, సీఎంగా తన రెండవ టర్మ్‌లో చేపట్టబోయే కార్యాచరణకు జగన్ తొమ్మిది నెలలు ముందుగానే 'సామాజిక వాతావరణ' ముందస్తు హెచ్చరికను జారీ చేశారేమోనని అనిపిస్తున్నది.

అయితే, విమర్శకులు అనొచ్చు, ఎన్నికల ముందు రాజకీయ నాయకులు ఇలా కాకుండా మరెలా మాట్లాడతారు? అని. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పైకి కనిపించకుండా అమలవుతున్న సాంఘిక వివక్షను ఎదుర్కోవడానికి ఈ ప్రభుత్వం చేపడుతున్న చర్యల ప్రతిఫలానాలు – 'నీతి అయోగ్' వంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలు సైతం వెల్లడిస్తున్న నివేదికల్లో చూడవచ్చు.

పైకి కనిపించని సూక్ష్మం అనిపించే ఇటువంటి అంతర్గత అంతరాన్ని ఈ ప్రభుత్వం పట్టుకుంది. దాని మీద అది 'ఫోకస్' వేసి తగు నివారణా చర్యలు మొదలుపెట్టింది. అయితే, ఈ దృష్టికి ఒక చారిత్రక నేపథ్యం ఉంది. అది – రెండు వందల ఏళ్ళపాటు ఈ సర్కారు జిల్లాలు బ్రిటిష్ పాలనలో ఉండడం.



దాంతో – 'మిషన్ అప్రోచ్'తో ప్రజల వద్దకు వెళితే వాళ్ళతో 'కనెక్ట్' కావడం కష్టం కాదు అని నమ్మి, దాన్ని– సర్కారే కాదు, నైజాం జిల్లాల్లో కూడా అమలుచేసి; అవును నిజమే అని నిరూపించినవాడు వైఎస్సార్. దానికి కొనసాగింపుగా ఈ చారిత్రక నేపథ్యాన్ని – 'నాయకుడు'గా తననుతాను 'ప్రూవ్' చేసుకోవడానికి జగన్ గరిష్ఠ స్థాయిలో వాడుకోవడం వెలుగులోకి రాని అంశం. ఇప్పటికి మూడేళ్ళ క్రితమే తమ పార్టీ శ్రేణుల సమావేశంలో జగన్మోహన్ రెడ్డి నోటినుంచి– 'అవుట్ రీచ్' అనే పదం రావడం; 'మిషన్ అప్రోచ్'కి కొనసాగింపుగా ఇక్కడ గుర్తుచేసుకోవడం అవసరం.

ఇటీవల – 'సోషల్ ఇంజనీరింగ్' వంటి పదాలను పొలిటికల్ సర్కిల్స్‌లో దేశమంతా విరివిగా వాడుతున్నారు. అయితే, జగన్ విషయంలో దాన్ని ఆలా చూడడం కుదరడం లేదు. అందుకు కారణం – ఆయనలా గతంలో సామాజిక దొంతర్ల పొరల్లోకి ఛేదించుకుంటూ లోపలికి వెళ్లినవారు మనకు కనిపించరు. ఆర్థిక ప్రయోజనాలు అందే పథకాలు అంటే సరే, కానీ 'పవర్ పాలిటిక్స్'లోకి వచ్చే కొత్త సామాజిక వర్గాలకు– 'లెవెల్ ప్లేగ్రౌండ్' గతంలో ఎక్కడిది? ప్రముఖ తెలుగు నవల 'మాలపల్లి' (1922) లో రచయిత ఉన్నవ లక్ష్మినారాయణ ప్రతిపాదించిన 'నిమ్న వర్గాల రాజకీయ నాయకత్వాని'కి, ఇది 21వ శతాబ్ది 'వెర్షన్' అన్నట్టుగా... కొత్త ఆశలు ఇక్కడ కనిపిస్తున్నాయి. కొందరికి అది పొసగకపోవడం అంటారా, అది వేరే విషయం.

సంక్షేమం సరే, 'అభివృద్ధి' ఏది? అనేది ఈ ప్రభుత్వం వైపు వేలు చూపించేవారి అతి తేలికైన ప్రశ్న. ఈ ప్రశ్న తర్వాత వెంటనే వీరు – 'హైదరాబాద్' అంటారు. ఇక్కడి సంపన్న జిల్లాల సొమ్ము అక్కడ అనుత్పాదక రంగాల్లో పెట్టుబడులై, జరిగిన – అర్బన్ 'అభివృద్ధి' నమూనా ఇప్పుడు ఇక్కడ వద్దా? అనేది వీరి ప్రశ్న. కనీస భౌగోళిక వాస్తవిక స్పృహ లేని వాదనలివి. రాష్ట్ర విభజన జరిగాక, 2014–19 మధ్య– 'సన్ రైజ్ స్టేట్' అంటూ తీరాన్ని 'బ్రాండింగ్' చేస్తూ, 'కార్పొరేట్' తరహా 'పబ్లిసిటీ'కి దాన్ని పరిమితం చేయడం మాత్రమే జరిగింది తప్ప; అప్పట్లోనే ఆ సూర్యోదయ తూర్పుచూపుతో ప్రణాళికా రచన మొదలయివుంటే, ఇప్పటికి పరిస్థితి మరోలా ఉండేది.

సముద్రతీర రాష్ట్రానికి 'బ్లూ ఎకానమీ' లక్ష్యంగా విశాఖ పట్టణం కేంద్రిత చూపు కాకుండా, ఇంకా హైదరాబాద్ అంటూ పాతపాట ఏమిటి? అనే ఇంగితం పదేళ్ల తర్వాత కూడా ఈ విమర్శకులకు తట్టకపోవడం విడ్డూరం. ఆంధ్రప్రదేశ్‌లో రూ. 15,375 కోట్లతో– రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్ వే పోర్టులు; రూ. 3,521 కోట్లతో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి అవుతున్నాయని వీరికి పట్టదు. కారణం ఇక్కడ కూడా వివక్షే. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లలో ఉపాధి అనేసరికి వీటిలో సంపన్న వర్గాల యువత కంటే, దిగువ మధ్య తరగతి యువత ఉపాధికి జరిగే ప్రయోజనం ఎక్కువ. వీటి గురించి మాట్లాడకుండా ఉండడం అంటే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని తిరస్కరిస్తున్నట్టే!

వ్యాసకర్త సామాజిక, అభివృద్ధి అంశాల విశ్లేషకులు

యంత్రంతో కబుర్లు...

అభిప్రాయం



కె.బి. గోపాలం

విదేశాల నుంచి వచ్చిన మా పిల్లలు ఈ మధ్యన చాట్ జీపీటీ, బార్డ్‌లను గురించి ప్రస్తావన చేశారు. వాటిని వాడి చూడండి అని కూడా సలహా ఇచ్చారు. దీంతో నాకు ఇష్టమైన రవీంద్ర నాథ్ ఠాగూర్ రచనలను గురించి చెప్పమని జీపీటీని అడిగాను. రకరకాల పుస్తకాలు చదివి కూడా నేను రాయలేనంత మంచి వ్యాసాన్ని ఆ యంత్రం నాకు అందించింది. ఇంకొంచెం లోతుగా వెళ్లి రవీంద్రుని నవలల్లో స్త్రీ పాత్రల గురించి వ్యాఖ్యానం అడిగాను. చెప్పను, చెప్పలేను అనకుండా ఏదో కొంత చెప్పి అది తప్పించుకున్న తీరు చూస్తే, నాకు అది యంత్రం అనిపించలేదు. నిజంగా ఆలోచించే మనిషి చెప్పినట్టే ఉంది ఆ జవాబు. 'నాకు నిజానికి కొంత కాలం కిందటి వరకు ఉన్న అంశాలు మాత్రమే తెలుసు, మరీ వివరంగా జవాబులు ఇవ్వలేను' అని మొహ మాటం లేకుండా చెప్పేసిందా యంత్రం.



ప్రపంచమంతా అందరూ ఈ చాట్ యంత్రాల గురించి నానా హంగామా చేస్తున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటే అది జ్ఞానమే కానీ, మనిషి జ్ఞానం కాదు. చాలామంది మనుషుల జ్ఞానాన్ని ఒకచోట పెట్టి, వాటి ఆధారంగా మాట్లాడుతాయి ఈ యంత్రాలు. కనుక కొన్ని చోట్ల పప్పులో కాలు వేస్తాయంటే, అందులో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

ఆ చెప్పే జవాబులను ఏదో ఒక గొంతుతో చెబితే మనిషి మాట్లాడిన ప్రభావం కనిపించేదేమో? ఇప్పటికి మాత్రం ఈ సంభాషణలు రాత ద్వారా జరుగుతున్నాయి. ఒకటి రెండు సంవత్సరాల కింది వరకు ఇంటర్నెట్‌లో చేరిన సమాచారాన్ని అంతా పరిశీలించి, వేరువేరు అంశాల గురించిన వివరాలను కంప్యూటర్లు ఒక చోటికి చేర్చుకుంటాయి. వాటి ఆధారంగా తమ ముందుకు వచ్చిన ప్రశ్నలకు జవాబులు చెపుతాయి.

ఈ చాట్ బాట్‌ల వెనుక ఒక గణాంక వ్యవహారం ఉందట. అంటే సమాచారాన్ని అదేదో లెక్క ప్రకారం అందించే పద్ధతి అని అర్థం. 'డీప్ న్యూరల్ నెట్ వర్క్స్' అనే ఒక వ్యవస్థలోకి ఒక్కొక్క విషయం గురించి పెద్ద ఎత్తున సమాచారాన్ని అందజేస్తారు. ఈ నెట్‌వర్క్స్ ఇంచుమించు మనిషి మెదడు లాగా పనిచేస్తాయి అంటున్నారు.

ఈ మధ్యన అందరికీ అందుబాటులోకి వచ్చిన చాట్ బాట్‌ల వెనుక 'ట్రాన్స్ ఫార్మర్' అనే మరొక కార్యక్రమం అందుబాటులోకి వచ్చింది. అది తయారయి ఐదారు ఏళ్ల మాత్రమే అయింది.

న్యూరల్ నెట్ వర్క్‌లలో కేవలం జ్ఞాపకశక్తి మాత్రమే కాకుండా అల్గోరిథమ్స్ ప్రకారం సమాచారాన్ని మరింత సరిదిద్దే ఏర్పాటు యంత్రాలకు చేతనైంది. ఈ పరిస్థితిని 'ఎమర్జెన్సీ' అంటున్నారు. రాను రాను యంత్రాలు మరేం నేర్చుకుంటాయో అని పరిశోధకులే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

'సేపియన్స్', 'హోమో డేవుస్' వంటి పుస్తకాలు రాసిన యువాల్ నోవా హరారి కొంతకాలం పోతే మనుషులు అనవసరం అన్న సూచన చేశాడు. డాక్టర్లు, లాయర్లు వంటి వారి స్థానంలోనే కాకుండా, కళ, వైజ్ఞానిక రంగాలలో కూడా మనుషులకు బదులు యంత్రాలు వచ్చేస్తాయి, అని మరికొందరు కూడా సూచించారు. చాలామంది సంగీత దర్శకుల పాటలను గమనించి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యంత్రాలు కొత్త పాటలు స్వరపరుస్తున్నాయి. కథలు రాస్తున్నాయి. చిత్రాలు గీస్తున్నాయి. మానవ జీవితానికి సంబంధించిన అన్ని పనులకూ చాట్ జీపీటీపై ఆధారపడటం ఇంకెంతో దూరంలో లేదు.

వ్యాసకర్త రచయిత, అనువాదకుడు | 98490 62055

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: బ.దశమి రా 9.08 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఆరుద్ర సా.5.26 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.5.48 నుండి 7.29 వరకు, అమృతఘడియలు: ఉ.6.51 నుండి 8.33 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.06.

రోడ్ల పనులు కనిపించడం లేదా?

- రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న రోడ్ల నిర్మాణం
- టీడీపీ హయాంలో కంటే రెట్టింపు నిధులతో పనులు
- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రూ. 2,953.81 కోట్లు ఖర్చు
- వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగేళ్లలోనే రూ. 4,148.59 కోట్ల వ్యయం
- ఒక్క ఏడాదిలోనే 7,500 కి.మీ. రోడ్ల పునరుద్ధరణ



సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిత్యం అసత్య ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న రామోజీరావు.. రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై నీరు నిల్వ ఉన్న ప్రదేశాల ఫొటోలు ప్రచురించి ఈనాడు పత్రిక దిగజారుడు పాత్రికేయాన్ని ప్రదర్శించింది. 'సాఫీ ప్రయాణం సీఎంకేనా' అంటూ ఓ అసత్య కథనంతో పాఠకులను మోసగించేందుకు ప్రయత్నించింది. ఈనాడు కథనాన్ని ఖండిస్తూ.. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతూ ఆర్అండ్‌బీ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

అత్యంత ప్రాధాన్యతతో రోడ్ల నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోడ్ల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఏటా షెడ్యూల్ ప్రకారం రోడ్ల పునరుద్ధరణ పనులు చేపడుతోంది. రెండేళ్లపాటు కోవిడ్ ప్రభావం ఉన్నా సరే రోడ్ల పనులను నిర్లక్ష్యం చేయలేదు. నాలుగేళ్లుగా భారీ వర్షాలు కురుస్తున్నా రోడ్ల పునరుద్ధరణ పనులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలోనే రూ. 2,400 కోట్లు ఖర్చు చేసి 7,500 కి.మీ. మేర రోడ్లను పునరుద్ధరించింది. కానీ ఈ వాస్తవాన్ని ఈనాడు ప్రస్తావించనే లేదు.

రోడ్ల పనులు జరుగుతున్నాయి..

ఈనాడు కథనంలో 13 రోడ్లను పేర్కొంది. ఇందులో 9 రహదారులు ఆర్అండ్‌బీ విభాగానికి చెందినవి. అందులో 6 రోడ్ల మరమ్మతు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. మిగిలిన మూడు రోడ్ల పనులను కూడా త్వరలోనే చేపట్టేందుకు ఆర్అండ్‌బీ కార్యాచరణ వేగవంతం చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెరుగ్గా రోడ్ల నిర్మాణం

టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్ల మరమ్మతు పనులకు రూ. 2,953.81 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఏడాదికి సగటున రూ. 591 కోట్లు వెచ్చించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే రోడ్ల పునరుద్ధరణకు రూ. 4,148.59 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఏడాదికే సగటున రూ. 951 కోట్లు వెచ్చించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లోనే రూ. 346 కోట్లు ఖర్చు చేసింది. ఇక పంచాయతీరాజ్ శాఖ మరో రూ. 283 కోట్లతో రోడ్లు నిర్మించింది. రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి సకాలంలో పనులు పూర్తి చేస్తున్నా సరే తన మనిషి చంద్రబాబు సీఎంగా లేరన్న అక్కసుతో రామోజీరావు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.

పులివెందుల వెళ్లేందుకు సునీల్ యాదవ్‌కు హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు (ఏ–2) సునీల్ యాదవ్ పులివెందుల వెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. సునీల్ తండ్రి కృష్ణయ్య మరణించడంతో అంతిమ సంస్కారాలకు రెండు రోజులు, దినకర్మలకు మరో రెండు రోజులు.. నాలుగు రోజులకు అనుమతిచ్చింది. ఈ నెల 9, 10, 17, 18న ఎస్కార్ట్ సాయంతో పులివెందుల వెళ్లి రావాలని ఆదేశించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

తనకు పూర్తిస్థాయి బెయిల్ ఇవ్వాలన్న సునీల్ యాదవ్ పిటిషన్‌లో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. వివేకా హత్య కేసులో 2021 ఆగస్టు 2 నుంచి జైలులో ఉన్నానని, సీబీఐ చార్జిషీట్ కూడా దాఖలు చేసినందున బెయిల్ ఇవ్వాలని కోరుతూ సునీల్ యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున నయన్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. సీబీఐ కీలక ఆధారంగా పేర్కొన్న గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికం కాదని, అది సూచించిన సమయాలు తప్పు అని సీబీఐ కూడా ఒప్పుకుందని చెప్పారు. భారత జాతీయత అవసరం లేదు కానీ, వివేకా ఆస్తులకే వారసురాలన్నట్లు నర్రెడ్డి సునీత తీరు ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌లో తీర్పును రిజర్వు చేశారు.

టమాట రైతులకు అండగా ప్రభుత్వం

- వేలం పాటలో పాల్గొని కొనుగోలు చేయనున్న మార్కెటింగ్ శాఖ



కర్నూలు (అగ్రికల్చర్): ధరలు తగ్గుతుండటంతో టమాట రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యాపారులు సిండికేట్ కాకుండా చూడటం, ధర తగ్గుతున్నప్పుడు వేలం పాటలో పాల్గొని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇటీవల వరకు టమాట ధర చుక్కలనంటింది. ఆ సమయంలో జిల్లాలో టమాట పంట లేదు. ఇప్పుడు రైతులు సాగు చేసిన పంట ఒక్కసారిగా మార్కెట్‌ను ముంచెత్తడంతో ధరలు పడిపోయాయి. దీంతో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖకు దిశానిర్దేశం చేసింది. జిల్లాలోని పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో టమాట క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఈ నెల 9 నుంచి మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం పత్తికొండ మార్కెట్ యార్డులో జరిగే టమాట వేలం పాటలో పాల్గొంటుందని మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఎం) నారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం పత్తికొండ మార్కెట్‌లో టమాట ధర కిలోకు కనిష్టంగా రూ.7, గరిష్టంగా రూ.14 పలికింది. మోడల్ ధర రూ.10గా నమోదైంది. కనిష్ట ధర రూ.7 కంటే తక్కువకు పడిపోతున్నప్పుడు మాత్రమే మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన బృందం వేలంలో పాల్గొంటుంది. మార్కెటింగ్ శాఖ కూడా వేలంలో పాల్గొంటున్నందున వ్యాపారుల మధ్య పోటీ పెరిగే అవకాశం ఉంటుంది. మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసిన టమాటను రైతుబజార్ల ద్వారా నో లాస్, నో ప్రాఫిట్ కింద వినియోగదారులకు విక్రయిస్తామని ఏడీఎం తెలిపారు.

శ్రీసిటీలో స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ విద్యార్థులు

- శ్రీసిటీ లక్ష్యాలను వివరించిన చైర్మన్ సి.శ్రీనిరాజు
- సంతృప్తి వ్యక్తం చేసిన స్టాన్‌ఫోర్డ్ బృందం సభ్యులు



వరదయ్యపాళెం: స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్‌మ్యాటిక్స్ (ఎస్‌టీఈఎం) విభాగానికి చెందిన 20 మంది అధ్యాపకులు, విద్యార్థులతో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. ప్రొఫెసర్ మైకేల్ కోచెండర్ ఫర్, పీహెచ్‌డీ స్కాలర్ డైలాన్ మిచెల్ ఆస్మార్ నేతృత్వంలోని ఈ బృందానికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ చైర్మన్ సి.శ్రీనిరాజు వర్చువల్ విధానంలో వారితో మాట్లాడారు. 1980లలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వర్క్, లివ్, లెర్న్, ప్లే సూత్రం ఆధారంగా పచ్చదనం, పరిశుభ్రత, పారిశ్రామిక అనుకూల వాతావరణంలో శ్రీసిటీ ప్రగతి సాగుతోందని తెలిపారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సౌర విద్యుత్ ఉత్పత్తి, నీటి నిర్వహణ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామిక విస్తరణ, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను కాపాడడంపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. భారతదేశంలో మొట్టమొదటి కార్బన్ న్యూట్రల్ పారిశ్రామికవాడగా శ్రీసిటీ అవతరించాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. శ్రీసిటీలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, ఇతర ప్రత్యేకతల గురించి సతీష్ కామత్ వివరించారు. పెప్సికో, క్యాడ్‌బరీస్, కోల్గేట్ పామోలివ్, వీఆర్‌వీ చాట్ ఇండస్ట్రీస్, బాల్ కార్పొరేషన్, కెల్లాగ్స్, వెస్ట్ ఫార్మాతో సహా 11 ప్రముఖ అమెరికన్ కంపెనీలతో పాటు ప్రపంచంలోని 28 దేశాలకు చెందిన 210 పరిశ్రమలు శ్రీసిటీలో ఏర్పాటైనట్లు తెలిపారు. శ్రీసిటీ అభివృద్ధి పట్ల స్టాన్‌ఫోర్డ్ బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీసిటీ మోడల్, ఇక్కడ అమలు చేస్తున్న సుస్థిరత కార్యక్రమాలను నేరుగా వీక్షించి అర్థం చేసుకోవడమే తమ పర్యటన ముఖ్య ఉద్దేశంగా వారు తెలిపారు. అనంతరం శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు.

పేదల 'ఇళ్ల'ను అడ్డుకోవడం దుర్మార్గం

1,076వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: అమరావతి పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టిన బాబు అండ్ కో పేదల ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,076వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో 1,400 ఎకరాల లంక, అసైన్డ్ భూములను పేదలను బెదిరించి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన బాబు, నారాయణ అండ్ కో వాటిని చట్టబద్ధం చేసుకుని రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. పూలింగ్ పేరుతో రైతుల ముసుగులో జరిగిన అవినీతి వ్యవహారంపై జరిగిన అవినీతిని వెలికితీసి అరెస్టు చేసి విచారణ చేస్తే అసలు నిందితులు బయటకు వస్తారన్నారు. సీఎం జగన్ దృఢ సంకల్పంతో.. బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో బహుజనులకు రాజధాని ప్రాంతంలో 54 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారని అన్నారు. అయితే పేదలు ఈ ప్రాంతంలో ఇళ్లు కట్టుకోకుండా అడ్డుపడుతున్న కులవాదులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు బేతపూడి సాంబయ్య, పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.



జై సియా రాం

భారత మూలాలున్న బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతులకు శుక్రవారం ఉదయం పాలం విమానాశ్రయంలో.. కేంద్ర మంత్రి అశ్వినీ కుమార్ చౌబే జై సియా రాం(జై శ్రీరాం) అంటూ స్వాగతం పలికారు. వారికి మంత్రి చౌబే రుద్రాక్షను, భగవద్గీత, హనుమాన్ చాలీసా ప్రతులను కానుకలుగా అందజేశారు.

వ్యాపారవేత్తలకు ఆహ్వానాల్లేవ్..

జీ20 ప్రత్యేక విందు కార్యక్రమానికి వ్యాపార దిగ్గజాలకు ఆహ్వానాలు వెళ్లాయన్న వార్తలపై కేంద్రం స్పందించింది. జీ20 స్పెషల్ డిన్నర్‌కు రావాలంటూ వ్యాపారవేత్తలను ఆహ్వానించలేదని స్పష్టం చేసింది. శనివారం జరిగే విందుకు బిలియనీర్లు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి 500 మందికి పైగా వ్యాపారవేత్తలు హాజరవనున్నారంటూ వస్తున్న వార్తలను తప్పుదోవపట్టించేవిగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వాణిజ్యవేత్తలెవరినీ ఆహ్వానించలేదని తెలిపింది.

యూపీఐని పరిచయం చేసేందుకు..

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'డిజిటల్ ఇండియా' కార్యక్రమంపై జీ20 ప్రతినిధులకు ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంది. విదేశీ ప్రతినిధులు ఢిల్లీలో ఉండగా జరిపే కొనుగోళ్లకు గాను యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) ద్వారా చెల్లింపులపై ఆసక్తి కల్పించేందుకు చర్యలు తీసుకుంది. దేశీయంగా రూపకల్పన చేసిన ఈ విధానంలో చెల్లింపులు ఎంత సులువో వారికి తెలియజేయడమే ఉద్దేశం. ఇందులోభాగంగా సుమారు వెయ్యి మంది విదేశీ ప్రతినిధుల ఫోన్ వ్యాలెట్లలో రూ.500 నుంచి రూ.1000 వరకు బ్యాలెన్స్ జమ చేయనుంది. ఇందుకోసం రూ.10 లక్షల వరకు ప్రత్యేకించింది.

ప్రత్యేకంగా వాతావరణ కేంద్రం

జీ20 సమావేశాలు జరిగే ప్రగతి మైదాన్‌కు సమీపంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అదనంగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచ నేతలు పాల్గొంటున్న కార్యక్రమం అయినందున ఈ వాతావరణ కేంద్రం ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు చేస్తుంది. గురువారం నుంచి ఆదివారం వరకు ఇది నిర్విరామంగా వాతావరణాన్ని పరిశీలిస్తుంటుంది. ఐఎండీకి చెందిన వెబ్‌పేజీ mausam.imd.gov.in/g20 ద్వారా వాతావరణ సూచనల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

స్ట్రీట్ ఫుడ్, మిల్లెట్స్‌తో ప్రత్యేక మెనూ

భారత్‌లో ఈ సీజన్‌లో ప్రజలు ఎక్కువగా ఇష్టపడే వంటకాలతో ప్రత్యేకంగా మెనూ సిద్ధమైంది. భారతీయ స్ట్రీట్ ఫుడ్ ఐటమ్స్‌తోపాటు మిల్లెట్లతో చేసిన ఆహార పదార్థాలకు ఇందులో స్థానం కల్పించారు. ఇంకా గులాబ్ జామ్, రసమలై, జిలేబీ వంటి స్వీట్లు కూడా అతిథులకు వడ్డిస్తారు. వడ్డించే సిబ్బందికి ప్రత్యేక యూనిఫాం రూపొందించారు. మెనూలో ఫలానావి ఉంటాయని అధికారులెవరూ స్పష్టంగా చెప్పనప్పటికీ, భారతీయ వంటకాల్లో వైవిధ్యాన్ని చాటేలా మెనూ ఉంటుందని భావిస్తున్నారు.

ప్రత్యేక టేబుల్ వేర్

ప్రపంచనేతలకు ఇచ్చే విందు కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. వారికి మరిచిపోలేని ఆతిథ్య అనుభూతి కల్పించేందుకు ఆహారపదార్థాలను వెండి, బంగారు పూత కలిగిన పాత్రల్లో వడ్డిస్తారు. విదేశీ నేతలు వివిధ హోటళ్లలో బస చేసినప్పుడు, రాష్ట్రపతి ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యే సమయంలో ఉపయోగించేందుకు 200 మంది కళాకారులతో 15 వేల వరకు సామగ్రిని తయారు చేయించారు. ఇందులో స్టీల్, ఇత్తడి లేదా రెండింటి మిశ్రమంతో తయారైన టేబుల్ సామగ్రికి వెండిపూత వేయించారు. విందు సమయంలో అతిథులకు బంగారు పూత వేసిన గ్లాసులలో డ్రింక్స్‌ను సర్వ్ చేస్తారు. ప్లేట్లు, స్పూన్లు తదితర వస్తువులను భారతీయ సంప్రదాయం ప్రతిబింబించేలా ఎంపిక చేశారు. జైపూర్, ఉదయ్‌పూర్, వారణాసిలతోపాటు కర్ణాటకలో వీటిని తయారు చేయించారు.

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీపై నిషేధం

జీ20 దృష్ట్యా ఈ నెల 8, 9, 10వ తేదీల్లో న్యూఢిల్లీలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఢిల్లీ పోలీసులు ఈ ప్రాంతంలో ఇప్పటికే ట్రాఫిక్ ఆంక్షలు ప్రకటించారు. క్లౌడ్ కిచెన్, ఫుడ్ డెలివరీలు, అమెజాన్ డెలివరీ వంటి వాణిజ్య సేవలపై ఎన్‌డీఎంసీ ప్రాంతంలో నిషేధం విధిస్తున్నట్లు స్పెషల్ పోలీస్ కమిషనర్ ఎస్ఎస్ యాదవ్ చెప్పారు. ఈ ప్రాంతంలో లాక్‌డౌన్ విధిస్తారన్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. అలాంటిదేమీ లేదన్నారు.

బియెన్‌వెన్యూ నుంచి బియెన్‌వెనిదో దాకా..

జీ20 శిఖరాగ్రానికి హాజరయ్యే జీ20 ప్రతినిధులు, విదేశీ అతిథులకు వారివారి భాషల్లోనే స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. జీ20 ఇతివృత్తం 'వసుధైక కుటుంబకమ్'ను జీ20 సభ్యదేశాలు, ఆహ్వానిత దేశాల భాషల్లో ముద్రించారు. దీంతోపాటు ఫ్రెంచిలో బియెన్‌వెన్యూ, టర్కిష్‌లో హాస్‌గెల్డినిజ్, జర్మన్‌లో విల్కోమెన్, ఇండోనేసియన్‌లో సెలామట్ దతంగ్, స్పానిష్‌లో బియెన్‌వెనిదో అంటూ స్వాగతాన్ని రష్యన్, మాండరిన్ భాషల్లో సైతం ముద్రించారు. దేశాల ప్రతినిధుల కోసం భారత్ మండపం కాంప్లెక్స్ 14వ నంబర్ హాలు ప్రవేశద్వారం వద్ద వీటిని ఏర్పాటు చేశారు.

ఖర్గేకు రాని విందు పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: జీ 20సదస్సులో భాగంగా శనివారం రాత్రి అతిథులకు ఇస్తున్న విందుకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పిలుపు రాలేదు. ప్రగతిమైదాన్‌లోని భారత మండపంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవ్వనున్న ఈ విందుకు ఖర్గేకు పిలుపు రాలేదని ఆయన కార్యాలయం ధ్రువీకరించింది. మాజీ ప్రధానులు దేవెగౌడ, మన్మోహన్ సింగ్, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర కార్యదర్శులు, పలువురు పారిశ్రామిక వేత్తలు ఆహ్వానితుల్లో ఉన్నారు. అయితే కేబినెట్ హోదా ఉన్న రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఖర్గేకు ఆహ్వానం పంపకపోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎంలు నితీశ్‌కుమార్ , మమతా బెనర్జీ, కేజ్రీవాల్, భగవంత్‌మాన్, హేమంత్ సోరెన్‌లు విందుకు హాజరు అవుతున్నట్లు ప్రకటించారు. అనారోగ్య కారణంగా విందుకు హాజరుకావడంలేదని మాజీ ప్రధాని దేవెగౌడ ట్వీట్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా అనారోగ్య కారణాలతో విందుకు హాజరుకావడం లేదని సమాచారం.

నేతల బస

సదస్సుకు హాజరవుతున్న దేశాధినేతలందరికీ సెంట్రల్ ఢిల్లీలోని స్టార్‌హోటళ్లు, గురుగ్రామ్‌లో బస ఏర్పాట్లు చేశారు. సుమారు 35 వేల గదులు బుక్ చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఐటీసీ మౌర్య 14వ అంతస్తులో, చాణక్యపురిలోని తాజ్ ప్యాలెస్‌లో చైనా ప్రధాని లీ క్వియాంగ్, బ్రెజిల్ ప్రతినిధులు, షాంగ్రీలాలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్, క్లారిడ్జ్ హోటల్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఇంపీరియర్ హోటల్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటొనీ అల్బనీస్, ఒబెరాయ్ హోటల్‌లో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, గురుగ్రామ్‌లోని ఒబెరాయ్ హోటల్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్, జేడబ్ల్యూ మారియట్, హయత్ రెసిడెన్సీల్లో ఇటలీ ప్రతినిధులు, లీ మెరిడియన్‌లో నెదర్లాండ్స్, నైజీరియా, యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు, లలిత్ హోటల్‌లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, గురుగ్రామ్ లీలీ హోటల్‌లో సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ బృందం బస చేయనుంది.

అతిథులకు స్వాగతం...


యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా


యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మైకేల్


అర్జెంటీనా అధ్యక్షుడు ఫెర్నాండెజ్


ఐరాస చీఫ్ గుటెర్రస్


దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా


అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు స్వాగతం పలుకుతున్న విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి వాణీ రావు, పక్కన ఆ శాఖ మంత్రి వీకేసింగ్


ఐఎంఎఫ్ డైరెక్టర్ క్రిస్టలినా నృత్యం


జపాన్ ప్రధాని కిషిదా


చైనా ప్రధాని లి క్వియాంగ్


సింగపూర్ ప్రధాని లీ


బంగ్లా ప్రధాని హసీనా


ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్


ఈజిప్టు అధ్యక్షుడు ఎల్ సిసి


ఇటలీ ప్రధాని మెలొనీ


దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్

శిఖరాగ్ర భేటీకి శ్రీకారం

జీ20 కూటమి సదస్సుకు మొదలైన అధినేతల రాక | **ఢిల్లీ డిక్లరేషన్‌పైనే అందరి దృష్టి**

న్యూఢిల్లీ: అద్భుతమైన ప్రపంచ ఆర్థికాభివృద్ధి సాధనే పరమావధిగా సాగే జీ20 అగ్రరాజ్యాల కూటమి సమావేశానికి హస్తిన సర్వాంగ సుందరంగా ముస్తాబై సభ్య దేశాల అధినేతలకు సాదర స్వాగతం పలుకుతోంది. అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తదితర ప్రపంచ దేశాల ఆగమనంతో జీ20 శిఖరాగ్ర సదస్సు హడావిడి మరింత పెరిగింది. శనివారం సైతం మరికొందరు నేతలు విచ్చేస్తున్నారు. శుక్రవారం ఢిల్లీలో అడుగుపెట్టగానే బైడెన్‌తో మోదీ విస్తృతస్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రపంచ శ్రేయస్సుకు పాటుపడతామని ప్రకటించారు. మానవ కేంద్రిత, సమ్మిళిత అభివృద్ధి దిశగా సదస్సు కొత్త బాటలుపరుస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం ప్రకటించారు. మరోవైపు ఢిల్లీ డిక్లరేషన్ దాదాపు సిద్ధమైందని, ఏకాభిప్రాయం సాధిస్తామని భారత్ ధీమా వ్యక్తంచేసింది. 9, 10 తేదీల్లో (శని, ఆదివారాల్లో) జరిగే సదస్సుకు హాజరయ్యే నేతల రాక, సాదర స్వాగతం, అతిథులకు ఆతిథ్యంతో ఢిల్లీలో కోలాహలం పెరిగింది. పసందైన వంటకాలు, భిన్న సంప్రదాయ వాయిద్యాలతో సంగీత విభావరి ఇలా పలు రకాల కార్యక్రమాలు, ప్రదర్శనలతో అధినేతలకు మరెప్పుడూ మరిచిపోలేని రీతిలో అద్భుతంగా ఆతిథ్యం ఇవ్వనున్నారు. వాతావరణ మార్పులు, ఉక్రెయిన్–రష్యా యుద్ధం, ఆర్థిక అనిశ్చితి, మాంద్యం భయాలు వంటి కీలక అంశాలతో చర్చలు శిఖరాగ్రానికి చేరుకోనున్నాయి. ఎలాగైనా సరే సదస్సు ముగిసేనాటికి అందరి ఏకాభిప్రాయంతో సంయుక్త ప్రకటన విడుదల చేసేందుకు భారత్ శాయశక్తులా కృషిచేస్తోంది. నేడు మొదలయ్యే ఈ చర్చా సమరంలో నేతలు చివరకు ఎలాంటి వాగ్దానాలు చేస్తారో, ఏమేం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూద్దాం..!!

దుర్భేద్యమైన భద్రత

ముఖ్యనేతలంతా ఢిల్లీకి వచ్చేస్తున్న నేపథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో ఢిల్లీలో భద్రతా బలగాలను మొహరించారు. చర్చలకు ప్రధాన వేదిక అయిన 'భారత్ మండపం' కాంప్లెక్స్ వద్ద భద్రతను పోలీసులు, పారామిలటరీ, నిఘా వర్గాలతో కట్టుదిట్టం చేశారు. తొలిసారిగా ఇండియా ఈ సదస్సును నిర్వహిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చేసేందుకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సదస్సు వివరాలను జీ20లో భారత షెర్పా అమితాబ్ కాంత్ శుక్రవారం ఢిల్లీలో వివరించారు. ' మన న్యూఢిల్లీ డిక్లరేషన్ దాదాపు సిద్ధం. దానిని ఇప్పుడు బహిర్గతం చేయలేం. ఎందుకంటే డిక్లరేషన్ తాలూకు ప్రతిపాదలను అధినేతలకు సమర్పిస్తాం. వారి సూచనలు, సవరణల తర్వాతే దానికి ఆమోదం లభిస్తుంది. ఆ తర్వాతే డిక్లరేషన్ ద్వారా సాధించబోయే విజయాలను వివరిస్తాం' అని అమితాబ్ చెప్పారు. ' ఐక్యరాజ్యసమితి తర్వాత అత్యంత క్రియాశీలకమైన కూటమిగా ఉన్న ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో చేర్చుకునేందుకు దాదాపు అందరినీ ఒప్పించడం భారతదేశ నిబద్ధతకు నిదర్శనం' అని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్ ఆగమనం మాకు సంతోషదాయకమే అని యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్ అన్నారు. ఆఫ్రికన్ యూనియన్‌లో మొత్తంగా 55 దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

నేటి ప్రపంచానికి సరిపోయే నినాదమిది

మహా ఉపనిషత్తు నుంచి స్ఫూర్తి పొంది రూపొందించిన 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు ఇతివృత్తం' నేటి ప్రపంచానికి సరిపోయే నినాదమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు. కాగా, చర్చల్లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రధానంగా ప్రస్తావించి చర్చించాలని బ్రిటన్ భావిస్తోంది. దీంతో ఈ చర్చలో భారత్ పాత్ర కీలకంగా మారనుంది. ' ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ, మానవ హక్కుల హననంపై ఇండియా తన నిర్ణయం వెలువరచాలని చర్చలో పట్టుబడతాం. మోదీతో, ఇతరులతో భేటీలను పుతిన్ దారుణ అకృత్యాలను ఆపేందుకు సాధనాలుగా వినియోగిస్తాం' అని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ అధికార ప్రతినిధి చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో కూటమి సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలున్నా ఏకాభిప్రాయానికి ప్రయత్నిస్తామని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ చెప్పారు. కాగా, భారత్ తమకు వ్యతిరేకంగా జీ20 వేదికగా ప్రకటన చేయాలని జీ7 దేశాలు ఒత్తిడి చేస్తున్నాయని రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో ఆరోపించింది. డిజిటల్ మౌలిక వసతులు, వాతావరణ సంబంధ నిధులు, సుస్థిరాభివృద్ధి, శుద్ధ ఇంధనం వంటి అంశాల్లో జీ20 వేదికగా సానుకూల నిర్ణయాలు వెలువడతాయని అంతర్జాతీయ విశ్లేషకులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన కూటమి సారథ్య బాధ్యతల్ని భుజానికి ఎత్తుకున్న భారత్ అప్పట్నుంచీ దేశవ్యాప్తంగా భిన్న నగరాలు, వేదికలపై 200 సమావేశాలను నిర్వహించింది. ప్రపంచ జీడీపీలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల జనసంఖ్య జీ20 దేశాల్లోనే ఉంది. అందుకే ఈ సదస్సులో తీసుకునే నిర్ణయాలు పెను ప్రభావం చూపిస్తాయి.

జీ20 దేశాలు

అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, ద.కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా, యురోపియన్ యూనియన్

సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం

జీ20 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ తదితరులు శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. సంప్రదాయ నృత్యాల నడుమ వీరికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టలినా జార్జియెవా విమానాశ్రయంలో డ్యాన్స్ చేశారు. భారతీయ సంస్కృతిపై క్రిస్టలినా చూపిన మక్కువను ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రశంసించారు. వచ్చే రెండు రోజుల్లో వివిధ దేశాల నేతలతో ఫలప్రదమైన చర్చలు జరిపేందుకు ఆసక్తితో ఉన్నట్లు ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శుక్రవారం భారత్‌కు వచ్చారు. ఆయన సతీమణి జిల్ బైడెన్ కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. బైడెన్‌కు చేసిన రెండు పరీక్షల్లోనూ నెగెటివ్‌గా రావడం పర్యటనను ఖరారు చేసుకున్నారు. ఇటలీ ప్రధాని జియోర్జియా మెలోనీ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాలకు విమానాశ్రయంలో కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజే, దర్శనా జర్దోష్ స్వాగతం పలికారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు కేంద్ర మంత్రి అశ్వినీ చౌబే, అర్జెంటీనా అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండెజ్‌కు కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే స్వాగతం పలికారు. కొమరోస్ అధ్యక్షుడు, ఆఫ్రికన్ యూనియన్ చైర్ పర్సన్ కూడా అయిన అజలి అస్సౌమనీ, రష్యా విదేశాంగ మంత్రి లావ్రోవ్, ఒమన్ డిప్యూటీ ప్రధాని సయ్యిద్ ఫహద్, ఈజిప్టు అధ్యక్షుడు ఫతా ఎల్–సిసి, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్, ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్, యూఏఈ ప్రెసిడెంట్ అల్ నహ్యాన్‌లకు కూడా ఘన స్వాగతం లభించింది. ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రస్‌కు అధికారులు స్వాగతం పలికారు. జీ20(గ్రూప్ ఆఫ్ 20)లో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, తుర్కియే, యూకే, అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ)సభ్యులన్న విషయం తెలిసిందే.

బ్రిటిష్ కౌన్సిల్ విద్యార్థులతో సునాక్ ముఖాముఖి

శుక్రవారం యూకే ప్రధాని రిషి సునాక్ ఢిల్లీలోని బ్రిటిష్ కౌన్సిల్‌కు వెళ్లి సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.


'రక్షణ'లో బలీయ బంధం

- జీ20 సదస్సు కోసం భారత్‌కు విచ్చేసిన బైడెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు
- కీలక అంశాలపై ఒప్పందాలు ఖరారు !
- సంయుక్త ప్రకటన విడుదల

న్యూఢిల్లీ: భారత్, అమెరికా దేశాల మధ్య రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంయుక్తంగా ప్రకటించారు. జీ20 సమావేశాల్లో పాల్గొనేందుకు శుక్రవారం భారత్‌కు విచ్చేసిన బైడెన్‌ను ప్రధాని మోదీ ఢిల్లీలోని తన అధికారిక నివాసం 7, కళ్యాణ్‌మార్గ్‌కు సాదరంగా ఆహ్వానించారు. దాదాపు 50 నిమిషాలకుపైగా జరిగిన ఈ భేటీ సందర్భంగా ఇరువురు అగ్రనేతలు కీలకమైన అంశాలపై చర్చించి పలు రంగాలకు సంబంధించి ఒప్పందాలు ఖరారుచేశారు. అమెరికా నుంచి 31 అత్యాధునిక డ్రోన్ల కొనుగోలు, ఆధునిక జెట్ ఇంజిన్ల సంయుక్త తయారీపై రెండు దేశాలు అవగాహనకు వచ్చాయి. జీ20 సారథ్యం, అణుఇంధనంలో సహకారం, 6జీ, కృత్రిమ మేథ వంటి సంక్లిష్ట, అధునాతన సాంకేతికతల్లో పరస్పర సహకారం, బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల్లో సంస్కరణలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అమెరికా రక్షణ రంగ దిగ్గజం జనరల్ అటామిక్స్ సంస్థ నుంచి ఎంక్యూ–9బీ రకం 31 డ్రోన్లను కొనేందుకు భారత రక్షణ శాఖ పంపిన విజ్ఞప్తి లేఖకు బైడెన్ తన సమ్మతి తెలిపారు. అమెరికాలోని జీఈ ఏరోస్పేస్, భారత్‌లోని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్(హాల్)లు సంయుక్తంగా జీఈ ఎఫ్–414 జెట్ ఇంజన్లను భారత్‌లోనే తయారుచేసేందుకు ఇరునేతలు అంగీకరించారు. సాంకేతికత బదలాయింపు, జెట్ ఇంజన్ల తయారీకి పచ్చజెండా ఊపారు. 'జీ20 కూటమి అనేది ఏ విధంగా గొప్ప ఫలితాలను రాబట్టగలదన్న దానిని జీ20 సారథిగా భారత్ నిరూపించి చూపింది. సదస్సు తాలూకు ఫలితాలు ముస్ముందు మరిన్ని ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశిస్తాయి' అని బైడెన్ భారత్‌ను పొగిడారు. స్వేచ్ఛాయుత, పారదర్శక, సమ్మిళిత ఇండో–పసిఫిక్ కోసం క్వాడ్ కూటమి అత్యావశ్యకమని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది భారత్‌లో జరిగే క్వాడ్(అమెరికా, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియా) చతుర్భుజ కూటమి సదస్సుకు రావాలని బైడెన్‌ను మోదీ కోరారు. ' స్వేచ్ఛా, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, బహుళత్వం, సమాన అవకాశాలనే విలువలు రెండు దేశాల పౌరుల విజయానికి ఎంతో కీలకం. ఈ విలువలే రెండు దేశాల మైత్రి బంధాన్ని మరింత బలోపేతం చేశాయి' అని సంయుక్త ప్రకటనలో ఇరు దేశాలు పేర్కొన్నాయి. 'సదస్సు తుది నిర్ణయాలు సుస్థిరాభివృద్ధి, బహుపాక్షిక సహకారం, సమ్మిళిత ఆర్థిక విధానాల్లో ఏకరూపత సాధనకు తద్వారా పెను ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు దోహదపడతాయి' అని సంయుక్త ప్రకటన పేర్కొంది. బైడెన్‌తో చర్చలు ఫలప్రదమయ్యాయని అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఏఏ అంశాల్లో ఒప్పందం కుదిరిందంటే..

- ప్రపంచ వ్యాప్తంగా సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు బలోపేతం
- భారత్‌లో పరిశోధనాభివృద్ధి కోసం మైక్రోచిప్ టెక్నాలజీ సంస్థ దాదాపు 30 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టడం
- వచ్చే ఐదేళ్లలో అధునాతన మైక్రో డివైజ్‌ల కోసం 40 కోట్ల డాలర్ల పెట్టుబడి
- భారత్ 6జీ కూటమి, నెక్ట్స్ జీ కూటమి మధ్య అవగాహన ఒప్పందం(ఎంఓయూ)
- ఇండో–పసిఫిక్‌లో స్వేచ్ఛా వాణిజ్యం, రక్షణ కోసం మరింత సహకారం
- భద్రత, టెలీ కమ్యూనికేషన్స్ రంగాల్లో సహకారం
- సాంకేతిక రంగాల్లో కలిసి పనిచేయడం



జీ-20 అఫిషియల్ మొబైల్ యాప్‌లో దేశం అధికారిక నామం 'భారత్' అంటూ దర్శనమిచ్చిన నోట్

బంగ్లా, మారిషస్ ప్రధానులతో మోదీ భేటీ

న్యూఢిల్లీ: జీ20 నేపథ్యంలో ఢిల్లీకి మొదటగా వచ్చిన నేతల్లో మారిషస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్ ఒకరు. ప్రధాని మోదీ మొట్టమొదటి సమావేశం మారిషస్ ప్రధాని ప్రవింద్ జగన్నాథ్‌తోనే జరిగింది. గ్లోబల్ సౌత్ వాణిని వినిపించేందుకు కట్టుబడి ఉన్నామని ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నేతలు ప్రకటించారు. 'రెండు దేశాల నడుమ సంబంధాలు ఏర్పాటై 75 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ ఏడాదికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఫిన్‌టెక్, సాంస్కృతిక తదితర రంగాల్లో సహకారంపై చర్చించాం'అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'భారత్ దార్శనిక కార్యక్రమం 'సాగర్'లో మారిషస్ వ్యూహాత్మక కీలక భాగస్వామి. ద్వైపాక్షిక సంబంధాలను విస్తృతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు'అని పీఎంవో తెలిపింది. ప్రధాని మోదీ అనంతరం బంగ్లాదేశ్ ప్రధానమంత్రి హసీనాతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాల్లో సహకారం విస్తృతం చేసుకునేందుకు, రెండు దేశాల మధ్య కనెక్టివిటీతోపాటు వాణిజ్య సంబంధాల బలోపేతంపై చర్చించినట్లు అనంతరం ప్రధాని మోదీ తెలిపారు. 'గత తొమ్మిదేళ్లలో బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఎంతో బలోపేతమయ్యాయి. తాజాగా ప్రధాని హసీనాతో చర్చలు ఫలప్రదమయ్యాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కనెక్టివిటీ, సాంస్కృతిక రంగాలతోపాటు ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చారని పీఎంవో తెలిపింది.

సభ్యదేశాలదే తుది నిర్ణయం

ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వంపై గుటెరస్

న్యూఢిల్లీ: ప్రపంచంలో సిసలైన దేశం అంటూ ఏదైనా ఉందంటే అది భారతదేశమేనని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఇండియాను 'విశ్వ దేశం(కంట్రీ ఆఫ్ ది వరల్డ్)'గా అభివర్ణించారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు శుక్రవారం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. ' అంతర్జాతీయంగా బహుళపక్ష వ్యవస్థలో భారత అత్యంత ముఖ్యమైన భాగస్వామి. అయితే ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇచ్చే ప్రక్రియలో నా పాత్ర ఏమీ లేదు. సభ్య దేశాలదే తుదినిర్ణయం' అని గుటెరస్ స్పష్టంచేశారు. 'ఐరాస భద్రతా మండలిలో, బహుపాక్షిక వ్యవస్థల్లో సంస్కరణలు తప్పనిసరి. అంతర్జాతీయ ఆర్థిక మౌలికస్వరూపం సైతం పాతదైపోయింది. ఇందులోనూ నిర్మాణాత్మకమైన సంస్కరణలు జరగాలి. అంతర్జాతీయ వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలను అవి తీర్చాలి. యుద్ధాలు, సంక్షోభాలతో కాలాన్ని వృధా చేసుకోకూడదు. ఓవైపు పేదరికం, ఆకలి, అసమానతలు పెరుగుతుంటే మరోవైపు సహానుభూతి, సంఘీభావం తెలిపే గుణం తగ్గిపోతున్నాయి. మంచి కోసం అందరం కలిసికట్టుగా ముందడుగువేద్దాం' అంటూ జీ20 దేశాలను గుటెరస్ కోరారు. సమీప భవిష్యత్తులో ఉక్రెయిన్- రష్యా శాంతి ఒప్పందం వాస్తరూపం దాలుస్తుందన్న నమ్మకం తనకు లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచం కోరుకునే గణనీయమైన మార్పుల సాధనకు భారత జీ20 సారథ్యం సాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ' ప్రపంచం ఒక వసుధైక కుటుంబంలా మనగలగాలంటే ముందుగా మనం ఒక్కటిగా నిలుద్దాం. ప్రపంచం ఇప్పుడు కీలకమైన మార్పు దశలో ఉంది. భవిష్యత్ అంతా భిన్న ధ్రువ ప్రపంచానిదే' అని ఆయన వ్యాఖ్యానించారు.

డిక్లరేషన్‌పై తొలగని ప్రతిష్టంభన

- చివరి రౌండ్ షెర్పా మధ్యవర్తిత్వ చర్చల్లోనూ దేశాల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- పర్యావరణ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం అంశాల్లో కుదరని సయోధ్య

జీ20 శిఖరాగ్ర సదస్సుకు సర్వం సిద్ధమై అగ్రరాజ్యాధినేతలు విచ్చేసి భేటీకి సిద్ధమవుతున్న వేళ ఢిల్లీ డిక్లరేషన్‌పై ఇంకా ప్రతిష్టంభన తొలగలేదు. శిఖరాగ్ర సదస్సులో దేశాధినేతల మధ్య విస్తృత స్థాయి చర్చలు పూర్తయ్యాక చివరి రోజున ఉమ్మడి తీర్మానం(ఢిల్లీ డిక్లరేషన్) విడుదల చేస్తారు. ఆ తీర్మానంలో ఏఏ అంశాలపై ఉమ్మడి నిర్ణయాలు ప్రకటించాలనే దానిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. డిక్లరేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలపై ఇప్పటికే ఆయా దేశాధినేతల తరఫున అధికారిక ప్రతినిధు(షెర్పా)లు పలుమార్లు కలిసికట్టుగా అంతర్గత చర్చలు జరిపారు. ఈ మంతనాల్లో ఇంతవరకు చెప్పుకోదగ్గ స్థాయిలో ఎలాంటి ఉమ్మడి నిర్ణయాలు తీసుకోలేదు. శిఖరాగ్ర సదస్సులో అధినేతలు ఏమేం అంశాలు చర్చించాలనేది ముందే నిర్ణయం అయిపోతుంది. సదస్సు అత్యంత సాఫీగా సాగేందుకు వీలుగా ఆయా అంశాలపై అధినేతల నుంచి ఉమ్మడి నిర్ణయాలు వెలువడేందుకుగాను ముందే షెర్పాలు భారీ కసరత్తు చేస్తారు. సభ్య దేశాల అధినేతల అధికారిక ప్రతినిధులైన ఈ షెర్పాలు దౌత్యమార్గంలో అంతర్గతంగా ముందే అందరూ చర్చించుకుంటారు. దీంతో శిఖరాగ్ర సదస్సులో అధినేతలు నేరుగా కలిసి మాట్లాడేటపుడు ఆయా అంశాల లోతుల్లోకి వెళ్లరు. సూత్రప్రాయ అంగీకారం మాత్రమే తెలుపుతారు. మిగిలిన పని అంతా ముందే ఏర్పాటు చేసిపెడతారు కాబట్టి ఆతర్వాతి ప్రక్రియ సులువు అవుతుంది. అయితే, తాజాగా షెర్పాల మధ్య జరిగిన చివరి రౌండ్ చర్చల్లోనూ కొన్ని కీలక అంశాలపై సయోధ్య కుదరనే లేదు. వాటిల్లో పర్యావరణ మార్పు, ఉక్రెయిన్ యుద్ధం వంటి ప్రధాన అంశాలు ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని పేర్కొంటూ ఒక పేరాగ్రాఫ్‌లో భారత్ చేసిన ప్రతిపాదనలపై షెర్పాల చిక్కుముడి పడింది. ఉక్రెయిన్‌లో రష్యా ఆగడాలను అడ్డుకునేలా చర్యలు ఆ పేరాగ్రాఫ్‌లో లేవని అమెరికా, బ్రిటన్, యురోపియన్ యూనియన్లు వేలెత్తిచూపాయి. ఢిల్లీ డిక్లరేషన్‌లో ఉక్రెయిన్ యుద్ధం అంశంపై ఏకాభిప్రాయం తెలపాలంటే తమ డిమాండ్లు నెరవేర్చాలని అటు పశ్చిమ దేశాలు, ఇటు రష్యా–చైనా పక్ష దేశాలు పట్టుబడుతున్నాయి. దీంతో ఈ అంశంపై సమ్మతి సాధ్యపడలేదు. ఇలాంటి పరిస్థితి రాకూడదనే ముందుగానే జకార్తాలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌లు చర్చలు జరిపి డిక్లరేషన్ సంబంధ అంశాలపై చర్చించినా ఫలితం లేకపోయింది.

భారత నాయకత్వ ప్రతిష్టకు సవాల్

తొలిసారిగా జీ20 కూటమి సారథ్య బాధ్యతలు తీసుకున్న భారత్ ఈ సదస్సు తర్వాత ఎలాగైనా సరే ఉమ్మడి తీర్మానం ప్రకటించాలని చూస్తోంది. అయితే అటు పశ్చిమ దేశాలు, ఇటు రష్యా–చైనా పక్ష దేశాలు ఎవరి మంకుపట్టు వారు పట్టడంతో ఉమ్మడి తీర్మానం సాధ్యమయ్యేలా లేదు. అదే జరిగితే అంతర్జాతీయంగా భారత ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. సంయుక్త ప్రకటన సాధ్యం కాని పక్షంలో జీ20 అధ్యక్ష హోదాలో మోదీ కేవలం సారాంశ ప్రకటన విడుదల చేస్తారు.

వాతావరణ మార్పు: ఇదే అసలైన అవరోధం

చర్చల్లో ఏకాభిప్రాయానికి ప్రధాన అవరోధంగా వాతావరణ మార్పు విధానం నిలుస్తోంది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమక్రమంగా తగ్గించుకోవడం, పునరుత్పాదక ఇంధనాల వైపు మళ్లడం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాల పెంపునకు లక్ష్యాలను నిర్దేశించుకోవడం, గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను తగ్గించుకోవడం వంటి అంశాల్లో జీ20 సభ్య దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇది షెర్పాల భేటీలో స్పష్టంగా కనిపించింది. 2030 కల్లా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాలను క్రమంగా పెంచుకోవాలని, 2035 ఏడాదికల్లా గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాల స్థాయిని తగ్గించుకోవాలని పశ్చిమ దేశాలు చేసిన ప్రతిపాదనలను భారత్, రష్యా, చైనా, సౌదీ అరేబియాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. శిలాజ ఇంధన ఆధారిత ఆర్థికవ్యవస్థ కలిగిన సౌదీ అరేబియా అయితే ఈ ప్రతిపాదలను ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పింది. జ్ఞానాధారిత రంగాలు, ఇతర సెక్టార్ల వైపు మళ్లేందుకు తమకు దశాబ్దాల కాలం పడుతుందని వాదిస్తోంది. వెలువడుతున్న కర్బన ఉద్గారాలు, ప్రకృతిలోకి శోషించబడుతున్న కర్బన ఉద్గారాల నిష్పత్తి సమంగా ఉండేలా అంటే కార్బన్ నెట్ జీరో(కర్బన స్థిరత్వం) సాధించేందుకు జీ7 దేశాలు తొందర పెడుతున్నాయి. శిలాజ ఇంధనాల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, వాటి ద్వారా వచ్చే విద్యుత్ సాయంతోనే ఆర్థిక వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధిస్తామని ధీమాగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలు.. ఈ జీ7 దేశాల ప్రతిపాదనలను తప్పుబడుతున్నాయి. 'దశాబ్దాలుగా శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడేసి పారిశ్రామిక విప్లవంతో పశ్చిమ దేశాలు సంపన్న దేశాలుగా అవతరించాయి. ఇప్పుడు మాకు ఆ అవకాశం ఇవ్వండి. వాతావరణ మార్పుల మాటున అభివృద్ధిని అడ్డుకోకండి' అని భారత్‌సహా దేశాలు వాదిస్తు న్నాయి. 2020కల్లా వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పేద దేశాలకు ఏటా 100 బిలియన్ డాలర్ల నిధులను ఇస్తామన్న సంపన్న దేశాలు ఆ వాగ్దానాన్ని నెరవేర్చనేలేదు. ఎప్పటికల్లా సాయం చేస్తాయనేదీ స్పష్టంచేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో క్లైమేట్ పాలసీపై ఉమ్మడి నిర్ణయం ఆశించడం కష్టమే. ఇలాంటి తరుణంలో మొదలవుతున్న జీ20 సదస్సు క్లిష్టమైన కూడలిలో నిల్చుందనే చెప్పాలి. దేశ ప్రయోజనాలను పక్కనబెట్టి మానవాళి శ్రేయస్సు కోసం అగ్రనేతలు ఏ మేరకు ఉమ్మడి వాగ్దానాలు చేస్తారనేది బిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. జీ20లో ఏకాభిప్రాయం కుదరకపోతే త్వరలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగబోయే కాప్28 సదస్సులోనూ మేలైన ఫలితాలను ఆశించడం అత్యాశే అవుతుంది.

–సాక్షి నేషనల్‌డెస్క్



జీ20 మీడియా ఇంటర్నేషనల్ మీడియా సెంటర్ వద్ద సభ్య దేశాల జెండాల రెపరెపలు



జీ20 ఇతివృత్తంతో ఉన్న జెండాతో ఓ సాహసి స్కైడైవింగ్



జీ20 క్రాఫ్ట్స్ బజార్‌లో మగ్గం నేస్తున్న ఓ మహిళ

ఏకాభిప్రాయం సాధిస్తాం

ఢిల్లీ డిక్లరేషన్‌పై భారత్ ధీమా

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సుకు సంబంధించిన ఢిల్లీ డిక్లరేషన్ దాదాపు సిద్ధమైందని భారత్ ప్రకటించింది. 'ఢిల్లీ డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం వస్తుందని ఆశిస్తున్నాం. ఈ దిశగా సంప్రదింపులు ముమ్మరంగా జరుగుతున్నాయి' అని భారత్ ప్రకటించింది. సదస్సుకు సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా వెల్లడించారు. అయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణ మార్పులు వంటి అంశాల్లో సమ్మతి సాధ్యమయ్యేనా అన్న ప్రశ్నకు సరైన సమాధానం ఆయన చెప్పలేదు. 'ఆఫ్రికా యూనియన్‌కు జీ20 కూటమిలో సభ్యత్వం ఇవ్వాలా వద్దా అనే అంశంపై శనివారం జరిగే సదస్సులో నిర్ణయం తీసుకోవచ్చు' అని క్వాత్రా తెలిపారు. 'ప్రధాని మోదీకి గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రగాఢ విశ్వాసముంది. అందుకే ఆఫ్రికా యూనియన్‌ను కలుపుకుందామని జీ20 సభ్యదేశాలకు రాతపూర్వకంగా మోదీ విన్నవించుకున్నారు. ఢిల్లీ డిక్లరేషన్ అనేది గ్లోబల్ సౌత్‌కు, అభివృద్ధి దేశాలకు గొంతుకగా ఉంటుంది. జీ20కి భారత సారథ్యం సమ్మిళితంగా, లక్ష్య సాధకంగా, క్రియాశీలకంగా, నిర్ణయాత్మకంగా ఉంటుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు' అని జీ20 షెర్పా అయిన అమితాబ్ కాంత్ చెప్పారు. 'భారత వైవిధ్య, సమాఖ్య నిర్మాణానికి గుర్తుగా ఇప్పటికే దేశవ్యాప్తంగా 60 నగరాలు, పట్టణాల్లో 220కిపైగా జీ20 సంబంధ సమావేశాలు జరిగాయని అమితాబ్‌కాంత్ పేర్కొన్నారు. అగ్ర నేతలు పాల్గొనే సెషన్స్‌లు మూడు విడిగా జరుగుతాయి. వీటికి ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అని నామకరణం చేశారు. శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అగ్రనేతల గౌరవార్థం విందు ఇవ్వనున్నారు. జీ20 నేతలంతా రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి ఘన నివాళులు అర్పించనున్నారు. ప్రపంచ రాజకీయ భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితి, సమ్మిళిత వృద్ధి, ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణంలో పెను మార్పులు, గ్లోబల్ సౌత్ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర కీలక అంశాలు నేతల మధ్య భేటీలో చర్చకు రానున్నాయి. మోదీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్, జర్మనీ చాన్స్‌లర్ స్కోల్జ్, ఫ్రెంచ్ అధ్యక్షుడు మేక్రాన్ సహా ఇతర దేశాల నేతలు, ఈయూ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, ఓఈసీడీ, ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల చీఫ్‌లు హాజరుకానున్నారు.

కేంద్రం వైఖరిని సమర్థిస్తున్నాం

ఉక్రెయిన్ సంక్షోభంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



లండన్: రష్యా–ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరిని పూర్తిగా సమర్థిస్తున్నామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. విశాలమైన దేశం అయినందున ప్రపంచదేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం భారత్‌కు సహజంగానే ఉంటుందని చెప్పారు. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న వైఖరికి రష్యా నుంచి చమురు సరఫరాయే కారణమా అన్న మీడియా ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. 'రష్యాతో మాకు సంబంధాలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విషయంలో ప్రభుత్వ, ప్రతిపక్షం వైఖరి భిన్నంగా ఉంటుందని నేను భావించడం లేదు' అని వివరించారు. రష్యా నుంచి దూరంగా తమవైపు భారత్‌ను లాక్కునేందుకు పశ్చిమ దేశాల నేతలు ప్రయత్నించారా అన్న ప్రశ్నకు రాహుల్ గాంధీ.. ''వాస్తవానికి భారత్‌కు రష్యాతో సత్సంబంధాలున్నాయి. అదేవిధంగా అమెరికాతోనూ సంబంధాలున్నాయి. భారత్ విశాల దేశం. పెద్ద దేశం కావడం వల్ల అనేక ఇతర దేశాలతో వివిధ స్థాయిల్లో సంబంధాలు కొనసాగుతున్నాయి. ఎవ్వరితోనైనా సంబంధాలు కొనసాగించే హక్కు భారత్‌కు ఉంది' అని రాహుల్ చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ద్వారా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు విషయంలో ప్రతిపక్షం వైఖరిపై ఆయన..కశ్మీర్ అభివృద్ధిని కాంగ్రెస్ గట్టిగా కోరుతోంది. అక్కడ శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తోంది' అని రాహుల్ వివరించారు. కశ్మీర్ అంశం పరిష్కారానికి అంతర్జాతీయ దౌత్యం అవసరమని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు రాహుల్ సూటిగా సమాధానమిచ్చారు. వాస్తవానికి కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. కశ్మీర్ మా సొంత విషయం. అందులో భారత్‌కు తప్ప మరెవ్వరి జోక్యం అవసరం లేదు' అని కుండబద్దలు కొట్టారు.

ఉప పోరులో మిశ్రమ ఫలితాలు

బీజేపీకి 3, ఇండియా కూటమికి 4 సీట్లు

లక్నో/అగర్తలా: దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 5న జరిగిన ఉప ఎన్నికలో మిశ్రమ ఫలితాలు వెల్లడయ్యాయి. అధికార బీజేపీ మూడు, ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు నాలుగు సీట్లు గెలుచుకున్నాయి. ఉత్తరాఖండ్‌లోని బాగేశ్వర్, త్రిపురలోని ధన్‌పూర్ సీట్లను బీజేపీ నిలబెట్టుకోవడంతోపాటు త్రిపురలోని బొక్సానగర్ స్థానాన్ని సీపీఐ నుంచి కైవసం చేసుకుంది. బెంగాల్‌లోని ధుప్‌గురిలో జరిగిన ముక్కోణపు పోటీలో టీఎంసీ అభ్యర్థి గెలిచారు. ఇక్కడ ఇండియా కూటమి అభ్యర్థి కూడా బరిలో ఉన్నప్పటికీ, బీజేపీ అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చారు. ఇక కేరళలోని పుత్తుప్పల్లి సీటును ప్రతిపక్ష కాంగ్రెస్–యూడీఎఫ్ కూటమికి చెందిన చాందీ ఊమెన్ గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన దిగ్గజ నేత ఊమెన్ చాందీ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఊమెన్ చాందీ కొడుకే చాందీ ఊమెన్. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఇండియా కూటమిలోనివే అయినప్పటికీ ఇక్కడ పరస్పరం తలపడటం గమనార్హం. ఇండియా కూటమిలోని జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) జార్ఖండ్‌లోని దుమ్రి సీటును నిలబెట్టుకుంది. యూపీలోని ఘోసి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఇండియా కూటమి బలపరిచిన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి బీజేపీకి చెందిన సమీప ప్రత్యర్థిపై గెలిచారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ ఉమ్మడి పోరు

బనశంకరి: వచ్చే లోక్‌సభ ఎన్నికలను బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఉమ్మడిగా ఎదుర్కొనున్నాయని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ప్రకటించారు. ఢిల్లీలో జేడీఎస్ సీనియర్ నేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చలు జరిపారన్నారు. యడియూరప్ప శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అయిదు వరకు ఎంపీ స్థానాలను జేడీఎస్‌కు కేటాయించడానికి అమిత్ షా సమ్మతించారని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఏపీలోని నిరుద్యోగులకు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో తమ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ కె.శివరామకృష్ణ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత పర్యాటక శాఖ, ఏపీ పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో ఈ కళాశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ సంయుక్తంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్కిల్ కాలేజీను ఏర్పాటు చేశాయన్నారు. తమ కళాశాలలో ఈ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధిని కల్పిస్తున్నామన్నారు. ఇంటర్, ఐటీఐ పాసైన 18–28 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులకు కిచెన్ సూపర్ వైజర్ (4 నెలల వ్యవధి), రెస్టారెంట్ కెప్టెన్ (3 నెలల వ్యవధి) ఉన్న కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత వసతి, భోజనంతో పాటుగా శిక్షణ పూర్తి అయిన వారికి ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సర్టిఫికెట్ ఇచ్చి, వంద శాతం ఉపాధి కల్పిస్తామన్నారు. అర్హులైన వారు ఈ నెల 15 లోగా 91609 12690, 91005 58006, 90326 97478 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీల నియామకానికి కసరత్తు

దరఖాస్తులకు అక్టోబర్ 3 గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కొత్త జిల్లాలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డులకు చైర్మన్, సభ్యులు, సామాజిక కార్యకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబర్ మూడో తేదీ వరకు పొడిగించినట్లు బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ సంచాలకులు బీడీవీ ప్రసాదమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త జిల్లాలతోపాటు కృష్ణా, చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో కూడా చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువెనైల్ బోర్డుల ఖాళీలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు అర్హులైన వారు అక్టోబర్ 3వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హతలు, దరఖాస్తు ఫారం, అనుభవం, ఎంపిక విధానం తదితర వివరాల కోసం http://wdcw.ap.gov.in అనే వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు.

బాబు ముఠా పరార్

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు ఒక్కొక్కటిగా వెలికి తీయడంతో తప్పించుకునే దారి లేక సానుభూతి నాటకాలకు తెర తీశారు. రాజధాని అమరావతిలో తాత్కాలిక భవనాలు, పేదల టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో రూ.8 వేల కోట్లకుపైగా విలువైన కాంట్రాక్టుల కేటాయింపులో షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు ముడుపులు అందుకున్న వైనాన్ని ఆదాయపన్ను శాఖ ఆధారాలతో సహా వెలికి తీసిన విషయం తెలిసిందే. ఇందులో కీలక పాత్ర పోషించిన బాబు సన్నిహితులైన ముగ్గురు నిందితులే రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో కూడా షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించినట్లు సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేటతెల్లం చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో నిధుల తరలింపులో కీలకంగా వ్యవహరించారని నిగ్గు తేల్చింది. వారు ముగ్గురూ చంద్రబాబు బినామీలేనని తేలడంతో నోటీసులు జారీ చేసింది. మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాలను ఈ నెల 11న, పెండ్యాల శ్రీనివాస్‌ను ఈ నెల 14న విజయవాడలో విచారణకు హాజరుకావాలని ఈ మెయిల్ ద్వారా నోటీసులు పంపింది. ఈ క్రమంలో ఆ ముగ్గురూ హఠాత్తుగా అదృశ్యం కావడం, ఇద్దరు నిందితులు ఏకంగా దేశం విడిచి పరారు కావడం ఈ కుంభకోణాలకు సూత్రధారి చంద్రబాబేనని స్పష్టం చేస్తోంది.

పాత్రలు ఫినిష్..!

అక్రమ నిధులు తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న అవినీతి నెట్‌వర్క్‌ను కేంద్ర ఆదాయపన్ను శాఖ, సీఐడీ సిట్ ఛేదించడంతో చంద్రబాబుకు దారులు మూసుకుపోయాయి. అప్పటికే మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తాల వాంగ్మూలాన్ని ఆదాయ పన్ను శాఖ నమోదు చేసింది. తాము చంద్రబాబు పీఎస్ శ్రీనివాస్ ద్వారా ఆయనకు భారీగా ముడుపులు అందించినట్లు వాంగ్మూలంలో వారు అంగీకరించారు. ఈ నేపథ్యంలో అక్రమ ఆదాయంపై ఆదాయ పన్ను శాఖ సమాచారంతో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇంతలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తన సన్నిహితులు ముగ్గురికీ సిట్ నోటీసులు జారీ చేస్తుందని చంద్రబాబు ఊహించలేదు. దీంతో ఏ క్షణంలో ఏమైనా జరగవచ్చని ఊహించి తనను రెండు రోజుల్లో అరెస్టు చేయవచ్చంటూ తాజాగా వ్యాఖ్యానించారు. తనను అరెస్టు చేస్తే రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలని టీడీపీ శ్రేణులకు పరోక్షంగా సందేశమిచ్చారు. ఈ కుట్రలకు వ్యూహ రచన చేస్తూనే తన సన్నిహితులు మనోజ్ వాసుదేవ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, పెండ్యాల శ్రీనివాస్ సిట్ విచారణకు హాజరైతే అక్రమాల చిట్టా బద్దలవుతుందనే భయంతో వారిని విదేశాలకు పారిపోవాలని చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

అమెరికాకు శ్రీనివాస్... దుబాయ్‌కి మనోజ్

చంద్రబాబు ఆదేశాలతో ఆయన పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అప్పటికప్పుడే హఠాత్తుగా అమెరికాకు పరారయ్యారు. సిట్ నోటీసులు అందినట్లు ఆయన కుమార్తె తెలిపారు. నోటీసులపై ఆమె సంతకం కూడా చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో చంద్రబాబు పీఎస్ అందుబాటులో లేకుండా పోయారు. ఆ తరువాత అమెరికా వెళ్లిపోయారు. అంటే నోటీసులు అందడంతోనే పెండ్యాల శ్రీనివాస్ పరారైనట్లు స్పష్టమవుతోంది. ఇక మనోజ్ పార్థసాని దుబాయ్ ఉడాయించారు. ఆయన ముంబై నుంచి దుబాయ్ వెళ్లిపోయారు. తనకు సీఐడీ నోటీసులు జారీ చేసిందనే విషయం తెలియగానే ఆయన అందుబాటులో లేకుండా పోయారు. అనంతరం హడావుడిగా దుబాయ్‌కి పరారయ్యారు. అక్కడ నుంచి ఆయన ఎక్కడకు వెళ్తారన్నది సన్నిహితులకు కూడా చెప్పకుండా అత్యంత గోప్యంగా ఉంచారు. మరోవైపు షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా ఆచూకీ తెలియడం లేదు. ఆయన ఎక్కడ ఉన్నారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. సీఐడీ నోటీసులు జారీ చేసిన వెంటనే చంద్రబాబు సన్నిహితులు ముగ్గురూ హఠాత్తుగా అదృశ్యం కావడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారన్న దానికి ఇదే తిరుగులేని నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తాజా పరిణామాలతో తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సీఐడీ అధికారులు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు.

2.5 లక్షల మంది వృత్తిదారుల నమోదుకు చర్యలు

- సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి వెల్లడి
- వివిధ శాఖలపై అధికారులతో సమీక్ష



సాక్షి, అమరావతి: కేంద్రం ఈ నెల 17 నుంచి ప్రారంభించనున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో రాష్ట్రంలో తొలి ఏడాదిలో 2.5 లక్షల మంది చేతివృత్తిదారులను నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖలపై సమీక్ష జరిపారు. సీఎస్ మాట్లాడుతూ ఈ పథకానికి వడ్రంగి, కమ్మరి, తాళాల మరమ్మతు చేసేవారు, శిల్ప కళాకారులు, స్వర్ణకారులు, కుమ్మరి, చెప్పులు కుట్టేవారు, తాపీ, బుట్ట, చాప ,చీపుర్లు, బొమ్మలు తయారీదారులు, క్షురకులు, పూల దండలు చేసేవారు, రజకులు, దర్జీలు, చేపల వలలు తయారీ చేసే వారు, పడవలు, పరికరాలు, ఇతర పనిముట్లు తయారీ చేసే వారు అర్హులని వివరించారు. అర్హులైన వారికి తొలి విడతగా వారి వ్యాపారాభివృద్ధికి రూ.లక్ష రుణం అందిస్తారని, ఆ రుణం తీర్చిన తరువాత రెండో విడతగా మరో రూ. 2 లక్షలు వెరసి రూ.3 లక్షలను 5 శాతం స్థిర వడ్డీతో హామీలేని రుణం అందిస్తారని తెలిపారు. ప్రతి లబ్ధిదారుకు రూ.15,000 విలువైన పనిముట్లను రాయితీ ద్వారా అందిస్తారన్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతితో పాటు రోజుకు రూ.500 వంతున స్టైపెండ్‌గా ఇస్తారని చెప్పారు. ఈ పథకానికి కుటుంబ వృత్తిగా చేస్తోన్న 18 ఏళ్లు కలిగిన వారు అర్హులని చెప్పారు.

ఎంఎస్‌ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) ద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలవుతుందని సీఎస్ అన్నారు. ఆయా యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు తగిన తోడ్పాటును అందించి సకాలంలో యూనిట్లు ఏర్పాటయ్యేలా చూడాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. కొప్పర్తి, గుంటూరుల్లో ఏర్పాటవుతున్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాల ప్రగతిని తెలుసుకున్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించిన సేవలను సులభతరం చేసేందుకు రూపొందిస్తున్న వైఎస్సార్ ఏపీ వన్ ప్లాట్‌ఫాం గురించి సమీక్షించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంఎస్ఎంఈ రంగంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

3,4 నెలల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో పలు కంపెనీలతో చేసుకున్న అవగాహనా ఒప్పందాలు, తదుపరి చర్యలపైనా సీఎస్ సమీక్షించారు. రాబోయే 3,4 నెలల్లో జీఐఎస్‌లో అవగాహనా ఒప్పందాలు చేసుకున్న సంస్థలు, అవి ఏర్పాటు చేసే యూనిట్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ముమ్మరంగా ఏర్పాట్లు

- ఈ నెలలో ప్రారంభం
- ముందుగా ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే
- ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు
- వైద్య శిబిరాల్లో ప్రజలకు ఉచితంగా పరీక్షలు, మందులు
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులలో ఉచితంగా చికిత్స
- వైద్య శిబిరాలు ప్రారంభించే నాటికి అన్ని ప్రాంతాలకూ మందులు
- రూ. 66.65 కోట్లతో మందులు, ఇతర వస్తువుల కొనుగోలు
- ఇంటింటి సర్వే, ప్రజల స్క్రీనింగ్‌కు ప్రత్యేకంగా యాప్

ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ వినూత్న కార్యక్రమం

సాక్షి, అమరావతి: వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం.. ఇప్పుడు ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటిని పరిష్కరించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నెలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం కోసం ఆరోగ్య శాఖ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం తరహాలోనే ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది.

రూ.66.65 కోట్లతో మందులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఏఎన్ఎంలు వారి పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే చేస్తారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందిస్తున్నారు. సర్వేలో గుర్తించిన ఆరోగ్య సమస్యలున్న ప్రజలకు గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, వారికి అవసరమైన పరీక్షలు చేసి, మందులు ఇస్తారు. ఇందు కోసం రూ.66.65 కోట్ల విలువ చేసే 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, ఎమర్జెన్సీ కిట్స్, ఇతర వస్తువులను కొంటున్నారు. ఈ నెల 30వ తేదీ వైద్య శిబిరాల నిర్వహణ మొదలయ్యే నాటికి అన్ని ప్రాంతాలకు వీటిని సరఫరా చేస్తారు.



342 మంది స్పెషలిస్ట్ వైద్యులు

10,032 విలేజ్ క్లినిక్స్, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ నెల 30 నుంచి నెల రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నది ప్రణాళిక. ప్రతి క్యాంప్‌నకు సంబంధిత పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్ వైద్యులు హాజరవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 342 మంది స్పెషలిస్ట్ వైద్యులను గుర్తించారు. కార్యక్రమం పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 11 నుంచి కంట్రోల్ రూమ్‌ల నుంచి వైద్యులు, మందులు, డయగ్నోస్టిక్స్ లభ్యత వంటి ఇతర అంశాలపై పర్యవేక్షణ మొదలవుతుంది.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణ ఇలా

- 15వ తేదీ నుంచి కార్యక్రమంపై వలంటీర్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం
- 16వ తేదీ నుంచి ప్రజల్లో ఆరోగ్య సమస్యల గుర్తింపునకు ఇంటింటి సర్వే
- 30వ తేదీ వైద్య శిబిరాల నిర్వహణ

ఉచితంగా చికిత్స

శిబిరాల్లో వైద్యుల కన్సల్టేషన్ అనంతరం ఎవరికైనా తదుపరి వైద్యం అవసరమైతే దగ్గరలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపుతారు. ఆస్పత్రుల్లో వారికి ఉచితంగా చికిత్స చేస్తారు. ఈ కార్యక్రమంపై వలంటీర్లు 15 రోజుల పాటు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

క్లుప్తంగా...

లోకేశ్‌ది గొడవల గళం: హోం మంత్రి తానేటి వనిత



సాక్షి, రాజమహేంద్రవరం: 'నారా లోకేశ్ చేస్తున్నది యువగళం కాదు.. గొడవల గళం' అని హోం మంత్రి తానేటి వనిత ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎర్ర టీ షర్టులు వేసుకుని, టీడీపీ రౌడీలు పోలీసులపై దాడులు చేస్తున్నారన్నారు. టీడీపీ దాడులతో పోలీసులు తీవ్రంగా గాయపడుతున్నట్లు చెప్పారు. ఏదో రకంగా ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. పుంగనూరులో చంద్రబాబు, భీమవరంలో లోకేశ్ అలజడి సృష్టించారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

స్టీల్ ప్లాంట్‌కు ఉక్కు సరఫరాను పునరుద్ధరించాలి

కేంద్రమంత్రికి బీజేపీ ఎంపీ జీవీఎల్ లేఖ



సాక్షి, విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్)కు ఛత్తీస్‌ఘడ్‌లోని ఎన్‌ఎండీసీకి చెందిన బైలదిల్లా గనుల నుంచి ఇనుప ఖనిజం సరఫరాను సత్వరమే పునరుద్ధరించాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. ఈ ప్లాంట్‌కు ప్రారంభం నుంచి కొన్ని నెలల క్రితం వరకు బైలదిల్లా గనుల నుంచి ఇనుప ఖనిజం సరఫరా అయ్యిందని పేర్కొన్నారు. ఆర్‌ఐఎన్‌ఎల్, ఎన్‌ఎండీసీలు ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉన్నందున బైలదిల్లా గనుల నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప ఖనిజం సరఫరాను తిరిగి ప్రారంభించాలని కోరారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



యూకే ప్రతినిధులతో మంత్రి రజిని

సాక్షి, అమరావతి: వైద్య సిబ్బంది నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళితే అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడటానికి మరింత ఎక్కువ ఆస్కారం ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం యూకే ప్రభుత్వ జాతీయ వైద్య పథకం(యూకేఎన్‌హెచ్‌ఎస్) ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర వైద్యసేవలకు సంబంధించి యూకే ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రాష్ట్రంలోని 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ టెక్నీషియన్‌లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని యూకే ప్రతినిధులకు సూచించారు. యూకే ప్రతినిధులు తమ శిక్షణ మాడ్యూల్స్‌ను మంత్రి రజినికి వివరించారు. ఈ సమావేశంలో యూకే ప్రభుత్వ ప్రతినిధులు రిచర్డ్స్, డేవిడ్, లిజి, ఈమీ, అరబిందో ఈఎంఎస్ ఆపరేషన్స్ హెడ్ గంగాధర్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం పేరుతో ప్రజలపై బెదిరింపులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు సనాతన ధర్మం పేరుతో ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మండిపడ్డారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్‌తో కలిసి ఆయన విజయవాడలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీని బలపరిచే పార్టీలతో కలిసే ప్రసక్తే లేదని చెప్పారు.

ఉదయనిధికి కమల్ మద్దతు

సాక్షి, చెన్నై: సనాతన ధర్మం వ్యవహారంలో తమిళనాడు క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలకు విశ్వనటుడు, మక్కల్ నీది మయ్యం నేత కమలహాసన్ మద్దతు తెలిపారు. ఆయన వ్యాఖ్యల్లో తప్పేముందని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం కమల్ ఓ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించాల్సిన అవసరం ఉందని, ఇందుకు సంబంధించిన సరైన సమాధానం కూడా రాబట్టుకోవాల్సి ఉంటుందన్నారు. సనాతనధర్మం గురించి మాట్లాడే హక్కు ఉదయనిధికి ఉందని తెలిపారు. ఆయన వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం మంచిది కాదన్నారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి లోకేశ్ పాదయాత్ర

మలికిపురం: టీడీపీ నేత లోకేశ్ యువగళం పాదయాత్ర శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశించింది. ఆయనకు దిండి వంతెనపై మాజీ మంత్రి, రాజోలు మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, నాయకులు జ్యోతుల నెహ్రూ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు స్వాగతం పలికారు. దిండిలో లోకేశ్ వెంట నడుస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అస్వస్థతకు గురయ్యారు. అకస్మాత్తుగా షుగర్ లెవల్స్ పడిపోవడంతోపాటు ఆయాసానికి లోనయ్యారు. వెంటనే అంబులెన్స్‌లోకి చేర్చి ప్రథమ చికిత్స చేశారు. కాగా, జిల్లాలో తొలి రోజే జనం లేక పాదయాత్ర వెలవెలబోయింది.

నిన్నెందుకు అరెస్టు చేయకూడదు బాబూ?

కేవలం రూ.600 కోట్ల పనుల్లోనే రూ.118.98 కోట్ల కమీషన్లు..

- ఫైబర్ గ్రిడ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఈఎస్ఐ, అసైన్డ్ తదితర కుంభకోణాల్లో ఇంకెన్ని వేల కోట్లు దోచేశావో?
- చంద్రబాబును అరెస్టుచేసి ప్రజాధనాన్ని కక్కించాలి
- మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

సాక్షి, అమరావతి/గుంటూరు ఎడ్యుకేషన్/గార/కాశీబుగ్గ/సాక్షి ప్రతినిధి, బాపట్ల/జగ్గయ్యపేట అర్బన్/ : ప్రభుత్వ ఖజానాను దోచేసి.. రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసిన నిన్నెందుకు అరెస్టు చేయకూడదో చెప్పాలంటూ వైఎస్సార్‌సీపీ నేతలు టీడీపీ అధినేత చంద్రబాబును ప్రశ్నించారు. నోటీసు రాగానే తనను అరెస్టుచేస్తారని ఆయన గావు కేకలు పెడుతున్నారన్నారు. ఐటీ నోటీసులపై రాష్ట్రమంతా చర్చ జరుగుతున్నా చంద్రబాబు మౌనంగా ఉంటూ సానుభూతి డ్రామాలాడుతున్నారని వారు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మేరుగు నాగార్జునతోపాటు వేర్వేరు చోట్ల పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతరులు చంద్రబాబు తీరుపై శుక్రవారం స్పందించారు. వారు ఏమన్నారంటే..

వేలకోట్లు కొల్లగొట్టిన బాబు : మంత్రి మేరుగు నాగార్జున



కేవలం రూ.600 కోట్ల పనుల్లోనే చంద్రబాబు రూ.118.98 కోట్లను కమీషన్లుగా వసూలు చేసినట్లు ఐటీ శాఖ తేలిస్తే.. ఐదేళ్లలో ఫైబర్‌గ్రిడ్ స్కాం, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం, ఈఎస్ఐ స్కాం, అసైన్డ్ భూకుంభకోణం, రాజధాని భూ భాగోతం తదితర కుంభకోణాల్లో రూ.వేలాది కోట్లను చంద్రబాబు కొల్లగొట్టారు. తక్షణమే చంద్రబాబును అరెస్టుచేసి.. ఈ కుంభకోణాలన్నింటిపై విచారణ జరిపి.. మింగిన సొమ్మును కక్కించాలి. నిన్నటిదాకా చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్ కలిసి ఏం పీక్కుంటారో పీక్కోండి అంటూ సవాల్ విసిరారు.. ఇప్పుడెందుకు అరెస్టు చేస్తారని పిరికిపందలా ఆయన భయపడుతున్నారు? ఇక సొంత ఖర్చులతో సీఎం జగన్ విదేశీ పర్యటనకు వెళ్తే చంద్రబాబు కుక్కలా మొరుగుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు విదేశీ పర్యటనల కోసం స్పెషల్ ఫ్లైట్లు, విలాసాలకు వందల కోట్లను దుబారా చేసింది నువ్వు కాదా చంద్రబాబూ?.

అవినీతికి పాల్పడకపోతే భయమెందుకు: మంత్రి అంబటి రాంబాబు



అవినీతికి పాల్పడకుంటే చంద్రబాబుకు అరెస్టు భయమెందుకు? ఐటీ నోటీసులకు ధైర్యంగా సమాధానం ఇవ్వచ్చు కదా.. బాబు ముడుపులు తీసుకున్న మాట వాస్తవమని విచారణలో తేలిన తరువాతే నోటీసులు ఇచ్చారు. ఈ విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుంది. వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకోవటం చంద్రబాబుకు అలవాటే. యువగళం పాదయాత్రకు తమిళనాడు నుంచి జనాన్ని తెచ్చి తిప్పుతున్నారు. పుంగనూరు లాగా పోలీసులు మీద తిరుగుబాటు చేసి రాళ్లను విసిరి, పోలీసులను కొట్టాలని చూస్తే పోలీసులు, ప్రభుత్వమూ చూస్తూ ఊరుకోదు.

బాబు సానుభూతి డ్రామాలు నమ్మొద్దు: మంత్రి అప్పలరాజు



చంద్రబాబుకు ఐటీ నోటీసుల అంశంపై రాష్ట్రమంతా చర్చ జరుగుతున్నా చంద్రబాబు మాత్రం మౌనంగా ఉంటూ సానుభూతి డ్రామాలు ఆడుతున్నారు. దీనిపై పచ్చ మీడియా కూడా ప్రచారం చేయడంలేదు. దత్తపుత్రుడు సైతం నోరు మెదపడంలేదు. చంద్రబాబు రాష్ట్రానికి ఏం చేశారు? పోలవరాన్ని బాబు ఏటీఎంలా వాడుకున్నారు. జన్మభూమి కమిటీల పేరుతో అరాచక పాలన కావాలో.. సచివాలయాలు, వలంటీర్ల వంటి సేవలు కావాలో ప్రజలే తేలుస్తారు.

శాంతిభద్రతలకు బాబు విఘాతం: ఎంపీ మోపిదేవి వెంకటరమణ



చంద్రబాబు, లోకేశ్‌లు కులాలను రెచ్చగొడుతున్నారు. రౌడీమూకలతో దాడులు చేయించి రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ఎన్ని యాత్రలు చేసినా చంద్రబాబును జనం నమ్మే పరిస్థితిలేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన వ్యక్తి జగన్ అయితే జనాన్ని మోసగించిన వ్యక్తి చంద్రబాబు. జగన్ పాలనలో చంద్రబాబు, లోకేశ్ తప్ప రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.

బాబు శిక్ష అనుభవించక తప్పదు: మంత్రి అమర్‌నాథ్



అవినీతికి పాల్పడి ఐటీ శాఖకు అడ్డంగా దొరికిపోయి, తప్పించుకు తిరుగుదామనుకుంటున్న చంద్రబాబు చంద్రమండలం మీద ఉన్నా తీసుకు వస్తారు. ఆయన శిక్ష అనుభవించక తప్పదు. సానుభూతి పొందడానికి తనను రెండు రోజుల్లో అరెస్టుచేస్తారంటూ చంద్రబాబు చెప్పుకుంటున్నారు. తప్పుచేస్తే అరెస్టుచేయరా? ఐటీ అధికారులకు వాంగ్మూలం ఇచ్చిన ఆ ఇద్దరినీ దుబాయ్‌కి, అమెరికాకు ఎందుకు పంపించాల్సి వచ్చింది? తాను తప్పు చేయలేదని చంద్రబాబు ఎందుకు చెప్పడంలేదు. మిత్రపక్షాలు కూడా ఎందుకు మౌనం వహించాయి?

బాబు భవిష్యత్‌కే నో గ్యారంటీ: ప్రభుత్వ విప్ ఉదయభాను



చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలు, అవినీతితో నిర్మితమైంది. దేశంలో ఏ రాజకీయ నాయకుడిపై లేనన్ని అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు చంద్రబాబుపై ఉన్నాయి. తండ్రీకొడుకులిద్దరూ పెద్ద అవినీతిపరులు. దోచుకుని పంచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఎన్నికల్లో గెలవలేమనే వారిద్దరూ పిచ్చిపట్టినట్లు హింసను ప్రేరేపిస్తున్నారు. తక్షణం వారిని అరెస్టుచేయాలి.

బాబుకు జైలు భయం: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచేసి ఇప్పుడు ఐటీ శాఖకు అడ్డంగా దొరికిపోయారు. దీంతో చంద్రబాబు, లోకేశ్, దత్తపుత్రుడు పవన్, ఎల్లో మీడియా గొంతులు మూగబోయాయి. కాంట్రాక్టు సంస్థలకు దోచిపెట్టి వాటి ద్వారా చంద్రబాబు భారీగా లబ్ధిపొందారు. జైలుకు వెళ్లకతప్పదనే భయంతోనే చంద్రబాబు సానుభూతి నటన ప్రారంభించారు. తాను తప్పు చేయలేదని చంద్రబాబు చెప్పడం లేదు. ఆయనకు వినాశనం దగ్గర పడింది.

ఐటీ శాఖపై పరువునష్టం దావా వేయగలవా?: వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి



ఐటీ శాఖ తప్పుడు నోటీసులు ఇచ్చిందని భావిస్తే.. ఆ శాఖ మీద పరువు నష్టం దావా వేయగలవా? కేంద్రాన్ని కూడా ప్రతివాదిగా చేర్చి కోర్టులో విచారణ కోరవచ్చు కదా.. ఆ పని చేయకపోవడానికి కారణం భయమా? లేక ఇంకా లోతుగా విచారిస్తే మరింత అడ్డంగా దొరికిపోతామన్న ఆందోళనా? అనేక కోర్టు కేసుల్లో స్టేలు తెచ్చుకుని చంద్రబాబు తప్పించుకు తిరుగుతున్నారు.. ఇప్పుడు చంద్రబాబు పాపం పండింది.. విచారణ ఎదుర్కోక తప్పదు.

గురివిందకు ముదిరిన పచ్చ కామెర్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఉన్మాద స్థాయికి చేరిన కక్ష

సీఎం వ్యక్తిగత పర్యటనలో విమాన ప్రయాణాలపై దుష్ప్రచారం

ఫిల్మ్ సిటీలో కొండపై విలాసవంతమైన అద్దాల మేడలో ఉంటున్న రామోజీకి మార్గదర్శి దెబ్బకు కొద్ది రోజులుగా నిద్ర కరువైంది. జనం నవ్విపోతారనే స్పృహ కూడా లేకుండా నిస్సిగ్గుగా సీఎం జగన్‌పై దుష్ప్రచారానికి బరితెగించారు. ఫైవ్ స్టార్ హోటల్లో చంద్రబాబు నివాసం.. దేశాధ్యక్షుడి తరహాలో విదేశీ పర్యటనలు.. క్యాంపు కార్యాలయాల పేరుతో రూ.కోట్లు వెచ్చింపు.. ఇవేవీ ఈ రాజగురివిందకు కనిపించలేదు. విలాసవంతమైన జీవితానికి కేరాఫ్‌గా నిలిచిన బాబు ఏం చేసినా వెనకేసుకు రావడమే ఈయన జీవిత లక్ష్యం. ఇందులో భాగంగా సీఎం జగన్ ఏది చేసినా తప్పుగా చూపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి విఫల యత్నం చేస్తున్నారు. సొంత ఖర్చుతో విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం జగన్‌పై ఇసుమంత కూడా ఆలోచించకుండా బురదచల్లడం రామోజీ గురివింద నీతిని బయట పెట్టింది.

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగతంగా ఈనాడు రామోజీ కక్ష ఉన్మాద స్థాయికి చేరింది. ఇందులో భాగంగా సీఎం జగన్ వ్యక్తిగత పర్యటనలో విమాన ప్రయాణాలపై పచ్చి అబద్ధాలతో కూడిన కథనం వండి వార్చారు. ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత పర్యటనకు ఎక్కడకు వెళ్లినా ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదు. రవాణా సహా అన్ని రకాల ఖర్చులనూ సొంతంగానే భరిస్తున్నారు. వాస్తవం ఇలా ఉంటే సీఎం విమాన ప్రయాణాలకు పేదల పక్షపాతానికి లంకె పెట్టి వ్యక్తిగత కక్షను, ద్వేషాన్ని రామోజీ బయట పెట్టుకున్నారు. మార్గదర్శిలో ఉల్లంఘనలు ఆధారాలతో బయటకు వస్తుంటే రామోజీకి దిక్కుతోచక పనికట్టుకుని సీఎంపై విషం కక్కుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేశాక అమెరికా, లండన్, ఇజ్రాయెల్, పారిస్‌కు వ్యక్తిగత పర్యటనలకు వెళ్లారు. ఇందుకోసం ఏ రోజు కూడా ఒక్కపైసా ప్రభుత్వ ఖజానా నుంచి తీసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. తన వ్యక్తిగత పర్యటనల కోసం ప్రజల డబ్బును ఆశించని జగన్ పేదల పక్షపాతా.. లేక నాడు ఏదో వంక పెట్టుకుని విమానాల్లో తిరుగుతూ ప్రజల సొమ్మును వాడుకున్న చంద్రబాబు పేదల పక్షపాతా?

సర్కారు సొమ్ముతో ఫైవ్ స్టార్ హోటల్లో మకాం

గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు తన నివాసం, క్యాంపు కార్యాలయంగా హైదరాబాద్‌లోని పార్క్ హయత్ ఫైవ్ స్టార్ హోటల్‌ను ప్రకటించి మరీ సర్కారు ఖజానా నుంచి ఏకంగా 30 కోట్ల రూపాయలు చెల్లించారు. ఆ హోటల్లో బాబు కుటుంబం నెలల తరబడి నివాసం ఉండటం, అందుకు ఖజానా నుంచి కోట్ల రూపాయలు చెల్లించినా రామోజీకి కనిపించలేదు. ఇందుకు సంబంధించి ఒక్క ముక్క కూడా రాయలేదు. ఏ సీఎం కూడా ఇలా ఫైవ్ స్టార్ హోటల్‌లో నివాసం ఉండటం ఎక్కడా జరగలేదు. రోజుకు లక్ష రూపాయల చొప్పున పార్క్ హయత్ హోటల్‌కు అద్దె రూపంలో చెల్లించినట్లు అప్పట్లో ఆంగ్ల పత్రికలు సైతం ప్రముఖంగా ప్రచురించినా రామోజీకి కనిపించలేదు.. వినిపించలేదు.

క్యాంపు కార్యాలయాల పేరుతో రూ.90 కోట్లు ఖర్చు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయాల కోసం కోట్ల రూపాయలను వ్యయం చేసి దుబారాకు పాల్పడ్డారు. తొలుత జూబ్లిహిల్స్‌లోని తన నివాసాన్ని సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించి ఖజానా నుంచి నిధులు వ్యయం చేశారు. ఆ తర్వాత అద్దె ఇంటిలోకి వెళ్లి ఆ ఇంటిని సీఎం నివాసం, క్యాంపు కార్యాలయంగా ప్రకటించారు. ఆ ఇంటికి కూడా ప్రభుత్వ ఖజానా నుంచి కోట్ల రూపాయలు వ్యయం చేశారు. హైదరాబాద్‌లో హెచ్ బ్లాక్‌ను సీఎం కార్యాలయంగా ప్రకటించి ఏడు కోట్ల రూపాయలతో మరమ్మతులు చేశారు. ఆ తర్వాత వాస్తు పేరుతో ఎల్ బ్లాక్‌ను సీఎం కార్యాలయంగా ప్రకటించి మరమ్మత్తులు, ఫర్నీచర్ కోసం ఏకంగా రూ.25 కోట్లు వ్యయం చేశారు. హైదరాబాద్‌లోనే లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌ను సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించి రూ.10 కోట్లు వ్యయం చేశారు. ఆ తర్వాత ఓటుకు కోట్లు కేసుకు జడిసి హఠాత్తుగా హైదరాబాద్ వదిలేసి విజయవాడ వచ్చేశారు. విజయవాడ ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌ను సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించి మార్పులు చేర్పుల కోసం రూ.42 కోట్లు వ్యయం చేశారు. తర్వాత కృష్ణ కరకట్ట పక్కన ఉన్న లింగమనేని గెస్ట్ హౌస్‌ను సీఎం నివాసం, క్యాంపు కార్యాలయంగా ప్రకటించారు. వీటన్నింటికీ అధికారికంగా ప్రభుత్వ ఖజానా నుంచి రూ.కోట్లు వ్యయం చేశారు. మదీనాగూడలోని చంద్రబాబు సొంత ఫామ్‌హౌస్‌లో హెలిప్యాడ్, రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు విడుదల చేస్తూ జీవో జారీచేశారు. జూబ్లీహిల్స్‌లో విలాసవంతమైన ఇంద్రభవనాలు నిర్మించుకున్నారు. వాటికి ఇంటీరియర్ కోసం సీఆర్‌డీఏ నిధులను మళ్లించారు. సీఎం క్యాంపు కార్యాలయాల కోసం చంద్రబాబు ఏకంగా రూ.90 కోట్లు ఖజానా నుంచి వ్యయం చేశారు.

తక్కువ దూరాలకు రోడ్డు మార్గంలోనే సీఎం జగన్

తక్కువ దూరాలకు సీఎం హెలికాప్టర్లు వాడుతున్నారంటూ ఈనాడు దినపత్రిక వాస్తవాలను వక్రీకరించిందని అధికార వర్గాలు తప్పుపట్టాయి. తాడేపల్లి నివాసం నుంచి విమానాశ్రయానికి వెళ్లాలన్నా, సచివాలయానికి వెళ్లాలన్నా, ఇటు గుంటూరు, విజయవాడ నగరాల్లో ఏ కార్యక్రమం ఉన్నా ముఖ్యమంత్రి రోడ్డు మార్గం ద్వారానే ప్రయాణిస్తున్నారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో రోడ్లు క్లియర్ చేసి, వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని పలుమార్లు ఆయన అధికారులను ఆదేశించడం తెలిసిందే.

నాడు బాబు ఖర్చంతా ఖజానా నుంచే

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏరకంగా విమానాలను, హెలికాప్టర్లను వాడుకున్నారో రాష్ట్ర ప్రజలు స్వయంగా చూశారు. కరకట్ట నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లాలన్నా, గుంటూరు వెళ్లాలన్నా, మరెక్కడికి వెళ్లాలన్నా హెలికాప్టర్ తప్పనిసరి. ప్రజల నుంచి విమర్శలు తీవ్రంగా రావడంతో ఈ ఖర్చులను విమాన, హెలికాప్టర్ ప్రయాణ ఖర్చులు కింద చూపకుండా, మరో పద్దుల్లో చూపించి.. ఆడిట్‌లో బయట పడకుండా చూసుకున్నారు. చంద్రబాబు చేసిన పర్యటనలు, వెళ్లిన విదేశాల జాబితా చాంతాడంత ఉంది. సింగపూర్, కొరియా, జపాన్, స్విట్జర్లాండ్, అమెరికా, యూఏఈ, కజకిస్థాన్, జర్మనీ ఇలా పలు దేశాల్లో పర్యటించారు. సర్వం ఖర్చులను ప్రభుత్వం నుంచే డ్రా చేశారు. సీఎంగా చంద్రబాబు నాలుగేళ్లలోనే 14 దేశాల్లో 21 సార్లు పర్యటించారు. ఈ పర్యటనలన్నీ ప్రత్యేక విమానాల్లోనే చేశారు. ఇందుకోసం ఖజానా నుంచి రూ.100 కోట్లు వ్యయం చేశారు.

ఛార్టర్డ్ ఫ్లైట్‌లో పేదల పక్షపాతి



ఆ సవాల్‌ను ఎందుకు స్వీకరించలేదు?

వైఎస్ జగన్‌పై ఈడీ వేసిన అభియోగపత్రంలో వాటి విలువ రూ.43 వేల కోట్లు అంటూ ఈనాడు దినపత్రిక నిస్సిగ్గుగా తప్పుడు రాతలు రాసింది. దీనిపై ఆరేళ్ల క్రితం సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా వైఎస్ జగన్ సవాల్ విసిరిన సంగతి అందరికీ తెలుసు. 'టీడీపీ, చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో 10 పైసలు వాటా ఇవ్వండి.. ఎక్కడ కావాలంటే అక్కడ సంతకాలు పెడతాను' అని నాడు వైఎస్ జగన్ విసిరిన సవాల్‌ను స్వీకరించలేక చంద్రబాబుతో పాటు టీడీపీ తోక ముడిచింది. వైఎస్ జగన్‌పై ఆరోపణల కింద పేర్కొన్న మొత్తం రూ.1200 కోట్లు. ఇందులో కూడా నేరాభియోగాలు ఎదుర్కొన్న కాలానికి సంబంధం లేనివి ఉన్నాయి. ఇప్పుడు న్యాయ స్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. ఆ రోజు టీడీపీ చేసిన ఆరోపణలను పట్టుకుని ఇప్పుడు ఈనాడు దినపత్రిక మరోసారి తన కథనం ద్వారా బురదజల్లింది.

రామోజీ.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి

- రూ.2.32 లక్షల కోట్లను నేరుగా అర్హులైన పేదల ఖాతాల్లోకి జమ చేసిన సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి కాదంటారా?
- ప్రజలకు చేరాల్సిన ప్రభుత్వ సొమ్మును తన మనుషులతో కుమ్మక్కై దోచుకుని.. ఐటీ స్కామ్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, సాగునీటి ప్రాజెక్టుల కాంట్రాక్టులు.. రాజధాని పేరిట కాంట్రాక్టుల్లో స్కామ్‌లలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు పెత్తందారీ కాక మరేమవుతాడు?
- గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి లాబీయింగ్, దళారులకు, రాజకీయ మధ్యవర్తులకు స్థానం లేకుండా అర్హతే ప్రామాణికంగా అవినీతికి, పక్షపాతానికి చోటు లేకుండా.. రాజకీయం, కులం, మతం, ప్రాంతం చూడకుండా అర్హులందరికీ పథకాల లబ్ధి అందించిన ముఖ్యమంత్రి పేదల పక్షపాతి కాదని ఎలా చెబుతారు?
- జన్మభూమి లాంటి కమిటీలను ఏర్పాటు చేసి, పెన్షన్ల నుంచి మరుగుదొడ్ల వరకూ లంచాల రూపంలో పిండేసి వారిని దగాచేసిన చంద్రబాబు పెత్తందారు కాదని చెప్పగలరా?
- ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలి. వారి జీవన ప్రమాణాలు పెరగాలని 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చి, వారికి ఇళ్లు కట్టిస్తున్న ముఖ్యమంత్రి పేదల పక్షపాతి కాదా?
- పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వకుండా, టిడ్కో ఇళ్ల నిర్మాణం రూపంలో దోచుకుని, నకిలీ కంపెనీల ద్వారా ముడుపులు స్వీకరించి, దీనికోసం కంపెనీలకు రేట్లు పెంచి దోపిడీ చేసి, ఆధారాలతో సహా బయటకు వచ్చినా స్పందించని చంద్రబాబు పెత్తందారు కాదా?
- రాష్ట్ర ప్రజలకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టులో అక్రమాలు గుర్తించి, రివర్స్ టెండరింగ్ ద్వారా దాదాపుగా రూ.800 కోట్ల ప్రజా ధనాన్ని ఆదా చేసిన వైఎస్ జగన్ పేదల పక్షపాతి కాదా? అదే పోలవరం కాంట్రాక్టు పనులను రామోజీరావు, యనమల రామకృష్ణుడు వియ్యంకులకు కట్టబెట్టి, నామినేషన్ పద్ధతుల్లో వారికి కేటాయించి దోచేసిన చంద్రబాబు పెత్తందారు కాక మరేమవుతారు?

గోబెల్స్ విస్తుపోయేలా..

రాజగురువు రామోజీ తన దుష్ప్రచార కథనంలో చెప్పిన ప్రకారం చూసుకున్నా విమానం అద్దె గంటకు రూ.2.7 లక్షలు. ఇక్కడి నుంచి లండన్‌కు (మధ్యలో ఇంధనం నింపుకునే సమయంతో కలిపి) 11 గంటలు. తిరిగి అక్కడి నుంచి వచ్చేందుకు మరో 11 గంటలు. మొత్తంగా 22 గంటల విమాన ప్రయాణానికి పార్కింగ్ సహా రూ.60 లక్షలకు మించదు. ఈ విషయాన్ని విస్మరించి రామోజీనే తన కథకంలో రూ.కోట్లు అని రాయడం.. దానిని చంద్రబాబు రూ.40 కోట్లుగా మార్చడం.. ఎల్లో గ్యాంగ్ దానికి మరో రూ.10 కోట్లు కలిపి చెప్పడం చూస్తుంటే వీరి గోబెల్స్ ప్రచారం ఎలా సాగుతుందో చెప్పడానికి ఇంతకుమించిన ఉదాహరణ మరొకటి ఉండదు. ఈ దుష్ప్రచారం చూసి ఉంటే గోబెల్సే విస్తుపోయేవాడు.

రామోజీ దృష్టిలో పవన్, లోకేశ్‌లూ పేదలే

మంత్రిగా ఉన్నప్పుడు దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు లోకేశ్ జ్యూరిక్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లోనే వెళ్లాడు. దీని కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేశాడు. సీఎం జగన్ జ్యూరిక్ నుంచి కారులో దావోస్‌కు వెళ్లారు. రెండెకరాలు ఉన్న నారా కుటుంబం ఇవాళ ఇన్ని ఆస్తులు పోగేసుకుని, ప్రతిపక్షంలో కూడా ప్రత్యేక విమానాల్లో తిరుగుతుంటే ఈనాడుకు చాలా నిరాడంబరంగా కనిపిస్తోంది. పవన్ కళ్యాణ్ విషయానికి వస్తే ప్రత్యేక విమానం లేనిదే అడుగు బయట పెట్టడంలేదు. వీళ్లందరినీ పేదల పక్షపాతులుగా చూపించాలని రామోజీ తాపత్రయ పడుతుండటం అడుగడుగునా కనిపిస్తోందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పచ్చళ్లు అమ్ముకుని, ప్రజల సొమ్మును ఫైనాన్స్ రూపంలో, చిట్టీల రూపంలో అక్రమంగా వాడుకుని పెద్ద సామ్రాజ్యాన్ని సృష్టించిన రామోజీరావు.. ఇవాళ డబుల్ బెడ్ రూంలో ఉంటున్నాడా? రామోజీరావుకు ఉన్న ఇళ్లు ఎన్ని? భూములు ఎన్ని? సంపద ఎంత? ఇలాంటి రామోజీ పేదల గురించి, నిరాడంబరత గురించి కథనాలు రాయడం ఏంటి?


ప్రతిపక్షంలో కారు, సాధారణ విమానాలే జగన్ వినియోగం

ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ స్కార్పియో కారునే వినియోగించేవారు. లేదా సాధారణ విమానాల్లోనే టికెట్లు కొనుక్కుని ఇతర ప్రయాణికులతోపాటు వెళ్లేవారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేసినప్పుడు కూడా ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వినియోగించలేదు. ఒక్క ఎన్నికల ప్రచార సందర్భంలో తప్ప. ఇప్పుడు ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు ప్రత్యేక విమానం లేనిదే అడుగు బయట పెట్టడంలేదు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి ఇలా ఎక్కడకు వెళ్లినా ఆయన ప్రత్యేక విమానాల్లోనే తిరుగుతున్నారు. ఇంత విలాసంగా ఉండే చంద్రబాబు.. రామోజీ దృష్టిలో మాత్రం అత్యంత నిరాడంబరుడు. ఎమ్మెల్యేగా ఓడి, ఎమ్మెల్సీ అయ్యి, అడ్డదారిలో మంత్రి పదవి సంపాదించిన లోకేశ్ కూడా ఇప్పుడు ప్రత్యేక విమానాల్లోనే తిరుగుతున్నారు.

మార్గదర్శితో ఉక్కిరిబిక్కిరి

తమ మనిషి చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠంపై లేడని, తాము సృష్టించిన పార్టీ టీడీపీ పుట్టగతులు లేకుండా పోతోందని ఈనాడు రామోజీకి కంటిపై కునుకు లేకుండా పోయింది. అందుకే రోజు రోజుకూ ఆయన ఉన్మాదం ఊహించని స్థాయికి చేరుకుంటోంది. మార్గదర్శి వ్యవహారంలో రూ.వేల కోట్లు ప్రజల నుంచి వసూలు చేసి, వాటిని చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆ కేసులో ఉల్లంఘనలు, అక్రమాలు రోజురోజుకూ ఒక్కొక్కటిగా ఆధారాలతో వెలుగులోకి వస్తుండడంతో రామోజీరావుకు దిక్కుతోచడం లేదు. అందుకేముఖ్యమంత్రిపై, ప్రభుత్వంపై ప్రతి రోజూ దుష్ప్రచారం సాగిస్తున్నారు. బజారు మనిషిలా దిగజారిపోయి మీడియా ముసుగులో దారుణాలకు తెగబడుతున్నారు.

అభివృద్ధి చేస్తే ఓడించారు: చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, కర్నూలు/కోవెలకుంట్ల : ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసినప్పటికీ 2004 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తనను ఓడించారని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పసుపు– కుంకుమ, ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినా 2019 ఎన్నికల్లోనూ ప్రజలు టీడీపీని ఓడించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అధికారం అప్పగిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో సంపద సృష్టించి అన్ని వర్గాలకు పంచి పెడతామన్నారు. ఇందులో భాగంగా ఫేజ్–1లో ఆర్థికంగా ఆదుకుంటామని, ఫేజ్–2లో పేదలను ధనికులను చేస్తామని హామీ ఇచ్చారు. 'బాబు షూరిటీ – భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన బనగానపల్లె పట్టణంలో మహిళలతో ముఖాముఖి (ప్రజా వేదిక), నంద్యాలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'టీడీపీ అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తా.. పేదవాడైన సీఎం జగన్ కూతురును చూసేందుకు రూ.40 కోట్లు ఖర్చు చేసి ప్రత్యేక విమానంలో లండన్ వెళ్లాడు' అని అన్నారు.

తండ్రి ఎవరో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితి బాబుది..

మాజీమంత్రి పేర్ని నాని ఆగ్రహం

చిలకలపూడి (మచిలీపట్నం) : తన తండ్రి ఎవరో చెప్పుకోలేని చంద్రబాబు.. రాజకీయంగా సీఎం జగన్‌ను ఎదుర్కోలేక దౌర్భాగ్యపు మాటలు మాట్లాడుతున్నాడని మాజీమంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని విమర్శించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్‌కు శుక్రవారం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న చంద్రబాబునాయుడు సీఎం జగన్‌ను నీచంగా మాట్లాడటంపట్ల ఎవరిది దౌర్భాగ్యపు పుట్టుకో అర్థమవుతోందన్నారు. తల్లి, తండ్రి చనిపోతే తలకొరివి పెట్టలేని, వెంట్రుకలు తీయని చంద్రబాబు.. ఎవరిది నీచపు పుట్టుకో తెలుసుకోవాలన్నారు. అలాగే, తల్లిదండ్రుల పేర్లు చెప్పుకోకుండా ఎన్‌టీఆర్ అల్లుడ్ని అని చెప్పుకుని తిరుగుతున్నారని పేర్ని ఎద్దేవా చేశారు. ప్రతి వ్యవస్థను చంద్రబాబు దిగజారుస్తూ.. భ్రష్టు పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వృద్ధాప్యంలో ఉన్న చంద్రబాబు ఉక్రోషంతో సీఎం జగన్‌పై గెలవలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని.. తపస్సు చేసినా వైఎస్సార్‌సీపీ జెండా నీడను కూడా ఆయన తాకలేడన్నారు. దొంగ హామీలు ఇవ్వటం, ప్రజలను ముంచటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని.. 2024 ఎన్నికలను పురస్కరించుకుని ఆయన ఇస్తున్న హామీలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు లాంటివని ప్రజలకు మాయమాటలు చెప్పేందుకు మళ్లీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికారం ఉంటే ఒక రకంగా, లేకపోతే మరో రకంగా మాట్లాడే చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని నాని చెప్పారు. ముసలి చంద్రబాబు రాజకీయంగా గెలవలేక అక్కసుతోనే మాట్లాడుతున్న దౌర్భాగ్యపు మాటలను కట్టిపెట్టాలని ఆయన చంద్రబాబుకు హితవు పలికారు.

వెలుగు వెనుక.. చీకటి చరిత్ర!

విభజన నాటికి ఏపీ విద్యుత్ సంస్థల అప్పులు దాదాపు రూ.29,700 కోట్లు

- చంద్రబాబు గద్దె దిగేనాటికి అవి ఏకంగా రూ.68,600 కోట్లు
- గత నాలుగేళ్లలో 3.4 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు
- 2022–23లో ఏకంగా రికార్డు స్థాయిలో ఏపీలో 1,27,959 వ్యవసాయ కనెక్షన్లు
- థర్మల్ యూనిట్లు ప్రారంభమయ్యాక వాణిజ్య ఉత్పత్తికి ఏడాది సమయం సాధారణమే
- మనకు తెలంగాణ చెల్లించాల్సిన విద్యుత్తు మొండి బకాయిలు రూ.7 వేల కోట్లు
- ఇవన్నీ దాచిపెట్టి తెలంగాణలో వెలుగులు–ఏపీలో చీకట్లు అంటూ రామోజీ కథనాలు

సాక్షి, అమరావతి: తనకు నచ్చిన అంశాలను మాత్రమే ఇతరులతో పోల్చే ఈనాడు రామోజీకి పొరుగింటి పుల్లకూర బాగా నచ్చినట్లుంది!! విద్యుత్తు సంస్థల మెడకు అప్పుల గుదిబండ వేలాడదీసి రూ.30 వేల కోట్ల అప్పులను ఐదేళ్లలో దాదాపు రూ.70 వేల కోట్లకు చేర్చిన చంద్రబాబు నిర్వాకాలను మాత్రం పొరపాటున కూడా పోల్చే సాహసాన్ని చేయరు! ఆయన ఈనాడూ, ఏనాడూ దీని గురించి ప్రస్తావనే తీసుకురారు. అడ్డగోలు పీపీఏలు, పాతికేళ్ల ఒప్పందాలతో గత సర్కారు ప్రజాధనాన్ని పీల్చి పిప్పి చేసినా అబ్బే అదే బాగుందంటారు!! విద్యుత్ పంపిణీ సంస్థలు, డిస్కంల నికర విలువ 2014లో మైనస్ రూ.4,315 కోట్లు ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి దారుణంగా క్షీణించి మైనస్ రూ.20 వేల కోట్లకు చేరింది. ఇక సబ్సిడీ, రాయితీలు, ప్రభుత్వ విభాగాల విద్యుత్ బిల్లుల కింద గత సర్కారు పంపిణీ సంస్థలకు రూ.20,167 కోట్లు చెల్లిస్తే ఇప్పుడు నాలుగేళ్లలోనే రూ 48,090 కోట్లు చెల్లించారు. టీడీపీ సర్కారు చెల్లింపులతో పోలిస్తే ఇది దాదాపు రెండున్నర రెట్లు ఎక్కువ. మరి ఈ విషయాలన్నీ చెబుతుంటే ఈనాడుకు షాక్ కొడుతుందేమో!! ఇక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ చీకట్లో కూరుకుపోతుందని ప్రచారం చేసిందెవరో సూటిగా చెప్పకుండా ఎందుకీ డొంక తిరుగుడు? విభజన అనంతరం వాడుకున్న విద్యుత్తుకు సంబంధించి దాదాపు రూ.7 వేల కోట్ల బకాయిలను మన రాష్ట్రానికి ఇంతవరకు చెల్లించని తెలంగాణతో ఏపీని పోల్చుతూ ఈనాడు ప్రచురించిన కథనాలు పూర్తిగా అవాస్తవమని విద్యుత్ పంపిణీ సంస్థలు స్పష్టం చేశాయి. విద్యుదుత్పత్తి కేంద్రాలు, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లను (పీపీఏ) ఏ రాష్ట్రానివి ఆ రాష్ట్రానికే వదిలేసి ఉంటే తెలంగాణ రాష్ట్రం కరెంట్ కోతలతో చీకట్లో ఉండేదని డిస్కంలు పేర్కొన్నాయి.



మొండి బాకీ వసూలు కాక..

రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్‌లోనే విద్యుత్ స్థాపక సామర్థ్యం అధికం. అయితే అప్పటికే ఉన్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు రెండు రాష్ట్రాలకు వర్తిస్తాయని, పీపీఏ నిష్పత్తి ప్రకారం విద్యుత్‌ను పంచుకోవాలని విభజన చట్టంలో పేర్కొన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)కు అనంతపురం, కర్నూలు జిల్లాలను కలపడం వల్ల ఎంత లోడ్ వాటా పెరుగుతుందో దానికి సరిపడా నిష్పత్తి పెంచారు. దాని ప్రకారం పీపీఏలలో తెలంగాణకు 53.89 శాతం, ఏపీకి 49.11 శాతం వాటాగా నిర్దేశించారు. విభజన తేదీకి లోడ్ ప్రకారం ఏపీకి రోజుకి 22 మిలియన్ యూనిట్లు అంటే దాదాపు 1,000 మెగావాట్లు బేస్ లోడ్ కొరత ఉంది. విద్యుత్ కేంద్రాల ఉత్పత్తి ఎక్కడిది అక్కడి రాష్ట్రానికే అని చట్టంలో పొందుపరచి ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు మిగులు, తెలంగాణకు కొరత ఉండేది.

అదనపు విద్యుత్ కోసం తీసుకున్న చర్యలు..

కృష్ణపట్నం మూడో యూనిట్ పనులు 2014–19 మధ్య 90 శాతం పూర్తైనట్లు ఈనాడు ప్రచురించిన కథనంలో నిజం లేదు. రెండేళ్ల పాటు కోవిడ్ పరిస్థితుల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత ఆర్థిక సంవత్సరం మార్చిలో మూడో యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గ్రిడ్ అనుసంధానం (సింక్రనైజేషన్)– వాణిజ్య కార్యకలాపాల ప్రారంభం (సీవోడీ) మధ్య ఏడెనిమిది నెలల నుంచి ఏడాది వరకూ సమయం పట్టడం సాధారణం. కృష్ణపట్నం మొదటి దశ ప్రాజెక్టులను 2014లో సింక్రనైజేషన్ చేయగా దాదాపు ఏడాది తర్వాత 2015లో సీవోడీ చేశారు. + సుప్రీం కోర్టు తీర్పు మేరకు హిందుజా విద్యుత్ కేంద్రం నుంచి 1,040 మెగావాట్ల పీపీఏను పునరుద్ధరించారు. సెంబ్‌కార్ప్ నుంచి 625 మెగావాట్లను అతి తక్కువ ధర (యూనిట్ రూ.3.84)కు కొనుగోలు చేసేలా 2021 డిసెంబర్‌లో ఒప్పందం జరిగింది. 2023 డిసెంబర్ నుంచి అది అందుబాటులోకి రావాల్సి ఉన్నా అనూహ్య కొరత కారణంగా ముందస్తుగా ఫిబ్రవరి నుంచే విద్యుత్ సేకరణ ప్రారంభమైంది. వీటీపీఎస్ స్టేజ్ 5లో 800 మెగావాట్ల ఉత్పత్తి యూనిట్‌కు సంబంధించి ట్రయల్ రన్ పనులు జరుగుతున్నాయి. వీటీపీఎస్ ఎనిమిదో యూనిట్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడంతో డిసెంబర్ కల్లా ఈ కేంద్రం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తూ..

దాదాపు 20 కేంద్ర విద్యుత్ కేంద్రాల్లో 625 మెగావాట్ల అధిక ధర థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వానికి వెనక్కి ఇవ్వడం వల్ల ఏటా రూ.625 కోట్లు స్థిర చార్జీల రూపంలో మిగులుతున్నాయి. కేంద్ర విద్యుత్ శాఖ ప్రకటించిన ఆలస్య చెల్లింపుల సర్ చార్జీ స్కీములో చేరడంతో తక్కువ వడ్డీ రుణంతో విద్యుత్ ఉత్పత్తి సంస్థల బకాయిలన్నీ తీర్చారు. దీంతో సర్ చార్జీ నుంచి డిస్కంలకు విముక్తి లభించింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని దీర్ఘకాలం పాటు నిర్విఘ్నంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'సెకీ' నుంచి 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలు చేసేలా ఒప్పందం జరిగింది. 2022–23లో యూనిట్ రూ.5.13గా ఉన్న సగటు విద్యుత్ సేకరణ ఖర్చుతో పోల్చితే ఇది రూ.2.64 తక్కువకే వస్తుంది.

విశాఖ, విజయవాడలో..

విశాఖ నగరంలో అత్యాధునిక భూగర్భ విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఏర్పాటవుతోంది. ఇది ఎలాంటి విపత్తులనైనా తట్టుకుని అంతరాయం లేకుండా సరఫరా చేస్తుంది. విజయవాడలో కూడా విద్యుత్ సరఫరా నియంత్రణకు అన్ని 33/11 కేవీ ఉపకేంద్రాలను అనుసంధానించి 'స్కాడా' సిస్టం అభివృద్ధి చేస్తున్నారు. ఆటోమేషన్ పనులు జరుగుతున్నాయి. అన్ని కొత్త సబ్ స్టేషన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్మిస్తున్నారు.

స్మార్ట్ మీటర్ల ఖర్చు ప్రభుత్వానిదే

రాష్ట్రంలో మొత్తం వినియోగంలో 18 శాతం నుంచి 20 శాతం వరకు వ్యవసాయ రంగంలో నమోదవుతోంది. కచ్చితత్వంతో ఈ విద్యుత్‌ను లెక్కించకపోవడం వల్ల ఇంధన ఆడిట్ కష్టం అవుతోంది. కేంద్ర విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం వ్యవసాయ వినియోగదారులకు మీటర్లు బిగించాల్సి ఉంది. దీనికయ్యే ఖర్చును మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. విద్యుత్ సంస్థలపైన గానీ, రైతులపైనగానీ ఒక్క రూపాయి కూడా భారం పడదు.

వ్యవసాయ కనెక్షన్లలో దేశంలోనే రికార్డు..

రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు అమలు జరగడం లేదు. ఖర్చుకు వెనుకాడకుండా (సీలింగ్ యూనిట్ రూ.10) సేకరించి సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. 2022–23లో రాష్ట్రంలో 25,000 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా రికార్డు స్థాయిలో 1,27,959 కనెక్షన్లు రైతులకు మంజూరైనట్లు స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 3.4 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేసింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్ని కనెక్షన్లు ఇవ్వలేదు.

అప్పుల నుంచి అభివృద్ధి దిశగా..

రాష్ట్ర విభజన నాటికి విద్యుత్ సంస్థల అప్పులు దాదాపు రూ.29,700 కోట్లు కాగా 2019 మార్చి నాటికి గత సర్కారు హయాంలో రూ.68,600 కోట్లకు (131 శాతం పెరుగుదల) చేరుకున్నాయి. 2023 మార్చి నాటికి రూ.97,500 కోట్లకు (42శాతం పెరుగుదల) చేరాయి. గత సర్కారు సబ్సిడీ, రాయితీలు, ప్రభుత్వ విభాగాల విద్యుత్ బిల్లుల కింద డిస్కంలకు రూ.20,167 కోట్లు చెల్లిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.48,090 కోట్లు చెల్లించింది.

ఏపీ విద్యుదుత్పత్తి సామర్థ్యం మెగావాట్లలో..

ఏపీ జెన్‌కో థర్మల్	3410
ఏపీ జెన్‌కో హైడల్	1773.6
జాయింట్ సెక్టార్	2456.824
సీజీఎస్	1978.628
ఐపీపీ (థర్మల్)	1895.55
ఐపీపీ(గ్యాస్)	690.8
ఎన్‌సీఈ/ఆర్‌ఈ	7626.94
మొత్తం	19832.3

2023 మార్చి నాటికి రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం 18,439 మెగావాట్లని ఈనాడు ప్రచురించింది. కానీ అది వాస్తవంగా 19,832 మెగావాట్లు కావడం గమనార్హం.

విభజన అనంతరం ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇలా..

2014-15	60828
2015-16	72360
2016-17	75403
2017-18	63412
2018-19	86430
2019-20	66652
2020-21	74734
2021-22	71276
2022-23	127959
మొత్తం	6,99,054

క్లుప్తంగా...

వైద్య పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో భాగంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు శుక్రవారం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 250 మంది అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా, వీరిలో 190 మంది తమకు కావాల్సిన స్థానాలను ఎంపిక చేసుకున్నారు. మిగిలిన వారు నో ఆప్షన్ ఇచ్చారు. స్థానాలను ఎంపిక చేసుకున్న వారికి ఒకటి, రెండు రోజుల్లో పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని డిప్యూటీ డైరెక్టర్ కర్రి అప్పారావు తెలిపారు.

ఈ నెల 20 వరకు 'ఇంటర్' అఫ్లియేషన్ దరఖాస్తు గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంటర్మీడియెట్ విద్యనందించే జూనియర్ కాలేజీలు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కాలేజీలకు అఫ్లియేషన్, అదనపు సెక్షన్ల అనుమతి కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించాలని ఇంటర్మీడియెట్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. ఈ నెల 20వ తేదీని తుది గడువుగా పేర్కొంది. అలాగే రూ.20 వేల ఆలస్య రుసుముతో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. ప్రాంతీయ ఇన్‌స్పెక్షన్ అధికారులు (ఆర్ఐవో)లు ఆయా కాలేజీల ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు వీలుగా చర్యలు తీసుకోవాలని సూచించింది. అఫ్లియేషన్ పొడిగింపు, అదనపు సెక్షన్ల మంజూరు కోసం బోర్డు నిర్దేశించిన డేటాను ఆన్‌లైన్లో సమర్పించాలని పేర్కొంది. గతంలో ప్రొవిజినల్ అఫ్లియేషన్ కోసం నిర్ణీత రుసుములను చెల్లించని కాలేజీలు కూడా ఇప్పుడు ఆయా సంవత్సరాలకు ఒక్కో ఏడాదికి రూ.40వేల చొప్పున పెనాల్టీతో నిర్ణీత ఫీజును చెల్లించి ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపింది.

250 సీఏఎస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

13 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)లో 250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులు ఈ నెల 13 నుంచి 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు. http://dme.ap.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పోస్టుల సంఖ్య ఇంకా పెరగవచ్చని, తగ్గవచ్చని తెలిపారు. కాగా, 2023–24 విద్యా సంవత్సరానికి మెడికల్ పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా డీఎంఈలో అసిస్టెంట్ సర్జన్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు పీజీ చదివేందుకు, డీఎంఈ ఆస్పత్రుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. అందువల్ల పీహెచ్‌సీల్లో ఖాళీ అయ్యే పోస్టులను ముందే అంచనా వేసి ప్రజలకు ఆరోగ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరులోపు దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలించి మెరిట్ జాబితా సిద్ధం చేసుకుంటే ఖాళీ అయ్యే పోస్టులను వెంటనే భర్తీ చేసేలా కార్యాచరణ ప్రారంభించారు. కాగా, ఇప్పటికే ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 2019 నుంచి ఇప్పటి వరకు 53వేలకు పైగా పోస్టులను ఒక్క వైద్యశాఖలోనే భర్తీ చేశారు.

ఆయా ఆఫీసుల విద్యుత్ బిల్లులు ఇక ఆయా శాఖలకే..

జెడ్పీ సీఈవోలకు పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి : గ్రామాల్లో ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాల నెల వారీ కరెంట్ వినియోగ బిల్లులను ఆయా గ్రామ పంచాయతీల నుంచి కాకుండా సంబంధిత వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖల ద్వారా చెల్లింపులు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలంటూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి అన్ని జిల్లాల జెడ్పీ సీఈవోలకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయా భవనాల నిర్మాణం చేపట్టిన అనంతరం ఇప్పటి వరకు 3,720 రైతు భరోసా కేంద్ర భవనాలను వ్యవసాయ శాఖకు, 1,813 విలేజీ హెల్త్ క్లినిక్‌లను సంబంధిత వైద్య ఆరోగ్యశాఖలకు అప్పగించడం కూడా పూర్తయిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఆయా భవనాలకు కరెంటు బిల్లులు మాత్రం ప్రస్తుతం గ్రామ పంచాయతీల పేరుతో జారీ అవుతున్నాయని.. వెంటనే వాటిని సంబంధిత శాఖ తరపున జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలాల వారీగా ఎంపీడీవోలు స్థానిక విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుంటూ.. రైతు భరోసా కేంద్ర భవనాల కరెంటు మీటరు ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ పేరుకు బదులుగా ఆ సచివాలయాల పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లేదా హార్టికల్చర్ అసిస్టెంట్ హోదా పేరుతో బదలాయించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల కరెంట్ మీటర్లను గ్రామ పంచాయతీల నుంచి ఆ ప్రాంత మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ లేదా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పేరిట బదలాయింపులు చేపట్టాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ కల్లా అన్ని చోట్లా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మా వతి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

నృసింహుని సేవలో..

మంగళగిరి: సుప్రీంకోర్టు జడ్జి ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు శుక్రవారం మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీప్రత్యూష వారి వెంట ఉన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు





శ్రీవారి ఆలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామసుందర్, జస్టిస్ సోమయాజులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామసుందర్, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్నవారిలో తమిళనాడు రెవెన్యూ మంత్రి కేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తదితరులు ఉన్నారు.

మహాశాంతి వరుణ యాగానికి అంకురార్పణ

- శ్రీనివాస మంగాపురంలో నిర్వహణ
- హాజరైన టీటీడీ చైర్మన్ భూమన

చంద్రగిరి (తిరుపతి జిల్లా): శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద మహాశాంతి వరుణ యాగ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆచార్య రుత్విక్ వరణం జరిగింది. అర్చకులకు పసుపు వస్త్రాలను టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ఏవీ ధర్మారెడ్డి బహూకరించారు. సాయంత్రం యాగశాలలో పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర స్వామి వారి దివ్యాశీస్సులతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలందరికీ మంచి జరగాలనే సత్సంకల్పంతో శ్రీనివాస అష్టోత్తర శతకుండాత్మక మహాశాంతి వరుణ యాగం తలపెట్టామని తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు ఇక్కడ యాగం నిర్వహిస్తామని చెప్పారు. మూడు రాష్ట్రాల నుంచి అర్చకులు, దాదాపు 60 మందికి పైగా వైఖానస ప్రముఖులు, 30 మందికి పైగా వేద పండితులు, 215 మందికి పైగా రుత్వికులు ఈ హోమాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. గతంలో ఎన్నడూ ఈ తరహాలో యాగం జరగలేదని తెలిపారు. అలిపిరి నడకదారిన వెళ్లే భక్తులకు కర్రలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభినట్టే, త్వరలో చంద్రగిరి సమీపంలోని శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు చేతికర్రలు ఇస్తామన్నారు. కాగా, శనివారం యాగశాలలో ఉదయం వాస్తుహోమం, అకల్మషహోమం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, గోపూజలను నిర్వహిస్తారు.



వరుణ యాగం వేదికను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో తదితరులు

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ. కోటి విరాళం

తిరుమల: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఎం.వెంకటరావు.. హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్‌తో కలిసి టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు శుక్రవారం కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డీడీని తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.



టీటీడీ ఈవో ధర్మారెడ్డికి డీడీ ఇస్తున్న దాతలు

మూడు ఆలయాలకు ప్రత్యేక ఆహ్వానితులు

సాక్షి, అమరావతి: విజయవాడ దుర్గగుడి, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయం, ద్వారకా తిరుమల ఆలయాల పాలకమండలి కమిటీల్లో ప్రత్యేక ఆహ్వానితులను ప్రభుత్వం నియమించింది. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ పాలక మండలి కమిటీలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పూర్ణచంద్ర ప్రసాద్‌తోపాటు మరో ఆరుగురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. దుర్గగుడి పాలక మండలి కమిటీలో నలుగురు, ద్వారకా తిరుమల ఆలయం పాలకమండలి కమిటీలో ముగ్గురు ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ శుక్రవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు.

అర్చకులను ఆదుకున్న ప్రభుత్వంపై విమర్శలా?

- బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వ్యాఖ్యలపై ఏపీ అర్చక సమాఖ్య మండిపాటు
- అర్చకులకు ద్రోహం చేసింది టీడీపీ ప్రభుత్వమేనని ధ్వజం

సాక్షి, అమరావతి: ఆలయాల్లో పనిచేసే అర్చకుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య విమర్శలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య మండిపడింది. అర్చకులకు ద్రోహం చేసింది టీడీపీ ప్రభుత్వమేనంటూ సమాఖ్య నేతలు దుయ్యబట్టారు. వంశ పారంపర్య అర్చకత్వంపై ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చాక వెనక్కి తగ్గిన చరిత్ర టీడీపీ ప్రభుత్వానిదని శుక్రవారం ఓ ప్రకటనలో ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దింటి రాంబాబు ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంశపారంపర్య అర్చకత్వ జీవోను తీసుకొచ్చిందని చెప్పారు. అర్చకులకు రిటైర్మెంట్ లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని, రూ. ఐదు లక్షల లోపు వార్షికాదాయం ఉండే ఆలయాల నిర్వహణ అర్చకులకే అప్పగించేందుకు కూడా ఆదేశాలిచ్చిందని పేర్కొన్నారు. అన్ని విధాల అర్చకులను ఆదుకున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై అర్చకులకు అన్యాయం చేసిందంటూ టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన ఆనందసూర్య విమర్శలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

12న శ్రీవారి బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ రోజు బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దుచేసింది. అలాగే 11న తేదీన సిఫారసు లేఖలు స్వీకరించబోమని ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో స్వయంగా వచ్చే కాటేజీ దాతలకు మాత్రమే గదులు కేటాయించనున్నారు. దాతల సిఫార్సుపై ఇతరులకు గదుల కేటాయింపు ఉండదు. తిరుమలలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దాతలు tirupatibaaji.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా గదులను రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 22న గరుడసేవ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 20 నుంచి 22వ తేదీ వరకు కాటేజీ దాతలకు ఎలాంటి గదుల కేటాయింపు ఉండదు. ఒకే కాటేజీలో రెండు గదుల కంటే ఎక్కువగా విరాళం ఇచ్చిన దాతలు స్వయంగా వస్తే రెండు గదులను రెండు రోజుల పాటు, ఒకే కాటేజీలో ఒక గదిని విరాళంగా ఇచ్చిన దాతలకు ఒక గదిని రెండు రోజులపాటు కేటాయించనున్నట్లు టీటీడీ తెలిపింది.



తిరుమలలో ఉట్టి కొడుతున్న యువత

ఉత్సాహంగా ఉట్లోత్సవం

శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో శుక్రవారం శ్రీవారి ఆలయం ఎదుట ఉట్లోత్సవం వైభవంగా జరిగింది. శ్రీమలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధులలో ఊరేగుతూ పెద్దజీయర్ మఠం, హథీరాంజీ మఠం, కర్ణాటక సత్రాలు తదితర ప్రాంతాల్లో ఉట్లోత్సవాన్ని తిలకించారు.

వక్ఫ్ బోర్డు సభ్యుడి ఎన్నిక ప్రక్రియ నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

ఫలితాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: వక్ఫ్ బోర్డులో ముత్తవల్లీ కోటా సభ్యుడి ఎన్నిక ప్రక్రియ నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఎన్నికల ఫలితాలు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ముత్తవల్లీ కోటా నుంచి వక్ఫ్ బోర్డుకు సభ్యుడిని ఎన్నుకునేందుకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం రూపొందించిన ముత్తవల్లీ ఓటర్ల జాబితాను నిబంధనల ప్రకారం పత్రికల్లో ప్రకటించలేదని, అభ్యంతరాలు కూడా స్వీకరించలేదని, అందువల్ల ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ హైకోర్టులో వేర్వేరుగా మూడు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కృష్ణమోహన్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, వక్ఫ్ బోర్డు తరపున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి, న్యాయవాది ఆరీపుల్లా వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితాను రూపొందించినట్లు చెప్పారు. జాబితాను కార్యాలయాల్లో ప్రదర్శించి, అభ్యంతరాలను సైతం స్వీకరించామన్నారు. ఇదంతా చట్ట ప్రకారమే జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత దాఖలైన ఈ పిటిషన్లకు విచారణార్హత లేదని వారు అన్నారు. ఎన్నికల ఫలితాలపై అభ్యంతరం ఉంటే పిటిషనర్లు వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. ఎన్నికలను నిలిపివేస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని అభ్యర్థించారు. అంతకుముందు పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. చట్ట ఉల్లంఘనలు ఉన్న నేపథ్యంలో ఎన్నికను నిలిపివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.., ఏజీ శ్రీరామ్ వాదనలతో ఏకీభవించారు. ఎన్నికలను నిలిపివేసేందుకు నిరాకరించారు.

వక్ఫ్ ఆస్తుల అభివృద్ధికి అందరూ చేయూతనివ్వాలి

ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల సంరక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అందరి సహకారం అవసరమని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చెప్పారు. ముతవల్లీల కోటాలో వక్ఫ్ బోర్డు సభ్యుని ఎన్నికల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ముతవల్లీలతో శుక్రవారం విజయవాడలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్న వక్ఫ్ మాజీ సభ్యుడు షేక్ ఖాజాకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ముతవల్లీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, భవిష్యత్తులోను అన్నివిధాలా సహాయ సహకారాలుంటాయని చెప్పారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అబ్దుల్, ఎమ్మెల్సీలు రుహుల్లా, ఇషాక్ బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ ఆజామ్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ చైర్మన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బలిమెల నీటిపై సమీక్ష

ఏపీకి 24, ఒడిశాకు 33 టీఎంసీలు



మాట్లాడుతున్న ఆంధ్రా–ఒడిశా అధికారులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వల వినియోగంపై శుక్రవారం ఇరు రాష్ట్రాల అధికారులు సమీక్షించారు. బలిమెల జలాశయంలో 29 టీఎంసీలు, జోలాపుట్టులో 8 టీఎంసీల నీరు ఉంది. ఈ నెలాఖరుకు నీటి నిల్వలు మొత్తం 57 టీఎంసీల కు చేరుతాయని లెక్కకట్టారు. దీని ప్రకారం ఆంధ్రా వాటాకు 24 టీఎంసీలు, ఒడిశాకు 33 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న నీటిని రోజువారీ విద్యుత్ ఉత్పత్తి అవసరాల నిమిత్తం ఆంధ్రాకు 1,500 క్యూసెక్కులు, ఒడిశాకు 2,400 క్యూసెక్కుల నీరు వాడుకునే విధంగా నిర్ణయించారు. ఏపీ సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకరరావు, ఏడీ అప్పలనాయుడు, ఒడిస్సా తరఫున పాట్టేరు ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ పితాబాస్‌జెట్టి, చిత్రకొండ ఎర్త్‌డ్యామ్ ఇంజినీర్ ఎస్ఈ రమాకాంత్ పాత్రో, బలిమెల ప్రాజెక్టు జనరల్ మేనేజర్ శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రిజిస్ట్రేషన్ విధానంపై పిల్

వచ్చే వారం విచారించనున్న హైకోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని (కార్డ్ ప్రైమ్ 2.0ను) సవాలు చేస్తూ హైకోర్టులో శుక్రవారం ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ విధానం చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉందని, దీని అమలు కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జారీచేసిన సర్క్యులర్‌ను రద్దుచేయాలని కోరుతూ కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారామప్రసాద్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ సెక్రటరీ తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు వచ్చే వారం విచారించే అవకాశం ఉంది.

బీజేపీ జిల్లా అధ్యక్షుల మార్పు

14 జిల్లాలకు కొత్త వారి నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత నిర్మాణంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 26 జిల్లాల అధ్యక్షులకు గానూ, 14 మంది కొత్త వారికి స్థానం కల్పించారు. ఆ జాబితాను శుక్రవారం విడుదల చేశారు. రాయలసీమలో 8 జిల్లాలు ఉండగా, ఒక్కచోట మినహా ఏడు జిల్లాల్లో కొత్త నేతలు పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల మినహా దాదాపు అందరినీ పాత వారినే కొనసాగిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పాత, కొత్త వారిని పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో నియమించారు. ప్రతి జిల్లాకు ఒకరు చొప్పున పార్టీ ఇన్‌చార్జిని నియమించడంతోపాటు ముగ్గురిని అధికార ప్రతినిధులుగా, 14 మంది మీడియా ప్యానలిస్టులుగా నియమించారు. కాగా, ఈ నియామకాల్లో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఓ సామాజిక వర్గం వారికే అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని, 14మంది మీడియా ప్యానలిస్టుల్లో ఆరుగురు అదే సామాజికవర్గం వారినే నియమించడం ఇందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

• తెలంగాణ

తెలంగాణ అంతటా విద్యుత్ కోతలున్నాయి..

• ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): తెలంగాణ రాష్ట్రమంతటా విద్యుత్ కోతలు ఉన్నాయని, ఎక్కడైనా 15–20 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ కోతలపై వివరాలు తెలుసుకునేందుకు తాము భువనగిరి పరిధిలోని ఓ సబ్‌స్టేషన్‌లో లాగ్‌బుక్‌ను తీసుకుంటే, ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో ఉన్న అన్ని సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తీసేసుకుందని విమర్శించారు.

మహారాష్ట్రకు గంజాయి తరలిస్తూ..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): విశాఖ ఏజెన్సీ నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని బాలానగర్ ఎస్‌వోటీ, రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ నరేందర్ రెడ్డి అందించిన వివరాలివి. మహారాష్ట్ర బద్లాపూర్‌కు చెందిన ధీరజ్ మున్నాల అతని స్నేహితుడు ప్రశాంత్ సంజయ్ షిండేతో కలిసి విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించాలని నిర్ణయించాడు. విశాఖ ఏజెన్సీకి వెళ్లి కిలో రూ.3వేల చొప్పున 58.5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రకు బయల్దేరారు. వీరు గంజాయి తరలిస్తున్నట్లు బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు, రామచంద్రాపురం పోలీసులకు సమాచారం అందింది. దీంతో రామచంద్రాపురం వద్ద గంజాయి తరలిస్తున్న ఇన్నోవా వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న ధీరజ్ మున్నాలా జైస్వాల్, ప్రశాంత్ సంజయ్ షిండేలను అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత

రిటైల్ రుణాల మంజూరులో ఆంధ్రప్రదేశ్‌ది కీలకపాత్ర

- మరో 2, 3 త్రైమాసికాలు వడ్డీరేట్లు గరిష్ట స్థాయిలోనే ఉంటాయి
- ఆ తర్వాత తగ్గుముఖం పడతాయి
- వడ్డీరేట్లు పెరిగినా రిటైల్ రుణాలకు డిమాండ్ ఉంది
- పండుగల సందర్భంగా రిటైల్ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు రద్దు చేశాం
- ఈ ఏడాది రిటైల్ రుణాల్లో 12 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నాం
- రుణ మార్కెట్‌పై వర్షాభావ పరిస్థితుల ప్రభావం లేదు
- 'సాక్షి'తో యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్ రంజన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర లీడ్ బ్యాంక్‌గా రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్ రంజన్ చెప్పారు. రిటైల్ రుణాల మంజూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. వడ్డీరేట్లు గరిష్ట స్థాయిలో ఉన్నా రిటైల్ రుణాలకు డిమాండ్ బాగుందని చెప్పారు. విజయవాడలో జరుగుతున్న రెండు రోజుల మెగా రిటైల్ ఎక్స్‌పోను ఆయన శుక్రవారం ప్రారంభించి పలువురికి రుణం మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నితేష్ రంజన్ 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు..

ప్రశ్న: స్టేట్ లెవెల్ బ్యాంకింగ్ కమిటీలో లీడ్ బ్యాంకర్‌గా ఉన్న యూనియన్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో ఏ విధంగా భాగస్వామ్యం అవుతోంది?

జవాబు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్త వ్యాపార విస్తరణలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. లీడ్ బ్యాంకర్‌గా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను నిర్దేశించిన వారికి సక్రమంగా అందించడానికి ప్రాధాన్యత ఇస్తున్నాము. రాష్ట్రంలో రిటైల్ బ్యాంకింగ్ కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ పండుగల సీజన్ కోసం సత్వరం రుణాలను మంజూరు చేసేలా విజయవాడలో మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నాం. 25 మంది బిల్డర్లు, 12 మంది వాహన డీలర్లు, 7 ఎడ్యుకేషన్‌కన్సల్టెన్సీలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చాం. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా టైలర్ మేడ్ రుణ పథకాలను ఆఫర్ చేసి, అక్కడికక్కడే తక్షణం రుణాలు మంజూరు చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేశాం.



విజయవాడలో రుణాలను మంజూరు చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఈడీ నితేష్ రంజన్

ప్రశ్న: ప్రస్తుతం వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉన్నాయి. రుణ మార్కెట్‌పై వడ్డీ రేట్ల పెరుగుదల ప్రతికూల ప్రభావం చూపుతుందా?

జవాబు: వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉన్న మాట వాస్తవమే. కానీ దీనికి భిన్నంగా దేశవ్యాప్తంగా రిటైల్ రుణాలకు భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. ఆటో, ఎడ్యుకేషన్, హోమ్ లోన్స్ వంటి రుణాలకు డిమాండ్ బాగుంది. గతేడాది యూనియన్ బ్యాంక్ రిటైల్ రుణాలు 17.19 శాతం పెరిగి రూ.1,60,595 కోట్లకు చేరాయి. ఈ ఏడాది కూడా రిటైల్ రుణాల్లో 10 నుంచి 12 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నాం.

ప్రశ్న: వడ్డీ రేట్లు ఎప్పటి నుంచి తగ్గుతాయి?

జవాబు: ప్రస్తుతం ద్రవ్యోల్బణం అధిక స్థాయిలో ఉండటంతో వడ్డీ రేట్లు గరిష్టస్థాయిలో ఉన్నాయి. మరో రెండు మూడు త్రైమాసికాల వరకు వడ్డీ రేట్లు గరిష్టస్థాయిలో కొనసాగుతాయని అంచనా వేస్తున్నాం. ఆ తర్వాత నుంచి క్రమేపీ తగ్గే అవకాశం ఉంది.

ప్రశ్న: ఇతర బ్యాంకుల పోటీని తట్టుకోవడానికి యూనియన్ బ్యాంక్ ఏమైనా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించిందా?

జవాబు: ప్రస్తుతం అన్ని బ్యాంకులకంటే తక్కువ రేటుకే రుణాలు అందిస్తున్నాం. అంతేకాకుండా పండుగుల సీజన్ దృష్టిలో పెట్టుకొనిఅన్ని రిటైల్ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేశాం. విదేశాల్లో విద్య కోసం రుణాలు తీసుకునే వారికి రూ.40 లక్షల వరకు ఎటువంటి తనఖా అవసరం లేకుండా రుణాలిస్తున్నాం. ఆన్‌లైన్, యాప్‌ల ద్వారా క్షణాల్లో రుణాలు మంజూరు చేస్తున్నాం.

ప్రశ్న: దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రుణాల మార్కెట్‌పై ఎటువంటి ప్రభావం చూపుతాయి?

జవాబు: ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా అటువంటి వాతావరణం కనిపించడం లేదు. రుణాల మార్కెట్‌పై ఎటువంటి ప్రభావం లేదు. ఇప్పటికే పండుగుల సీజన్ మొదలైంది. ఇది నాలుగో త్రైమాసికం వరకు కొనసాగుతుంది. అప్పటివరకు ఇదే విధమైన డిమాండ్ కొనసాగుతుందని అంచనా వేస్తున్నాం.

సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

కేంద్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ సురేష్ చంద్ర

సాక్షి, విశాఖపట్నం: ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాల సమాచార కమిషనర్లకు కేంద్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ సురేష్ చంద్ర ఆదేశించారు. ఈ నెల 9, 10 తేదీల్లో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్స్ ఇన్ ఇండియా (ఎన్ఎఫ్ఐసీఐ) 28వ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, 12వ సర్వసభ్య సమావేశం విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ చేరుకున్న కేంద్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ సురేష్ చంద్ర శుక్రవారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో ఏక్తా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమాచార హక్కు చట్టం–2005 అమలు తీరుపై వివిధ రాష్ట్రాల సమాచార కమిషనర్లు చర్చించారు. సురేష్ చంద్ర మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడలో పారదర్శకత, జవాబుదారీతనం కీలకమని, ఇందుకు సమాచార హక్కు చట్టం ముఖ్య భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్. మహబూబ్ బాషా, సమాచార కమిషనర్లు పాల్గొన్నారు.

లోటు వర్షపాతం భర్తీ

- వారం రోజులుగా కురిసిన వర్షాలతో సాధారణ స్థితి
- ఆగస్టు నెలలో 55 శాతం లోటు వర్షపాతం
- సెప్టెంబర్ మొదటి వారంలో 89 శాతం అదనపు వర్షం
- పరిస్థితుల మార్పుతో ఇకపై వర్షాలు పడతాయన్న ఐఎండీ



సాక్షి, అమరావతి: ఈ నైరుతి సీజన్‌లో వర్షాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఆగస్టులో వర్షాభావం నెలకొనడంతో సీజన్ మొత్తం ప్రభావితమవుతుందనే ఆందోళన నెలకొంది. కానీ గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో లోటు వర్షపాతం దాదాపు భర్తీ అయినట్లేనని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదవగా, ఆగస్టులో 55 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సాధారణంగా జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 96 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సివుండగా 66 మిల్లీమీటర్లు నమోదైంది. 31 శాతం లోటు ఏర్పడింది. జూలై నెలలో 159 మిల్లీమీటర్లకు 175 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ నెలలో 10 శాతం అధిక వర్షాలు కురిశాయి. ఇక ఆగస్టు నెలలో మాత్రం 165 మిల్లీమీటర్లకు 74 మిల్లీమీటర్లే వర్షం కురిసింది. 55 శాతం లోటు ఏర్పడటంతో ఈ సీజన్‌లో వర్షాభావంతో ఇబ్బందులు వస్తాయనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

ఈ నెలలో వర్షాలు

ఈ నెలంతా వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులు మారి లానినా పరిస్థితులతో దేశంలో నైరుతి రుతుపవనాల ద్రోణి చురుగ్గా ఉన్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. దీంతో ఈ నెలలో సమృద్ధిగా వర్షాలు పడతాయని చెబుతున్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అల్పపీడనంతో వారంపాటు భారీ వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో సెప్టెంబర్ ఒకటి నుంచి రాష్ట్రమంతా భారీ వర్షాలు కురిశాయి. ఒకటి నుంచి 7వ తేదీ వరకు 33 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సివుండగా 63 మిల్లీమీటర్ల వర్షం పడింది. 89 శాతం అదనపు వర్షం కురిసింది. దీంతో ఆగస్టులో ఏర్పడిన లోటు భర్తీ అయింది. మొత్తం జూన్ నుంచి ఇప్పటి వరకు 453 మిల్లీమీటర్ల సగటు వర్షం పడాల్సివుండగా ఇప్పటివరకు 378 మిల్లీమీటర్లు పడింది. కేవలం 16 శాతం మాత్రమే తగ్గింది. 20 శాతం లోపు లోటు అయితే దాన్ని సాధారణంగానే పరిగణిస్తారు. మొత్తం ఈ సీజన్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పు గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అధిక వర్షం కురిసింది. కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పల్నాడు, నెల్లూరు, సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో మాత్రం లోటు నెలకొంది.

దివ్యాంగుల కోసం యూజీసీ ప్రత్యేక చర్యలు

- బోధన, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంల్లో సడలింపులు
- ఉన్నత విద్యా సంస్థలకు ప్రత్యేక మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠ్యప్రణాళిక, విద్యా క్యాలెండర్‌ను అమలు చేయాలని అన్ని ఉన్నత విద్యాసంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇటీవల మార్గదర్శకాలను వెలువరించింది. పాఠ్యాంశాలతోపాటు బోధన, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాల్లో ప్రత్యేక సడలింపులు ఉండాలని స్పష్టం చేసింది. బోధనాంశాలకు సంబంధించి క్రెడిట్ ఆధారిత కోర్సుల్లో థియరీ, ప్రాక్టికల్స్‌ల్లో పాఠ్యప్రణాళిక సౌకర్యంగా ఉండేలా చూడాలని సూచించింది. దివ్యాంగ విద్యార్థులపై కోర్సుల భారం తక్కువ ఉండేలా సబ్జెక్ట్ మినహాయింపులు, ప్రత్యామ్నాయాలు ఉండేలా పాఠ్యాంశాలను రూపొందించాలని కోరింది. అలాగే విద్యా సంస్థలు వారికి తప్పనిసరిగా అదనపు ఆర్థిక సహాయం, కెరీర్ కౌన్సెలింగ్, ఈ–లెర్నింగ్, అనువైన టైమ్‌టేబుల్ ప్రవేశపెట్టాలని ఆదేశించింది.

2.2 శాతం మంది దివ్యాంగులు..

నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్–2011 నివేదిక ప్రకారం.. దేశ జనాభాలో 2.2 శాతం మంది దివ్యాంగులున్నారు. ఈ శాతం ఇప్పుడు మరింత పెరిగి ఉంటుందని అంచనా. దివ్యాంగుల్లో కేవలం 1.46 కోట్ల మంది మాత్రమే అక్షరాస్యులు కాగా వీరిలో 0.56 శాతం మంది మాత్రమే ఉన్నత విద్యలో చేరారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల్లో ఉన్నత విద్యలో చేరికలను పెంచాలని యూజీసీ లక్ష్యంగా నిర్ణయించుకుంది.

క్రెడిట్ ఆధారిత కోర్సులలో మినహాయింపులు..

దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించే కోర్సుల్లో క్రెడిట్లకు సంబంధించి కొన్ని మినహాయింపులను కూడా యూజీసీ సూచించింది. దివ్యాంగులు మరింత సులభంగా చదువులు సాగించేందుకు వీలుగా చర్యలు తీసుకోనున్నారు. విద్యార్థి అవసరాన్ని బట్టి వివిధ ఫార్మాట్లలో సిలబస్‌ను అందుబాటులోకి తెస్తారు. పని–ఆధారిత అభ్యసనం, అప్రెంటిస్‌షిప్ చేయడానికి వీలు కల్పిస్తారు. కెరీర్ కౌన్సెలింగ్‌తో ప్లేస్‌మెంట్లను సైతం అందిస్తారు. వివిధ ఏజెన్సీల నుంచి అదనపు ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ–లెర్నింగ్, దూరవిద్య, ఆన్‌లైన్ విద్య ద్వారా దివ్యాంగులకు ఇంటి నుంచే నేర్చుకునే అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తారు. అలాగే వివిధ శిక్షణ కార్యక్రమాలను కూడా వారి ఇళ్ల సమీపంలోనే ఉండేలా చూస్తారు. సబ్జెక్టుల ఎంపికలో థియరీ, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టు వర్క్‌ల భారం లేకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేసేలా కోర్ కరిక్యులమ్‌లో మార్పులు చేస్తారు.

నేల విడిచి సాగు



నీటితో.. గాలితో సేద్యం

విస్తరిస్తున్న హైడ్రోపోనిక్స్, ఏరోపోనిక్స్, ఆక్వాపోనిక్స్ వ్యవసాయం

- సాధారణ సేద్యంతో పోల్చితే 10 శాతం నీటితోనే పంటలు
- ఎకరం భూమిలోనే నాలుగు ఎకరాల పంటల సాగు
- తెగుళ్లు తక్కువ.. అతి తక్కువ కాలంలోనే చేతికి అధిక దిగుబడి

సేద్యం సరికొత్త పుంతలు తొక్కుతోంది. పగలనక, రేయనక.. ఎండనక, వాననక.. అరక పట్టి.. మెరక దున్ని.. పంట చేతికి వచ్చే వరకు మట్టిలో కష్టపడే రోజులకు స్వస్తి పలికే విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక మట్టి లేకుండా.. నీటితో, గాలితో.. నిలువుగా.. అతి తక్కువ ప్రదేశంలోనే ఎక్కువ పంటలు పండించవచ్చు. హైడ్రోపోనిక్స్, ఏరోపోనిక్స్, ఆక్వాపోనిక్స్.. వర్టికల్ ఫార్మింగ్ తదితర సాగు విధానాలు మొదలయ్యాయి. వీటి ద్వారా అవసరమైన పంటలు ఒకేచోట సాగు చేసుకోవచ్చు. సాధారణ వ్యవసాయానికి ఎక్కువ నీళ్లు అవసరమైతే.. ఈ సేద్యానికి అతి తక్కువ నీళ్లు సరిపోతాయి. తెగుళ్ల సమస్య తక్కువ. వివిధ దేశాల్లో ఈ సేద్యం మొదలుపెట్టి.. బోలెడు లాభాలు ఆర్జిస్తున్న వారు కూడా ఉన్నారు. భారత్‌లోనూ ఇవి క్రమంగా విస్తరిస్తున్నాయి.



– గుంద్ర వెంకటేశ్
ఏపీ సెంట్రల్ డెస్క్



ఇతని పేరు సందీప్ కన్నన్. వ్యవసాయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. తిరుపతికి సమీపంలోని తనపల్లి వద్ద 2 ఎకరాల భూమి లీజుకు తీసుకొని.. రూ.70 లక్షల వ్యయంతో 'వ్యవసాయి భూమి' పేరుతో మూడేళ్ల క్రితం హైడ్రోపోనిక్స్ ఫార్మింగ్ ప్రారంభించాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పాలీహౌస్ కోసం రూ.8 లక్షల సబ్సిడీ వచ్చింది. దాదాపు 17 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల రకాలను సాగు చేస్తున్నాడు. 8125813507 నంబర్‌తో పాటు వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో గ్రూప్‌లు ఏర్పాటు చేసి.. తిరుపతి, విజయవాడలోని 400కు పైగా కుటుంబాలకు రోజూ తాజా ఆకుకూరలు, కూరగాయలను సరఫరా చేస్తున్నాడు. 'ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే ఇంకా ఎక్కువ మందికి నాణ్యమైన కూరగాయలను అందిస్తా' అని సందీప్ చెప్పాడు.

అతి తక్కువ నీటితో అధిక దిగుబడి..

మట్టి అనేదే లేకుండా సూక్ష్మ పోషకాలతో కూడిన నీటితో సాగు చేసే విధానమే హైడ్రోపోనిక్స్ వ్యవసాయం. 4 ఎకరాల్లో పండించే పంటలను.. ఎకరంలోపు స్థలంలోనే సాగు చేయవచ్చు. ఇళ్ల వద్ద అతికొద్ది స్థలంలో కూడా పండించవచ్చు. సాధారణ సేద్యంతో పోల్చితే దీనికి 20 శాతం కంటే తక్కువ నీళ్లు చాలు. ఏడాది పొడవునా ఒకేసారి విభిన్న పంటలు సాగు చేయవచ్చు. హైడ్రోపోనిక్స్ వ్యవసాయాన్ని ఎక్కువగా ఎన్ఎఫ్‌టీ(న్యూట్రియంట్ ఫిల్మ్ టెక్నిక్) విధానంలో చేస్తుంటారు. ఈ పద్ధతిలో ముందుగా పాలీహౌస్ లేదా షేడ్‌నెట్ నిర్మించుకోవాలి. తర్వాత ఎన్ఎఫ్‌టీ పైపులు ఏర్పాటు చేసుకోవాలి. ఆ పైపులలోని రంధ్రాల్లో చిన్న నెట్ కప్‌లు ఉంచాలి. ఆ కప్‌లలో కొబ్బరి పీచు పొడి వేసి మధ్యలో మొక్కలు పెట్టాలి. చిన్నచిన్న ట్యాంక్‌ల నుంచి ఎన్ఎఫ్‌టీ పైప్‌లలోని మొక్కలకు సూక్ష్మ పోషకాలతో కూడిన నీళ్ల అందిస్తుండాలి. పాలీహౌస్‌లలో ఉష్ణోగ్రత 18 నుంచి 26 డిగ్రీల సెంటీగ్రేడ్‌లుగా ఉండాలి. నిపుణుల సిఫార్సు మేరకు సూక్ష్మ పోషకాలను ఆర్వో వాటర్‌లో కలిపి మొక్కలకు అందించాల్సి ఉంటుంది. ఈ విధానంలో దేశీయ, విదేశీ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూలు పండించవచ్చు.

గాలిలో పెరిగే బంగాళాదుంపలు..

సాధారణంగా దుంపలు మట్టిలో పెరుగుతాయి. కానీ ఇప్పుడు కేవలం గాలిని ఉపయోగించే బంగాళాదుంపలను పండిస్తున్నారు. మట్టి లేకుండా.. సూక్ష్మపోషకాలతో కూడిన గాలితో సాగు చేసే విధానమే ఏరోఫోనిక్స్ వ్యవసాయం. సాధారణ వ్యవసాయంతో పోల్చితే దీనికి 10 శాతం కంటే తక్కువ నీళ్లు చాలు. ఈ విధానంలో ముందుగా పాలీహౌస్ లేదా, షేడ్‌నెట్‌లు నిర్మించుకోవాలి. అందులో ఇనుప స్టాండ్‌ల మీద రంధ్రాలతో కూడిన థర్మాకోల్ షీట్‌లు ఏర్పాటు చేసుకోవాలి. వాటిలో మొక్కలతో కూడిన చిన్న నెట్ కప్‌లు పెట్టుకోవాలి. వాటి వేర్లకు పైపుల ద్వారా సూక్ష్మ పోషకాలతో కూడిన నీటిని గాలి లేదా పొగ మంచురూపంలో 'స్ప్రే'ల ద్వారా అందించాలి. మొక్కల వేర్లు ఎప్పుడూ బయటకు వేలాడుతూనే ఉంటాయి.



ఉపయోగాలు..



- నీటి వృథా ఉండదు. పెద్ద మొత్తంలో నీటిని ఆదా చేయొచ్చు.
- ఒక కిలో టమాటాలు పండించాలంటే సాధారణ పద్ధతుల్లో సుమారు 214 లీటర్ల నీళ్లు అవసరం. అదే హైడ్రోపోనిక్స్ విధానంలో 70 లీటర్లు,ఏరోపోనిక్స్‌లో విధానంలో కేవలం 20 లీటర్లు చాలు.
- నీటి వినియోగం 80 నుంచి 90 శాతం వరకు, ఎరువుల వినియోగం 60 శాతానికి పైగా, పురుగుమందుల వాడకం 100 శాతం తగ్గుతుందని నాసా పేర్కొంది.
- బయటి వాతావరణంతో సంబంధం లేకుండా ఏడాది పొడవునా పంటలు పండించవచ్చు.
- మట్టిలో లభించే సూక్ష్మపోషకాలు.. ఈ విధానాల్లో నీటి ద్వారా అందుతాయి కనుక ఆ విషయంలో అనుమానం అవసరం లేదు.
- ఇంటి వద్దే ఈ విధానాల్లో సేద్యం చేస్తూ నెలకు రూ.20 వేలకు పైగా ఆదాయం గడించవచ్చు.

జాగ్రత్తలు..

- ఈ విధానాలను అనుసరించాలనుకునేవారు ముందు తక్కువ స్థలంలో మొదలుపెట్టడం ఉత్తమం. తగిన అనుభవం వచ్చిన తర్వాత విస్తరించాలి. ఎలాంటి అనుభవం లేకుండా ముందే ఎక్కువ పెట్టుబడి పెట్టి నష్టపోవద్దు.
- అర ఎకరంలో సాగు చేయాలంటే మొదటిసారి రూ.20 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పాలీహౌస్‌కు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది.
- తీగ జాతి మొక్కల పెంపకం వైపు వెళ్లకపోవడం మంచిది.
- విద్యుత్ కోసం సోలార్ పెట్టుకుంటే కొంత మొత్తం ఆదా చేసుకోవచ్చు.


నిట్టనిలువుగా.. బోలెడు మొక్కలు



ఏరోపోనిక్స్ విధానాన్ని వర్టికల్ (నిలువు)గా టవర్ పద్ధతిలోనూ చేయవచ్చు. రకాలు, టవర్ ఎత్తును బట్టి 45కు పైగా మొక్కలు పెంచవచ్చు. ఏరోపోనిక్స్ టవర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. నిలువుగా ఉండే పైపుల రంధ్రాలలో మొక్కలతో కూడిన నెట్ కప్‌లు పెట్టాలి. పైప్‌కు కింద చిన్న మోటర్‌తో కూడిన టబ్ ఉంటుంది. అందులో సూక్ష్మపోషకాలతో కూడిన నీళ్ల పోయాలి. ఆ టబ్ నుంచి నీళ్ల స్ప్రేల ద్వారా మొక్కల వేర్లకు గాలి, పొగ మంచు రూపంలో అందుతాయి. ఉష్ణోగ్రత 18 డిగ్రీల నుంచి 24 డిగ్రీలు ఉండాలి. నిపుణుల సూచన మేరకు సూక్ష్మపోషకాలు అందించాలి. ఏరోపోనిక్స్ విధానంలో దుంప రకాలు, దేశీయ, విదేశీ ఆకుకూరలు, ఉల్లిపాయలు, టమాటా తదితరాలు సాగు చేయవచ్చు.



నీటి సాయంతో ఒకేసారి చేపలు, కూరగాయలను ఉత్పత్తి చేసే విధానమే ఆక్వాపోనిక్స్ వ్యవసాయం. ఇళ్ల వద్ద లేదా కాస్త ఎక్కువ స్థలంలో పాలీహౌస్ ఏర్పాటు చేసుకొని సాగు చేయవచ్చు. ఆక్వాపోనిక్స్ విధానంలో ముందుగా చేపల ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి. దాని పక్కన బయోఫిల్టర్.. అనుబంధంగా ఎన్ఎఫ్‌టీ పైపులు ఏర్పాటు చేసుకోవాలి. చేపల ట్యాంక్ నుంచి వచ్చే అమ్మోనియా నీటిని బయోఫిల్టర్.. నైట్రేట్స్‌గా మార్చి ఎన్ఎఫ్‌టీ పైపులలోని మొక్కల వేర్లకు అందిస్తుంది. మొక్కలు ఆ నైట్రేట్స్‌తో పాటు ఇతర సూక్ష్మ పోషకాలను గ్రహించి వృద్ధి చెందుతాయి. మొక్కల ద్వారా ఫిల్టర్ అయిన నీళ్లు మళ్లీ చేపల ట్యాంక్‌లోకి చేరుతాయి. ఉష్ణోగ్రత 20 నుంచి 30 డిగ్రీలు ఉండాలి. దేశీయ, విదేశీ ఆకుకూరలు, కూరగాయలు, చేపలను ఉత్పత్తి చేసుకోవచ్చు. తిలాపియా వంటి చేపలు పెంచవచ్చు.



సాక్షి బిజినెస్

శనివారం
9-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
333	93
66,599	19,820

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	13,776	▲ 37
డోజోన్స్	34,596	▲ 39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,478	▲ 36
డాక్స్	15,740	▲ 22
షాంఘై	3,117	▽ 6
నికాయ్	32,607	▽ 384

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	59,171	▽ 18
బంగారం (22 క్యారెట్)	58,934	▽ 18
వెండి (కేజీ)	71,017	▽ 153

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.39	84.06
£	బ్రిటన్ పౌండ్	102.32	105.69
€	యూరో	87.65	90.76
¥	జపాన్ ఎన్ (100)	55.67	57.41
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.06	54.36
S$	సింగపూర్ డాలర్	60.07	61.98
SAR	సౌదీ రియాల్	21.16	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	21.69	23.48
¥	చైనా యువాన్	10.18	12.25

హాల్‌మార్కింగ్ మూడో దశ షురూ..

- కొత్తగా 55 జిల్లాల చేరిక
- ఇప్పటికే 288 జిల్లాల్లో అమలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బంగారు ఆభరణాలు, కళాఖండాలకు తప్పనిసరి హాల్‌మార్కింగ్ మూడవ దశ అమలులోకి వచ్చింది. సెప్టెంబర్ 8న నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 16 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 55 జిల్లాల్లో తప్పనిసరి హాల్‌మార్కింగ్ కొత్తగా అమలు చేస్తారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదు, తెలంగాణ నుంచి నాలుగు జిల్లాలు ఉన్నాయి. పుత్తడి స్వచ్ఛతను హాల్‌మార్కింగ్ ద్వారా ధ్రువీకరిస్తారు. హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ 2021 జూన్ 16 వరకు స్వచ్ఛందంగా ఉంది. ప్రభుత్వం దశలవారీగా తప్పనిసరి గోల్డ్ హాల్‌మార్కింగ్‌ని అమలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. 2021 జూన్ 23 నుంచి మొదలైన తొలి దశలో 256 జిల్లాలు, 2022 ఏప్రిల్ 4 నుంచి ప్రారంభమైన రెండవ దశలో 32 జిల్లాలను చేర్చారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) రెండు దశల్లో తప్పనిసరిగా హాల్‌మార్కింగ్‌ని విజయవంతంగా అమలు చేసింది. తాజా నోటిఫికేషన్‌తో తప్పనిసరి జాబితాలో చేరిన జిల్లాల సంఖ్య 343కు చేరింది.

26 కోట్లకుపైగా ఆభరణాలు...

ప్రతిరోజూ 4 లక్షలపైచిలుకు బంగారు ఆభరణాలు హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్‌తో (హెచ్‌యూఐడీ) తయారవుతున్నాయి. ఇప్పటి వరకు 26 కోట్లకుపైగా ఆభరణాలు హెచ్‌యూఐడీ అందుకున్నాయి. తప్పనిసరి హాల్‌మార్కింగ్‌ను అమలు చేసినప్పటి నుండి నేటి వరకు నమోదిత నగల వ్యాపారుల సంఖ్య 34,647 నుండి 1,81,590కి పెరిగింది. అస్సేయింగ్, హాల్‌మార్కింగ్ కేంద్రాలు 945 నుండి 1,471కి చేరాయి. వినియోగదార్లు బీఐఎస్ కేర్ యాప్ ద్వారా హెచ్‌యూఐడీ నంబర్‌తో ఆభరణం ప్రామాణికత, స్వచ్ఛతను ధ్రువీకరించుకోవచ్చు. బీఐఎస్ కేర్ యాప్ డౌన్‌లోడ్స్ సంఖ్య 2021–22లో 2.3 లక్షలు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది 12.4 లక్షలకు దూసుకెళ్లింది. రెండేళ్ల వ్యవధిలో బీఐఎస్ కేర్ యాప్‌లో 'వెరిఫై హెచ్‌యూఐడీ' హిట్స్ కోటికి పైగా నమోదయ్యాయని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.



సోమవారం నుంచి తాజా గోల్డ్ బాండ్ స్కీమ్

ఇష్యూ ధర గ్రాముకు రూ. 5,923

న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్ కొత్త ఇష్యూ ఈ నెల 11న (సోమవారం) ప్రారంభం కానుంది. 15వ తేదీ వరకూ అందుబాటులో ఉండే ఈ స్కీమ్ ఇష్యూ ధర గ్రాముకు రూ.5,923. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తే, రూ.50 డిస్కౌంట్ లభిస్తుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇది రెండవ విడత బాండ్ల జారీ. జూన్ 19న వెలువడిన మొదటి విడత బాండ్ జారీలో ధర గ్రాముకు రూ.5,926. గోల్డ్ బాండ్లు- షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నిర్దిష్ట పోస్టాఫీసులు, డీ–మ్యాట్ అకౌంట్‌తో గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కొనుగోలు చేయవచ్చు.



వృద్ధికి ఆర్‌బీఐ పెద్దపీట

- అక్టోబర్ 7 నాటికి ఐ–సీఆర్ఆర్ విధానం నుంచి పూర్తిగా బయటకు...
- బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా దాదాపు లక్ష కోట్లు!

ముంబై: వృద్ధే లక్ష్యంగా బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యతకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ–సీఆర్ఆర్) విధానం నుంచి అక్టోబర్ 7 నాటికి దశల వారీగా పూర్తిగా వైదొలగాలని నిర్ణయించింది. దీనితో బ్యాంకింగ్ వ్యవస్థలో దాదాపు రూ. లక్ష కోట్ల అదనపు నిధుల లభ్యత, ప్రస్తుత స్థాయిలోనే వడ్డీరేట్ల కొనసాగింపు వంటి సౌలభ్యతలు ఒనగూరే అవకాశం ఏర్పడుతుంది. రూ.2000 నోట్ల ఉపసంహరణ నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యతను వెనక్కు తీసుకోడానికి, తద్వారా ద్రవ్యోల్బణం కట్టడిలో ఉంచడానికి ఐ–సీఆర్ఆర్ నిర్వహించాలని బ్యాంకింగ్‌కు ఆగస్టు 10వ తేదీన ఆర్‌బీఐ తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష సందర్భంగా ఆదేశించింది. ఈ సందర్భంగా ఆర్‌బీఐ కీలక ప్రకటన చేస్తూ... బ్యాంక్ మొత్తం డిపాజిట్‌లో లిక్విడ్ క్యాష్ రూపంలో ఆ బ్యాంక్ నిర్వహించాల్సిన నగదుకు సంబంధించిన నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని యథాతథంగా 4.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు తెలిపింది. అయితే రూ.2,000 నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి రావడం, ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వానికి అందిన డివిడెండ్ వంటి చర్యల వల్ల వ్యవస్థలో ఏర్పడిన అధిక ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) తగిన స్థాయి వరకూ వెనక్కు తీసుకోడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా మూడు నెలలకుపైగా కాలానికి (రూ.2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన తేదీ 2023 మే 19వ తేదీ నుంచి 2023 జూలై 28 వరకూ) ఎన్‌డీటీఎల్ (నెట్ డిమాండ్, టైమ్ లయబిలిటీ) ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ–సీఆర్ఆర్)10 శాతంగా అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల వ్యవస్థ నుంచి దాదాపు రూ.లక్ష కోట్లు వెనక్కు మళ్లుతున్నట్లు కూడా సూచన ప్రాయంగా తెలిపింది. తాజాగా ఈ నిధులను మళ్లీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి వదులుతున్నట్లు ఆర్‌బీఐ వర్గాలు పేర్కొన్నాయి.

మూడు దశల్లో...

అమలైన ఐ–సీఆర్ఆర్‌లో 25 శాతం సెప్టెంబర్ 9న విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. సెప్టెంబర్ 23న మరో 25 శాతం, పెండింగ్‌లో ఉన్న 50 శాతం అక్టోబర్ 7న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 'ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఐ–సీఆర్ఆర్'ను దశలవారీగా నిలిపివేయాలని ఒక సమీక్షా సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. చలామణి నుండి కరెన్సీని ఉపసంహరించుకున్న తేదీ మే 19న చెలామణిలో ఉన్న మొత్తం రూ. 2,000 కరెన్సీ నోట్లలో 93 శాతం బ్యాంకింగ్‌కు తిరిగి వచ్చినట్లు ఆర్‌బీఐ తెలిపింది.



రిలయన్స్ నుంచి ఏఐ సూపర్ కంప్యూటర్స్

ఎన్‌వీడియాతో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, యూఎస్ టెక్నాలజీ దిగ్గజం ఎన్‌వీడియా చేతులు కలిపాయి. ఇరు సంస్థలు కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) ఆధారిత సూపర్ కంప్యూటర్లను అభివృద్ధి చేస్తాయి. ఇటీవలే ఎన్‌వీడియా ఫౌండర్, సీఈవో జెన్సెన్ హ్యూ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. భారత్‌లో 2004లో అడుగుపెట్టిన ఎన్‌వీడియాకు హైదరాబాద్, గురుగ్రామ్, పుణే, బెంగళూరులో డెవలప్‌మెంట్ సెంటర్స్ ఉన్నాయి. మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,800 పైచిలుకు ఉంది. 'విస్తృత, వేగవంతమైన వృద్ధి కోసం డేటా వినియోగం నుండి సాంకేతిక మౌలిక సదుపాయాలను సృష్టించే దిశగా భారత్ ముందుకు సాగుతున్నప్పుడు.. డిజిటల్ వృద్ధిలో ఎన్‌వీడియాతో కలిసి అభివృద్ధి చేసే కంప్యూటింగ్, టెక్నాలజీ సూపర్ సెంటర్లు మన దేశానికి జియో మాదిరిగా ఉత్ప్రేరక వృద్ధిని అందిస్తాయి' అని ఈ సందర్భంగా రిలయన్స్ సీఎండీ ముకేశ్ అంబానీ అన్నారు.

19,800 స్థాయి పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ లాభం 333 పాయింట్లు
- ఆరో రోజూ 'బుల్' పరుగులు

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు రెండు శాతం మేర రాణించడంతో స్టాక్ సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాలను ఇన్వెస్టర్లు విస్మరించారు. దేశీయం నెలకొన్న సానుకూలతతో సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 333 పాయింట్లు ఎగసి 66,599 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 501 పాయింట్లు ఎగసి 66,767 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 93 పాయింట్లు బలపడి 19,820 వద్ద స్థిరపడింది. బ్యాంకులు, ఫైనాన్స్, ఇంధన, ఆటో షేర్లు లాభపడ్డాయి. కమోడిటీస్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆర్‌బీఐ లిక్విడిటీ నిర్ణయం బ్యాంకింగ్‌కు లాభించింది. గత ట్రేడింగ్ సెషన్‌లో జీవితకాల కనిష్టానికి పతనమైన రూపాయి స్వల్పంగా రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో 21 పైసలు బలపడి 83.02 వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ ఈ వారం మొత్తం 878 పాయింట్ల ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.8.5 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.



ఆర్ఆర్ కేబుల్ ఐపీవో ధర రూ.983-1,035

టీపీజీ పెట్టుబడులు కలిగిన ఆర్ఆర్ కేబుల్ ఐపీవో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానుండగా.. ఒక్కో షేరుకు రూ.983–1,035 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. ఇష్యూ 15న ముగియనుంది. ఐపీవో రూపంలో సమీకరించే నిధుల్లో రూ.136 కోట్లతో రుణ భారం తగ్గించుకోనుంది.

ఏపీలో ప్యానాసోనిక్ మరో రూ.300 కోట్లు

వారణాసి: స్విచ్‌లు, స్విచ్ బోర్డుల తయారీలో ఉన్న ప్యానాసోనిక్ ఎలక్ట్రిక్ వర్క్స్ ఇండియా సామర్థ్యం పెంపునకు ఆంధ్రప్రదేశ్‌లో మరో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 'శ్రీ సిటీ ప్లాంటులో తొలి దశలో ఇప్పటికే రూ.300 కోట్లు వెచ్చించాం. 2026 నాటికి మరో రూ.300 కోట్లు ఖర్చు చేస్తాం. ఎగుమతుల కోసం ఈ కేంద్రాన్ని వినియోగించుకుంటాం. తొలుత మధ్య ప్రాచ్య, ఆఫ్రికా దేశాలకు ఉత్పత్తులను సరఫరా చేస్తాం' అని ప్యానాసోనిక్ ఎలక్ట్రిక్ వర్క్స్ ఇండియా పవర్ బిజినెస్ యూనిట్ డైరెక్టర్ రాజేశ్ నంద్వానీ వెల్లడించారు. శ్రీ సిటీ, డామన్, హరిద్వార్ ప్లాంట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 62 కోట్ల యూనిట్లు ఉంది. 2025 నాటికి 70 కోట్లు, 2030 కల్లా 100 కోట్ల యూనిట్లకు చేరుతుందని ఆయన పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన ఈ సంస్థకు భారత్‌లో 8,900 పైచిలుకు సిబ్బంది ఉన్నారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
8-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455–00
వరంగల్	457–00

నాట్కో ఫార్మాపై యూఎస్‌లో దావా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్యాన్సర్ చికిత్సలో వాడే పొమాలిడోమైడ్ జనరిక్ డ్రగ్‌కు సంబంధించి యూఎస్‌లో యాంటీట్రస్ట్ దావాలో కంపెనీతో పాటు ఇతర ఔషధ తయారీ సంస్థలను ప్రతివాదులుగా పేర్కొన్నట్లు నాట్కో ఫార్మా శుక్రవారం వెల్లడించింది. సెల్జీన్ కార్పొరేషన్, బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్, బ్రెకన్‌రిడ్జ్ ఫార్మాస్యూటికల్‌తోపాటు పలు కంపెనీలను లూసియానా హెల్త్ సర్వీస్, ఇండెమ్నిటీ కంపెనీ ప్రతివాదులుగా పేర్కొంది. ఈ విషయం ఎటువంటి అర్హత లేనిదని భావిస్తున్నట్టు నాట్కో ఫార్మా ఒక ప్రకటనలో తెలిపింది.

సాక్షి స్పోర్ట్స్



అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ

2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు మొదలయ్యాయి. బ్యూనస్ ఎయిర్స్‌లో శుక్రవారం జరిగిన దక్షిణ అమెరికా జోన్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా 1–0తో ఈక్వెడార్ జట్టును ఓడించింది. 83 వేల మంది ప్రేక్షకులు హాజరైన ఈ మ్యాచ్‌లో ఆట 78వ నిమిషంలో కెప్టెన్ మెస్సీ చేసిన గోల్‌తో అర్జెంటీనా ఆధిక్యంలోకి వెళ్లింది. 176 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మెస్సీకిది 104వ గోల్ కావడం విశేషం. వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో మెస్సీకిది 29వ గోల్. 29 గోల్స్‌తో లూయిస్ స్వారెజ్ (ఉరుగ్వే) పేరిట ఉన్న రికార్డును మెస్సీ సమం చేశాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కొలంబియా 1–0తో వెనిజులాపై గెలుపొందగా... పరాగ్వే–పెరూ మ్యాచ్ 0–0తో 'డ్రా' అయింది. 2026 ప్రపంచకప్‌ను అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. మొత్తం 48 దేశాలు బరిలోకి దిగుతాయి.

బోపన్న జోడీ రన్నరప్‌తో సరి

- యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ ఫైనల్లో పరాజయం
- 'హ్యాట్రిక్' టైటిల్ సాధించిన రాజీవ్ రామ్–సాలిస్‌బరీ జోడీ



విన్నర్స్ ట్రోఫీతో సాలిస్‌బరీ–రాజీవ్ రామ్ ద్వయం... రన్నరప్ ట్రోఫీతో ఎబ్డెన్–రోహన్ బోపన్న జోడీ

న్యూయార్క్: పురుషుల టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాలని ఆశించిన భారత స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. శుక్రవారం రాత్రి జరిగిన యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగం ఫైనల్లో బోపన్న–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పరాజయం చవిచూసింది. డిఫెండింగ్ చాంపియన్స్, మూడో సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా)–జో సాలిస్‌బరీ (బ్రిటన్) ద్వయం 2 గంటల్లో 2–6, 6–3, 6–4తో బోపన్న–ఎబ్డెన్ జంటను ఓడించి వరుసగా మూడో ఏడాది యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తద్వారా 1930 తర్వాత ఈ టోర్నీలో వరుసగా మూడేళ్లు డబుల్స్ టైటిల్ నెగ్గిన తొలి జోడీగా రాజీవ్ రామ్–సాలిస్‌బరీ ద్వయం గుర్తింపు పొందింది. జాన్ డోగ్–జార్జి లాట్ (అమెరికా) జోడీ 1928, 1929, 1930లలో వరుసగా మూడేళ్లు ఈ టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచింది. విజేత రాజీవ్–సాలిస్‌బరీ జోడీకి 7 లక్షల డాలర్లు (రూ. 5 కోట్ల 80 లక్షలు)... రన్నరప్ బోపన్న–ఎబ్డెన్ జంటకు 3 లక్షల 50 వేల డాలర్లు (రూ. 2 కోట్ల 90 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా ఫలితంతో 43 ఏళ్ల 6 నెలల వయసున్న బోపన్న తన కెరీర్‌లో రెండోసారి పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. 2010 యూఎస్ ఓపెన్‌లో ఐజామ్ ఖురేషి (పాకిస్తాన్)తో కలిసి ఆడిన బోపన్న డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచాడు. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో మాత్రం రోహన్ బోపన్న ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాడు. 2017లో దబ్రౌస్కీ (కెనడా)తో కలిసి బోపన్న ఫ్రెంచ్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలిచాడు.

బ్రేక్ పాయింట్ అవకాశాలు వృథా...

రాజీవ్, సాలిస్‌బరీలతో జరిగిన ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం తొలి సెట్‌లో గెలిచి ఆత్మవిశ్వాసంతో కనిపించింది. అయితే రాజీవ్–సాలిస్‌బరీ ఆందోళన చెందకుండా రెండో సెట్‌లో పుంజుకున్నారు. ఆరో గేమ్‌లో బోపన్న–ఎబ్డెన్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 5–2తో ఆధిక్యంలోకి వెళ్లారు. అదే జోరులో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచారు. నిర్ణాయక మూడో సెట్‌లో బోపన్న జోడీ కీలకదశలో తడబడింది. 2–1తో ఆధిక్యంలో ఉన్నదశలో మూడో గేమ్‌లో మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశం వచ్చినా దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. సర్వీస్‌ను నిలబెట్టుకున్న రాజీవ్–సాలిస్‌బరీ ద్వయం స్కోరును 2–2తో సమం చేయడంతోపాటు ఐదో గేమ్‌లో బోపన్న జంట సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఆరో గేమ్‌లో తమ సర్వీస్‌ను కాపాడుకొని 4–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. చివరకు 6–4తో రాజీవ్–సాలిస్‌బరీ జోడీ సెట్‌తోపాటు మ్యాచ్‌ను దక్కించుకుంది.

భారత్, పాక్ మ్యాచ్‌కు 'రిజర్వ్ డే'

వర్షం పడితే తర్వాతి రోజు కొనసాగింపు • ఏసీసీ నిర్ణయంపై విమర్శలు



కొలంబో: ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య ఆదివారం జరిగే 'సూపర్–4' మ్యాచ్‌కు సంబంధించి ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రోజు కొలంబోలో వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా 'రిజర్వ్ డే'ను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. అంటే ఆదివారం వాన కారణంగా మ్యాచ్ నిలిచిపోతే ఆట ఎక్కడ ఆగిందో అక్కడి నుంచే సోమవారం కూడా మ్యాచ్ కొనసాగుతుంది. ఆసియా కప్‌లో ఇప్పటి వరకు ఒక్క ఫైనల్ మ్యాచ్‌కు (సెప్టెంబర్ 17) మాత్రమే రిజర్వ్ డే ఉంది. ప్రేమదాస స్టేడియంలో మొత్తం ఐదు 'సూపర్–4' మ్యాచ్‌లు ఉండగా... మిగతా నాలుగు మ్యాచ్‌లకు కాకుండా ఒక్క భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌కే 'రిజర్వ్ డే' ఇవ్వడం గమనార్హం. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. పాకిస్తాన్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. దాంతో టోర్నీ ఆర్థికపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రసారకర్తల విజ్ఞప్తి మేరకు ఏసీసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

'మాకూ కావాలి'

ఆసియా కప్ 'సూపర్–4' దశలో మిగతా నాలుగు మ్యాచ్‌లను కాదని ఒక్క భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌కే రిజర్వ్ డే కేటాయించడం పట్ల అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తున్నాయి. 'ఒక టోర్నమెంట్‌లో ఈ తరహా వివక్ష ఎక్కడా చూడలేదు. బరిలో ఉండే అన్ని టీమ్‌లు, మ్యాచ్‌లు సమానం అనే క్రీడాస్ఫూర్తిని మరచి ఇలాంటి ప్రత్యేక ఏర్పాటు ఏమిటి? మిగిలిన మ్యాచ్‌లలో ఏవైనా వర్షం కారణంగా రద్దయి ఆయా టీమ్‌లు ఒక్క పాయింట్‌కే పరిమితం అయితే వారికి అన్యాయం చేసినట్లే కదా' అని శ్రీలంక, బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాలు ప్రశ్నించాయి. ఆసియా కప్ టెక్నికల్ కమిటీలో భాగమైన బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ అక్రమ్ ఖాన్... తమకు ఈ విషయమే తెలీదని, ఏసీసీ ఎవరికీ చెప్పకుండా నిర్ణయం తీసుకుందని విమర్శించాడు. మిగిలిన రెండు టీమ్‌లను మ్యాచ్ ఆడకుండా వెనక్కి పంపించేస్తే సరి అంటూ వ్యంగ్య వ్యాఖ్యానాలు కూడా వినిపించాయి. మరోవైపు తమ మ్యాచ్‌కు కూడా రిజర్వ్ డే ఉంటాలని కోరుకుంటున్నట్లు బంగ్లాదేశ్ కోచ్ హతురసింఘే, శ్రీలంక కోచ్ సిల్వర్‌వుడ్ అభిప్రాయ పడ్డారు. 'ఈ నిర్ణయం మమ్మల్నీ ఆశ్చర్యపర్చింది. నిజంగా వర్షం విషయంలో అలాంటి ఆలోచనే ఉంటే మా మ్యాచ్‌కు కూడా రిజర్వ్ డే ఉండాలి. కనీసం చర్చించే అవకాశం లేకుండా నిర్ణయం తీసుకోవడం ఏమిటి' అని ఇరు జట్ల కోచ్‌లు వ్యాఖ్యానించారు.

నేడు శ్రీలంక X బంగ్లాదేశ్

ఆసియా కప్ 'సూపర్–4'లో భాగంగా నేడు జరిగే రెండో మ్యాచ్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్ తలపడనున్నాయి. పాకిస్తాన్ చేతిలో తొలి మ్యాచ్‌లో చిత్తయిన బంగ్లాదేశ్ ఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో నెగ్గడం తప్పనిసరి. మరోవైపు లంకకు ఇది తొలి మ్యాచ్. సొంతగడ్డపై ఆడుతున్న ఆ జట్టు విజయంతో శుభారంభం చేయాలని ఆశిస్తోంది. **మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.**

సబలెంకా X కోకో గాఫ్

మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ





కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించేందుకు అమెరికా టీనేజర్ కోకో గాఫ్... రెండో గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ అందుకోవాలనే లక్ష్యంతో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో తలపడనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఆరో సీడ్ కోకో గాఫ్ 6–4, 7–5తో పదో సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై... సబలెంకా 0–6, 7–6 (7/1), 7–6 (10/5)తో 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)పై గెలుపొందారు. భారత కాలమానం ప్రకారం నేడు అర్ధరాత్రి దాటాక గం. 1:30 నుంచి ఫైనల్ జరుగుతుంది.

ముకోవాతో 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 19 ఏళ్ల కోకో గాఫ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 18 సార్లు దూసుకొచ్చి తొమ్మిదిసార్లు పాయింట్లు గెలిచింది. 2017 యూఎస్ ఓపెన్ రన్నరప్ కీస్‌తో 2 గంటల 32 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా తొలి సెట్‌లో ఒక్క గేమ్ కూడా నెగ్గలేకపోయింది. రెండో గేమ్‌లో ఒకదశలో ఆమె 4–5తో వెనుకబడి ఓటమి అంచుల్లో నిలిచింది. తొమ్మిదో గేమ్‌లో కీస్ తన సర్వీస్‌ను నిలబెట్టుకొని ఉంటే విజయం అందుకునేది. కానీ కీస్ సర్వీస్‌ను సబలెంకా బ్రేక్ చేసి స్కోరును 5–5తో సమం చేసి మ్యాచ్‌లో నిలిచింది. ఆ తర్వాత టైబ్రేక్‌లో పైచేయి సాధించింది. నిర్ణాయక మూడో సెట్‌లో సబలెంకా 2–4తో వెనుకబడింది. ఈసారీ తేరుకొని స్కోరును 4–4తో సమం చేసింది. చివరకు టైబ్రేక్‌లోనూ ఆధిపత్యం కనబరిచి విజయాన్ని అందుకుంది.

సచిన్‌కు 'గోల్డెన్ టికెట్'



ముంబై: భారత్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్ ప్రత్యేక అతిథులుగా ఎంపిక చేసిన కొందరు ప్రముఖులకు బీసీసీఐ వరుసగా 'గోల్డెన్ టికెట్' ఇచ్చి మ్యాచ్‌లకు ఆహ్వానిస్తోంది. ఇటీవలే నటుడు అమితాబ్ బచ్చన్‌కు ఈ టికెట్ అందించిన బోర్డు కార్యదర్శి జై షా తాజాగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు 'గోల్డెన్ టికెట్' అందించారు. అద్భుత క్రికెటర్, జాతికి గర్వకారణంగా నిలిచిన 'భారత రత్న' సచిన్‌కు టికెట్ అందించడం పట్ల జై షా సంతోషం వ్యక్తం చేశారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన సచిన్ లాంటి వ్యక్తి ఇప్పుడు వరల్డ్‌కప్‌లో ఒక భాగంగా మారారని వ్యాఖ్యానించారు.

కొత్త టికెట్లూ హుష్ కాకి!

వరల్డ్ కప్ అభిమానులను దృష్టిలో ఉంచుకొని 4 లక్షల టికెట్లను అదనంగా అందుబాటులోకి తెచ్చినట్లు బీసీసీఐ ఘనంగా ప్రకటించింది. కానీ పరిస్థితి చూస్తే ఏమీ మారలేదని అర్థమవుతోంది. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి టికెట్లు అమ్మకానికి పెట్టారు. అయితే భారత్‌కు సంబంధించి అన్ని మ్యాచ్‌లకూ టికెట్లే లేని పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని మ్యాచ్‌లకు 'సోల్డ్ అవుట్' చూపిస్తుండగా... మిగతా మ్యాచ్‌లకు మీరు క్యూలో ఉన్నారు అని 'బుక్ మై షో' చెబుతోంది. గతంతో పోలిస్తే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నవారికి వేచి ఉండాల్సిన సమయం వేర్వేరుగా చూపించగా... ఇప్పుడు అందరికీ ఒకే మెసేజ్ '90 నిమిషాలు' అనే చూపిస్తుండటం విశేషం! అసలు ఏ మ్యాచ్‌కు ఎన్ని టికెట్లు అమ్ముతున్నారనే విషయంపైనే సమాచారం లేకపోగా, 4 లక్షల టికెట్ల గురించి ఎక్కడా స్పష్టత లేదు! చూస్తుంటే ఇదంతా అభిమానులను కాస్త ఓదార్చేందుకు బీసీసీఐ ఆడిన ఒక డ్రామాలాగానే కనిపిస్తోంది.

సుతీర్థ–ఐహిక జోడీ ఓటమి



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగాల్లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మానవ్ ఠక్కర్ 9–11, 10–12, 5–11తో చైనా దిగ్గజం మా లాంగ్ చేతిలో పోరాడి ఓడిపోయాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో సుతీర్థ 9–11, 6–11, 4–11తో ఒరావన్ పరానాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో... ఐహిక ముఖర్జీ 11–2, 11–6, 8–11, 9–11, 3–11తో చెన్ జింగ్‌టాంగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సుతీర్థ ముఖర్జీ–ఐహిక ముఖర్జీ (భారత్) జోడీ 5–11, 11–13, 10–12తో వాంగ్–చెన్ మెంగ్ (చైనా) ద్వయం చేతిలో... పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మానవ్ ఠక్కర్–మనుష్ షా (భారత్) జంట 5–11, 3–11, 5–11తో ఫాన్ జెన్‌డాంగ్–లిన్ గావోయువాన్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయాయి. టీమ్ విభాగంలో భారత పురుషుల జట్టు కాంస్య పతకం నెగ్గగా... మహిళల జట్టుకు ఆరో స్థానం లభించింది.

అంబేద్కర్ స్మృతివనానికి అదనంగా రూ.106 కోట్లు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వెల్లడి



పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్

పటమట (విజయవాడ తూర్పు): విజయవాడ స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్మాణానికి ప్రభుత్వం అదనంగా మరో రూ.106 కోట్లు కేటాయించిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. నగర పర్యటనలో భాగంగా శుక్రవారం స్మృతివనం పనులను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారని, ఆయన నిరంతరం ఇక్కడ జరుగుతోన్న పనులను సమీక్షిస్తూ అధికారులకు సూచనలిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే స్మృతివనం పనులు 95% పూర్తయ్యాయని, నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్మృతివనాన్ని, 125 అడుగుల విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారని చెప్పారు. అంబేద్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు వీలుగా డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయని, మిగిలిన అన్ని పనులూ శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు.

రూ.20 కోట్ల విలువైన మాదకద్రవ్యం పట్టివేత

- శ్రీలంక తరలించేందుకు యత్నం
- ఇద్దరిని అరెస్టు చేసిన అధికారులు

సాక్షి, చెన్నై: శ్రీలంకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆరు కేజీల ఐస్ కొకైన్ మాదక ద్రవ్యాన్ని తమిళనాడులోని రామేశ్వరంలో ప్రత్యేక పోలీస్ బృందం పట్టుకుంది. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.20 కోట్లుగా గుర్తించారు. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు అందిన సమాచారంతో రామనాథపురం జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. రామేశ్వరం తీరంలోని వేదల్, ముండియకుప్పం పరిసరాలలో శుక్రవారం వేకువజాము నుంచి నిఘా పెట్టారు. సమాచారం మేరకు ముండియకుప్పంలోని ఓ జాలరి ఇంట్లో సోదాలు చేయగా, ఐస్ కొకైన్ పట్టుబడింది. ఆ ఇంట్లో ఉన్న నాగకుమార్, శక్తివేల్‌ను అరెస్టు చేశారు. మాదక ద్రవ్యాన్ని పడవ ద్వారా శ్రీలంకకు రాత్రి సమయంలో తరలించేందుకు సిద్ధం చేసినట్టు విచారణలో తేలింది.

అమ్మకు ఆరోగ్య రక్షణ

గర్భిణులు, బాలింతలకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'



సాక్షి, అమరావతి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వారికి వరంగా మారింది. ఒకవైపు ప్రతినెలా ప్రభుత్వాస్పత్రుల్లో 9న ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎం) నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా గర్భిణులకు మధుమేహం, బీపీ, రక్త పరీక్షలు, అవసరం మేరకు స్కానింగ్‌లు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. మరోవైపు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గర్భిణికి గ్రామాల్లో నెలలో రెండుసార్లు వైద్యులు సేవలందిస్తున్నారు.

నెలకు మూడుసార్లు

గర్భిణులకు ప్రసవంలోగా నాలుగుసార్లు, బాలింతలకు ప్రసవానంతరం ఆరుసార్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించాలనేది కేంద్ర ఆరోగ్య శాఖ నిబంధన. హైరిస్క్ గర్భిణులకు 8సార్లు ప్రసవంలోగా వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ.. ఇతర రాష్ట్రాల్లో లేనట్టుగా మన రాష్ట్రంలో నెలలో మూడుసార్లు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందుతున్నాయి. పీఎంఎస్ఎం డే రోజున ఆస్పత్రుల్లో ఒకసారి, ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలకు వచ్చిన సందర్భంలో రెండుసార్లు చొప్పున వైద్యులు సేవలు అందిస్తున్నారు. మరోవైపు మిగిలిన రోజుల్లో గ్రామాల్లోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో ఉండే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ఏఎన్ఎం వాకబు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతినెలా గర్భిణులు, బాలింతలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) టెస్ట్ నిర్వహించి రక్తహీనతను పర్యవేక్షిస్తున్నారు. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిపై మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తీవ్ర రక్తహీనత ఉన్న వారికి కృత్రిమంగా రక్తం ఎక్కించడం, ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్‌లు వేయడం చేస్తున్నారు. అదేవిధంగా గర్భిణులకు ఆరోగ్యశ్రీ కింద మూడు స్కాన్‌లను ఉచితంగా ప్రభుత్వం చేయిస్తోంది. ఇందులో ఒక స్కాన్‌ను వైద్యుల సూచనల మేరకు టిఫ్పా స్కాన్ చేయిస్తున్నారు.

ఆగస్టులో 2.04 లక్షల మందికి..



ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఆగస్టు నెలలో 2.26 లక్షల మంది గర్భిణులకు వైద్య సేవలు అందించాల్సి ఉండగా 90.41 శాతం 2.04 లక్షల మందికి సేవలు అందించారు. 64,092 బాలింతలకుగాను 92.29 శాతం 59,149 మంది బాలింతలకు వైద్యం చేశారు. గ్రామాలకు వెళుతున్న ఫ్యామిలీ డాక్టర్‌లు బాలింతల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నారు. మరోవైపు కార్యక్రమం మొదలైనప్పటి నుంచి గ్రామాల్లోనే గర్భిణులకు 14.74 లక్షలు, బాలింతలకు 5.08 లక్షల సేవలను వైద్య శాఖ అందించింది.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి రక్ష



కొందరు గర్భిణులు యాంటీనేటల్ కేర్ (ఏఎన్‌సీ), పోస్ట్‌నేటల్(పీఎన్‌సీ)కు దూరమైన గర్భిణులు, బాలింతల వివరాలు ఫ్యామిలీ డాక్టర్‌కు ఆన్‌లైన్‌లో పంపుతున్నాం. వారికి గ్రామాల్లోనే వైద్యులు సేవలు అందిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరం అనుకున్న వారిని దగ్గరలోని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. మాతా, శిశు మరణాల కట్టడికి అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది. ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఇలా వివిధ కార్యక్రమాల ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రభుత్వం రక్షగా నిలుస్తోంది.

– డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్, వైద్య శాఖ


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



సుబ్బారాయుడి సేవలో..
మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని విజయవాడ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఐజీ, ఓఎస్‌డీ టీవీ శశిధర్ రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు.



సాగర్ సమాచారం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.60 అడుగుల వద్ద ఉంది.



పృథ్వీశ్వరుని సన్నిధిలో..
చల్లపల్లి: ప్రముఖ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు శుక్రవారం నడకుదురులోని పృథ్వీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పాటలీవనం సందర్శించారు.

న్యూస్‌రీల్

దుర్గగుడికి నలుగురు ప్రత్యేక ఆహ్వానితులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానానికి నలుగురు ప్రత్యేక ఆహ్వానితులను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం దేవస్థాన పాలక మండలిలో 15 మంది సభ్యులు ఉండగా, వారికి అదనంగా ఈ నలుగురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించింది. వీరిలో చెన్నా జనార్దనరావు, జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోసూరి వెంకటరాజు, మర్రేడి రాఘవరాగిణి ఉన్నారు. వీరిలో జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఆలయ ఈవో భ్రమరాంబను మర్యాద పూర్వకంగా కలిశారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా బ్రహ్మచారి



కోనేరుసెంటర్: కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా డాక్టర్ పీవీ బ్రహ్మచారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మచారి బయోటెక్నాలజీ, బయో సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా డెప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ రామిరెడ్డి మాతృసంస్థ నాగార్జున యూనివర్సిటీకి తిరిగి వెళ్లారు. నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మచారిని యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి. జ్ఞానమణి అభినందించారు. ఆయనతో పాటు పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలతో బ్రహ్మచారిని అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం బ్రహ్మచారి మాట్లాడుతూ యూనివర్సిటీలో పని చేస్తున్న ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో తన విధులు సమర్థంగా నిర్వర్తించి యూనివర్సిటీకి మరింత మంచి పేరు తీసుకువచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

ఈకేవైసీ అప్‌డేట్ పేరుతో కుచ్చుటోపీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈకేవైసీ అప్‌డేట్ చేయాలంటూ అకౌంట్ వివరాలు తెలుసుకుని ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సొమ్ము కాజేసిన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడికి చెందిన సంపసాల నాగేశ్వరరావు ఏజీఐఎల్‌యూఎస్ దయాగ్నోస్టిక్స్‌లో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఆగస్టు 30న 8618778934 నంబర్ నుంచి నాగేశ్వరరావుకు ఫోన్ వచ్చింది. తాను హైదరాబాద్ ఎస్‌బీఐ కార్డు కార్యాలయం నుంచి చేస్తున్నట్లు కాల్ చేసిన వ్యక్తి చెప్పాడు. మీ ఎస్‌బీఐ కార్డు ఈ-కేవైసీ అప్ డేట్ చేసి, పాత కార్డు క్లోజ్ చేయాలని చెప్పాడు. అందుకు నాగేశ్వరరావు తొలుత అంగీకరించలేదు. ఫోన్ చేసిన వ్యక్తి తాను ఎస్‌బీఐ ఉద్యోగినని నమ్మబలికాడు. దీంతో నాగేశ్వరరావు ఫోన్ నంబర్‌కు లింక్ పంపాడు. ఈ-కేవైసీ అప్‌డేట్ చేసి, పాత కార్డు క్లోజ్ చేయాలంటే డెబిట్ కార్డు డిటైల్స్ ఎంటర్‌చేయాలని చెప్పాడు. దీంతో నాగేశ్వరరావు ఆ వ్యక్తి పంపిన లింక్ ఓపెన్ చేయగానే ఓటీపీ వచ్చింది. ఓటీపీ ఎంటర్ చేసిన వెంటనే నాగేశ్వరరావు బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,02,358 డెబిట్ అయ్యాయి. ఆ వెంటనే లావాదేవీ ఒరిజినల్ అవునా? కాదా అని ఎస్‌బీఐ కార్డు నుంచి అతనికి ఫోన్ వచ్చింది. దీంతో అతను ఫ్రాడ్ జరిగిందని, కార్డు బ్లాక్ చేయాలని కోరాడు. 1930 నంబరు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. తాను మోసపోయానని తెలుసుకున్న నాగేశ్వరరావు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర జట్టు సత్తా



మొగల్రాజపురం: బెంగళూరులో ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ 46వ జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు సత్తా చాటింది. ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడకు చెందిన డి.రేష్మిత, టి.సూర్యచరిష్మ ఈ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో ఉత్తరాఖండ్ జట్టుపై 2-0 తేడాతో ఓడి బ్రాంజ్ మెడల్‌ను దక్కించుకున్నారు. క్రీడాకారిణులను ఉమ్మడి కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాస్ అభినందించారు.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు



పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న ఆడపడుచులు



బందరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో ముత్తయిదువులు



శరణు.. శరణు సౌభాగ్య ప్రదాయినీ

శ్రావణ మాసం నాల్గో శుక్రవారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. అష్టైశ్వర్యాలు, పాడిపంటలు, పసుపు కుంకుమలతో నిండు నూరేళ్లు వర్ధిల్లేలా దీవించాలని వేడుకున్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి భక్తజనంతో కిక్కిరిసింది. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం శ్రావణ శోభతో కళకళలాడింది. బందరు బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక వ్రతాలు ఆచరించారు. ఆయా ఆలయాల్లో పూజకు అవసరమైన సామగ్రిని దేవస్థానాలే సమకూర్చాయి. భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. - సాక్షి నెట్‌వర్క్

సహకారానికి ఇంధనం

- పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు
- ఎన్టీఆర్ జిల్లాకు మూడు బంక్‌లు మంజూరు
- ఇప్పటికే ప్రారంభమైన రెండు బంక్‌లు
- పెట్రోల్, డీజిల్ అమ్మకాల నుంచి సంఘాలకు కమీషన్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ముండ్లపాడు పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్

పెనుగంచిప్రోలు: సంఘాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్)లు ముందుకు వస్తున్నాయి. పలు రకాల వ్యాపారాలు నిర్వహించటం ద్వారా సంఘాల ఆదాయం పెంచుకునేందుకు సిద్ధమవుతున్నాయి. తాజాగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుపై దృష్టి పెడుతున్నాయి. ఈక్రమంలో ఎన్టీఆర్ జిల్లాలో మూడు పెట్రోల్ బంక్‌లు మంజూరయ్యాయి. వీటిలో పెనుగంచిప్రోలు, గంపలగూడెం మండలం తునికిపాడులో బంక్‌లు ఇప్పటికే ప్రారంభం కాగా పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడులో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయంతో పాటు సహకార రంగంలోనూ పెను మార్పులు వస్తున్నాయి.

సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లు..

ఉమ్మడి జిల్లాలో 425 పీఏసీఎస్‌లు ఉండగా, ఎన్టీఆర్ జిల్లాలో 132 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు హెచ్‌పీసీఎల్ కంపెనీ ముందుకు వచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలో 3 బంక్‌లు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. బంక్ ఏర్పాటు చేయాలంటే కంపెనీకి కావాల్సిన కొలతల ప్రకారం భూమి చూపాలి. అనంతరం కంపెనీ ఇచ్చిన ప్రకారం రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, పోలీస్, ఫైర్ అధికారుల నుంచి అనుమతి ధ్రువీకరణ పత్రాలు పొందాలి. వీటి తర్వాత జిల్లా ఉన్నతాధికారులు అనుమతి పొంది పెట్రోల్ బంక్‌ల నిర్వహణ చేపట్టాలి. అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వచ్చిన తరువాత కేడీసీసీ నుంచి బంక్ కాంపౌండ్ వాల్, లెవలింగ్ తదితర పనులకు రుణం తీసుకోవటం జరుగుతుంది.

ఆదాయం బాగుంది



పెనుగంచిప్రోలు పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభమై ఏడాదిన్నర అవుతుంది. నెలకు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు అన్నీ పోగా రూ.లక్ష వరకు ఆదాయం సొసైటీకి లభిస్తోంది. అలాగే పలువురికి ఉపాధి దొరికింది.

పి.దుర్గాప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్, పెనుగంచిప్రోలు

అదనపు ఆదాయం



వ్యాపారాభివృద్ధికి అవకాశం ఉన్న సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసి అదనపు ఆదాయం పొందుతున్నాం. పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలతో పాటు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, గన్నవరంలో కల్యాణ మండపం నిర్వహిస్తున్నాం. పెట్రోల్, డీజిల్ అమ్మకాల ద్వారా వచ్చే కమీషన్ సంఘాల అభివృద్ధికి దోహదం చేస్తుంది.

-తాతినేని పద్మావతి, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



నూతన గోడౌన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో జేసీ సంపత్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా ఎలక్షన్ గోడౌన్‌లో భద్రపరిచే ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించి నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఈవీఎం, వీవీ ప్యాట్స్‌లను భద్రపరిచేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గోడౌన్‌ను శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి జిల్లాకు 15 వేల వీవీప్యాట్స్, కంట్రోల్ యూనిట్లు (సీయూ యంత్రాలు) చేరుకోనున్నాయని చెప్పారు. ఆరు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న గోడౌన్‌ను సీసీ కెమేరాల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘాతో ఉన్న సెక్యూరిటీ గార్డ్ గదిని కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలను నూతన గోడౌన్‌లో భద్రపరుస్తున్నామని చెప్పారు. ప్రతి యంత్రం కోడ్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పరిశీలించి గోడౌన్‌లో భద్రపరచాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. గోడౌన్ పరిసరాలలో భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మోహన్‌కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎం.దివాకర్ బాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతియాజ్ పాషా, రూరల్ తహసీల్దార్ జాహ్నవి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెట్ సీహెచ్ దుర్గా ప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ మధు, మార్కెట్ యార్డ్ ఈఈ వై. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఈఈ వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడండి



మాట్లాడుతున్న వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్, సింహాద్రి రమేష్‌బాబు, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ రాఘవరావు

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు సాగునీటి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా నీటిపారుదల, వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఎరువులు, యూరియా కొరత ఏర్పడకుండా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆగస్టులో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునేలా ఇంజినీరింగ్ అధికారులు శివారు గ్రామాల రైతులకు నీరు అందేలా ప్రణాళిక ప్రకారం చూడాలన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి..

మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా శివారు గ్రామాల వరకు నీరు చేరేలా ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఎరువుల కొరత ఉందని రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ప్రణాళిక ప్రకారం వాటిని సరఫరా చేయాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి బ్యారేజ్‌కు నీరు వస్తుందని ఇంజినీరింగ్ అధికారులకు 12 గంటల ముందుగానే తెలుస్తుందని ఆ ప్రణాళిక ప్రకారం నీటిని శివారు ప్రాంతాలకు చేరేలా విడుదల చేయాలని సూచించారు. జిల్లాలో 28,764 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా 26,283 మెట్రిక్‌టన్నులు ఇప్పటికే జిల్లాకు వచ్చిందని వీటిని రైతుల వాడకాన్ని బట్టి అన్ని ప్రాంతాలకు కొరత లేకుండా సర్దుబాటు చేయాలన్నారు.

యలకుర్ర డ్రెయిన్ వెడల్పు చేయండి..

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ యలకుర్రు డ్రెయిన్‌ను వెడల్పు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తెలుసుకుని అధికారులు అప్రమత్తంగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ జన్ను రాఘవరావు, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్. పద్మావతి, పౌరసరఫరాలశాఖ మేనేజర్ వి. శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు పెన్నేరు ప్రభాకరరావు, పట్టపు శ్రీనివాసరావు (నాని) పాల్గొన్నారు.

ఎంపీగా నా పని నేను చేసుకువెళుతున్నా..

- పోర్టు నిర్మాణానికి ఆర్థిక వనరులు సమకూర్చటంలో కీలకపాత్ర
- ఎవరికీ నాపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు
- మచిలీపట్నం నుంచి పోటీచేసి విజయం సాధిస్తా: బాలశౌరి



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడిగా తన పని తాను చేసుకుంటూ పోతున్నానని వల్లభనేని బాలశౌరి అన్నారు. శుక్రవారం మచిలీపట్నం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనను విలేకరులు అడిగిన ప్రశ్నకు పైవిధంగా సమాధానమిచ్చారు. 'ఎవరికీ నాపై ఫిర్యాదులు చేయాల్సిన అవసరం లేదు. నా పని నేను చేసుకుంటూ వెళతా. ఒకవేళ ఎవరైనా కామెంట్లు చేసినా అది వారి విజ్ఞతకే వదిలేస్తా'నని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలుచేసేలా చర్యలు చేపట్టామన్నారు. పోర్టుకు నిధులు తీసుకువచ్చే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకొచ్చేందుకు కృషి చేసినట్టు చెప్పారు. శరవేగంగా పోర్టు పనులు జరుగుతున్నాయంటే దానిలో తన వంతు కృషి ఉందన్నారు. పోర్టు నిర్మాణం పూర్తయితే ఎంతో మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ వాటా తీసుకువచ్చేందుకు స్థానిక ఎంపీగా కృషి చేశానన్నారు. రూ.325 కోట్లతో గుడివాడలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. పోర్టు నిర్మాణానికి అనుబంధంగా మచిలీపట్నం - విజయవాడ రహదారిని ఆరు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ తయారవుతోందన్నారు. అటువంటి అభివృద్ధి కార్యక్రమాలకే తాను ప్రాధాన్యత ఇస్తాను తప్ప తన గురించి ఎవరు ఏం మాట్లాడినా పట్టించుకోబోనని స్పష్టం చేశారు. మళ్లీ బందరు పార్లమెంట్ స్థానం నుంచే పోటీచేసి గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు.

మిర్చి యార్డులో 25,014 బస్తాల విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,112 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 25,014 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,659 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మోహన్‌కుమార్ అంకితభావం అభినందనీయం

డీఆర్వోకు వీడ్కోలు సభలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మోహన్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అంకితభావంతో విధులు నిర్వర్తించి తన పదవికి పూర్తి న్యాయం చేశారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డీఆర్వోగా విశేష సేవలందించి విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీపై వెళ్తున్న కె. మోహన్ కుమార్ ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోహన్‌కుమార్ డెప్యూటీ తహసీల్దార్‌గా కెరీర్ ప్రారంభించి 30 సంవత్సరాల పాటు వివిధ హోదాలలో పనిచేశారన్నారు. ఏ బాధ్యతలు నిర్వర్తించినా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. జిల్లాలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, తెలుగు భాషా దినోత్సవం, ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి ప్రముఖులు పాల్గొన్న సమావేశాలను సమర్థంగా నిర్వహించారన్నారు. ప్రొటోకాల్ నిబంధనలో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులను సమన్వయం చేసుకుని విజయవంతం చేశారని గుర్తు చేశారు. తెలుగు భాషాభిమాని అని, భాషపై పట్టు ఉన్న అధికారి అని కలెక్టర్ ఢిల్లీరావు కొనియాడారు.

కష్టించే మనిషి..

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ కష్టించే మనస్తత్వం ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. డీఆర్వో కె. మోహన్ కుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తనకు అందించిన సహకారం మరువలేనిదన్నారు. అనంతరం డీఆర్వో మోహన్ కుమార్, ఆయన సతీమణి లక్ష్మీ శశిరేఖను జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, ప్రసన్నలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, డ్వామా పీడీ సునీత తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా 'జగనన్నకు చెబుదాం'

- ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలస్థాయి కార్యక్రమాలు
- కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజాసమస్యలు పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. దీనికి అనుసంధానంగా ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1902ను రూపొందించి, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. జిల్లాస్థాయి, మండల స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. పరిష్కరించిన అర్జీలను నాలుగు అంచెల్లో ఆడిట్ నిర్వహించి, అర్జీదారుల నుంచి అభిప్రాయం తెలుసుకుని సంతృప్తి పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇప్పటి వరకు 6,800 అర్జీలు రాగా వీటిలో 5,108 అర్జీలు పరిష్కరించామన్నారు. న్యాయ, ఆర్థిక పరమైన అంశాలు తప్ప మిగిలిన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నామన్నారు.

ప్రతి బుధ, శుక్రవారాల్లో క్షేత్రస్థాయిలో..

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం కాకుండా ప్రతి బుధ, శుక్రవారాల్లో క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా సూచించిన షెడ్యూలు ప్రకారం ఆయా మండలాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అనంతరం 12.30 నుంచి 1.30 గంటల మధ్యలో వచ్చిన అర్జీలను శాఖల వారీగా విభజిస్తామన్నారు. భోజన విరామానంతరం సంబంధిత అధికారులు అర్జీదారుడు ఇచ్చిన సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్పటికప్పుడే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. స్పందన కార్యక్రమానికి రాలేని వారు ఆయా మండలాల్లో నిర్వహించే కార్యక్రమానికి వచ్చి సమస్యను అధికారులకు తెలిపి పరిష్కరించుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ బీవీ శివనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్యాబ్‌లలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి డ్రైవ్



అజిత్‌సింగ్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు గతేడాది ఉచితంగా అందజేసిన ట్యాబ్‌లను ఆండ్రాయిడ్ 13వ వెర్షన్‌కు అప్‌డేట్ చేసినట్లు బైజూస్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సైదా సాహెబ్ తెలిపారు. ట్యాబ్‌లలో సాంకేతిక లోపాలను సరిచేసేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 4 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో 1900 ట్యాబ్‌లలో తలెత్తిన లోపాలను సరిచేశామని పేర్కొన్నారు. వివేకానంద సెంటినరీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లను పరిశీలించారు. స్కూల్లోని 41 ట్యాబ్‌లకు గానూ 13 ట్యాబ్‌లలో వచ్చిన సాంకేతిక సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. విద్యార్థులు ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. వివేకానంద సెంటినరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.నరేంద్ర, ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నేడు ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సీ.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిప్లొమా కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధికార భాషా కమిషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయబాబు ఆన్‌లైన్‌లో హాజరై సంపాదకీయం, వ్యాసాలు–భాష ప్రాముఖ్యత అనే అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. డిప్లొమా కోర్సు ఇన్ జర్నలిజం శిక్షణకు హాజరవుతున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ లింక్–815 9892 6979, పాస్‌వర్డ్–12345 ద్వారా హాజరై వినవచ్చన్నారు.

వరాలీయమ్మా.. వరప్రదాయనీ..

- దుర్గమ్మ సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- అమ్మవారి ఆలయానికి విశేష అలంకరణ
- దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. వ్రతం చేసేందుకు విచ్చేసిన భక్తులతో పాటు అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహా మండపం ఆరో అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు.

తొలుత ఆర్జిత సేవగా వ్రతాలు...

మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద తొలుత ఆర్జిత సేవగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. రూ.1500 టికెటు కొనుగోలు చేసిన మహిళలు వ్రతంలో పాల్గొన్నారు. వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వ్రతాన్ని జరిపించారు. సుమారు 50 మంది ఉభయదాతలు ఆర్జిత సేవ టికెట్లు కొనుగోలు చేసి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఉచిత సేవలో 500 మందికి అవకాశం...

ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సుమారు 500 మందికి పైబడి మహిళలకు ఉచిత సేవలో పాల్గొనే అవకాశాన్ని దేవస్థానం కల్పించింది. సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఈవో భ్రమరాంబ పర్యవేక్షించగా, పూజకు అవసరమైన సామగ్రిని దేవస్థానమే అందచేసింది. డీఈవో గురుప్రసాద్, ఆలయ పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.



దుర్గమ్మ అంతరాలయంలో నెలకొన్న భక్తుల రద్దీ



మహా మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



కొండపై భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

పోటెత్తిన భక్తజనం.....

అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఆరో అంతస్తులోని ఉత్సవ మూర్తి వేదికను పూలతో విశేషంగా అలంకరించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ. 300, రూ.500 క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. ఉదయం అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కళ్యాణం, చండీహోమాలు వంటి ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారి పాత మెట్ల మార్గంలో మహిళలు విశేషంగా మెట్ల పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వరాలీయమ్మా.. వరప్రదాయనీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు. ఇంజినీరింగ్, ఇతర విభాగాల సిబ్బందికి ప్రత్యేకంగా విధులను కేటాయించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కదులుతున్న ట్రైన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఉంగుటూరు: విజయవాడ–గుడివాడ రైలు మార్గంలో భార్య కళ్ల ముందే భర్త ట్రైన్ నుంచి జారి పడి మృతి చెందిన ఘటన ఇందుపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గుడివాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం కుమ్మరిపాలెంకు చెందిన సత్యవరపు వెంకటస్వామి (33) తన భార్య మణి కొంత కాలంగా హైదరాబాదులోని ఓ ఆపార్టుమెంటులో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న భార్య తల్లిని చూసేందుకు గురువారం స్వగ్రామానికి బయలుదేరారు. విజయవాడలో అనపర్తి వెళ్లే ట్రైన్‌కు బదులుగా నాగర్‌సోల్–నర్సాపురం ట్రైన్ ఎక్కారు. తోటి ప్రయాణికులను అడగగా ఇది నర్సాపూర్ వెళుతుందని మీరు భీమవరంలో ట్రైన్ మారవచ్చని చెప్పారు. శుక్రవారం తెల్లవారుజామున ట్రైన్ గుమ్మం సమీపంలో వాష్ బేసిన్ వద్ద ముఖం కడుగుకుని వెళ్లే సమయంలో ఒక్కసారిగా ట్రైన్ కుదుపులకు ఉంగుటూరు మండలం ఇందుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రైన్‌లో నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో వెంకటస్వామి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. గుడివాడ జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఘటన స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలోని తేలప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు క్రింద పడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేలప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్నట్లుగా స్థానికులు నుంచి శుక్రవారం సమాచారం అందటంతో ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి వివరాలు ఆరా తీసేందుకు ప్రయత్నించగా ఎటు వంటి ఆధారాలు లభించలేదు. మృతుడు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటాడని, ముదురు నీలం రంగు పొట్టి చేతుల టీషర్ట్, కాఫీ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు చెప్పారు. కాగా, ఏలూరు రైల్వే ఎస్‌ఐ డి.నరసింహారావు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తునికిపాడు(గంపలగూడెం): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాంబాబు తెలిపిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన హరి రామారావు (38) మరో వ్యక్తి ఇటుకల అర్జున్‌తో కలసి ఎరువులు, పురుగుమందుల వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పొలానికని వెళ్లి పురుగు మందు తాగాడు. సమీపంలోని ప్రజలు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం మధిరలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి ఇరువురు ఆడపిల్లలు ఉన్నారు.

కాలువలో దూకి నవ వధువు ఆత్మహత్య



నాగలక్ష్మి (ఫైల్)

పెనమలూరు: కాలువలో దూకి నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన యనమలకుదురులో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... అట్లా చక్రవర్తి అనే వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె నాగలక్ష్మికి (19) ఈ ఏడాది జూన్ 8వ తేదీన తెలంగాణ రాష్ట్రం కోళ్లపూడి గ్రామానికి చెందిన అనంత బాదరయ్యకు ఇచ్చి వివాహం చేశారు. ఆషాఢ మాసం కావటంతో నాగలక్ష్మి పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటోంది. భర్తకు ఉపాధి లేకపోవటంతో ఆగస్టు 18వ తేదీన తెలంగాణ నుంచి వచ్చి యనమలకుదురులో వేరే కాపురం పెట్టింది. 6వ తేదీన నాగలక్ష్మి భర్త ఊరు వెళ్లాడు. అయితే ఆదే రోజు రాత్రి నాగలక్ష్మి గ్రామంలో ఉన్న పంట కాలువలో దూకింది. ఇది చూసిన స్థానికులు తండ్రి చక్రవర్తికి సమాచారం ఇచ్చారు. ఆమె కోసం కాలువలో గాలించగా మృతదేహం పెనమలూరు వంతెన వద్ద శుక్రవారం లభ్యమైంది. కుటుంబ తగాదాల కారణంగానే నాగలక్ష్మి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కౌలు రైతులకు రుణాలు అందించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): కౌలు రైతులకు నూరు శాతం రుణాలు అందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో బ్యాంకు అధికారులతో డిస్ట్రిక్ కన్సల్టేటివ్ సమావేశాన్ని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరితో కలిసి శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 55 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయగా వారిలో కేవలం 7 వేల మందికి మాత్రమే రూ. 30.71 కోట్లు రుణాలుగా మంజూరు చేశారని తెలిపారు. మిగిలిన 48 వేల మంది కౌలు రైతులు బ్యాంకు రుణాలకు దూరమయ్యారని చెప్పారు. ఈ విషయంలో బ్యాంకులు భూ యజమానికి సులువుగా రుణాలు మంజూరు చేసినట్లుగా, కౌలు రైతులకు ఇవ్వకపోవటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణం మంజూరు చేసే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి ఆర్‌బీఐ, నాబార్డు అధికారులకు త్వరలో లేఖ రాయనున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంక్ ఏజీఎం ఆర్‌కె హనుమకుమారి, నాబార్డు ఏజీఎం మిళింద్ చౌసాలకర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్. సంతోష్ తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేద్దాం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో 45 రోజుల పాటు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభంకానున్న కార్యక్రమంపై గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ కార్యక్రమంలో ముందుగా వలంటీర్లు గృహ సందర్శన చేసి, వైద్య సిబ్బంది వస్తారని, వారికి ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని సూచించాలని చెబుతారన్నారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశాలు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తారని తెలిపారు. 15 రోజుల పాటు నిర్వహించనున్న ఇంటింటి సర్వే తర్వాత మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇద్దరు పీహెచ్‌సీల వైద్యులు, మరో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి చికిత్సలు అందించడంతోపాటు, ఆస్పత్రి సేవలు అవసరమైతే ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పతుల్లో అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్య అవగాహన కలిగించడమే కాకుండా, దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్యశ్రీ అనుబంధ ఆస్పతుల్లో చికిత్స అందిస్తారని వివరించారు. జిల్లా కుటుంబ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి మోతీబాబు, డీపీయంఓ డాక్టర్ నవీన్, మున్సిపల్ కార్పొరేషన్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ సునీల్, డాక్టర్ సమీర తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



గూగుల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్య ఆరోగ్య, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో గర్భిణులు, బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్ నుంచి మాతాశిశు సంరక్షణ, రక్తహీనత నివారణ, తదితర అంశాలపై వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులతో శుక్రవారం గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా రక్తహీనత నివారణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆశాలు, ఏఎన్‌ఎంలు, శిశు సంక్షేమ శాఖ చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల టీమ్ సభ్యులు క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు, పోషకాహారం అందించాలని కోరారు. తద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్, వైద్య పరీక్షలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ తదితర పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆరోగ్యాన్ని అంచనా వేసే అవకాశం ఉందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యం. సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పో ప్రారంభిస్తున్న ఈడీ నితేష్‌రంజన్, ఇతర అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరికీ ఇల్లు ప్రధాన అవసరమని, పిల్లలకు ఉత్తమ విద్య అనేది తల్లిదండ్రుల కల అని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్‌రంజన్ అన్నారు. తమ బ్యాంక్ విస్తృతశ్రేణి రిటైల్‌లోన్‌లు అత్యుత్తమ వడ్డీరేట్లు, సౌకర్యవంతమైన రీపేమెంట్ పదవీకాల ఎంపికలతో ప్రతి వ్యక్తి కలను నెరవేరుస్తుందని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రిటైల్ ఎక్స్‌పో 2023 శుక్రవారం ప్రారంభమైంది. విజయవాడ బృందావనకాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోను ఆ బ్యాంకు ఈడీ నితేష్‌రంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో అనేక మంది ప్రముఖ బిల్డర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌లు, వాహన డీలర్‌లు వారి ప్రాపర్టీ, ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వారి నుంచి ప్రత్యక్ష సమాచారాన్ని పొందవచ్చునని, అర్హతను బట్టి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాట్ ఇన్ ప్రిన్సిపల్ శాంక్షన్ లెటర్ పొందవచ్చునని పేర్కొన్నారు. రుణాలు పొంది, ఆటోలు కొనుగోలు చేసిన డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. 25 మంది బిల్డర్లు, 12 మంది వాహన డీలర్లు, ఏడుగురు ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌లు, స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ జోనల్ హెడ్స్ మురళీ పార్థసారథి, ఎ.శారదమూర్తి, పీవీజెఎస్ మూర్తి, రీజినల్ హెడ్ ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

రూ.6,25,400 విలువైన 286 గ్రాముల బంగారు నగలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జనార్థననాయుడు, సీఐ జానకీరామ్, ఎస్‌ఐ రామారావు

జగ్గయ్యపేట అర్బన్: గత కొన్ని రోజులుగా పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి, నందిగామ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గృహాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సుమారు రూ.6,25,400 విలువైన 286 గ్రాముల బంగారు నగలు, రూ.8 వేల విలువైన 127 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నందిగామ ఏసీపీ కె.జనార్ధననాయుడు, జగ్గయ్యపేట సీఐ ఎం.జానకీరామ్‌తో కలిసి రికవరీ చేసిన బంగారు, వెండి వస్తువులు నిందితుడి వివరాలు వెల్లడించారు. పెనుగంచిప్రోలు ఎస్‌ఐ ముండ్లపాడు ఎక్స్ రోడ్ వద్ద ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా, కాశీపేట మండలం, సోమగూడెంకు చెందిన 33 ఏళ్ల వయస్సు కలిగిన బండ సంపత్ అనే వ్యక్తి ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వరంగల్ జిల్లా కమలాపూర్‌లో ఒకటి, జగ్గయ్యపేటలో ఒకటి, పెనుగంచిప్రోలులో మూడు, వత్సవాయిలో రెండు, నందిగామలో రెండు కలిపి మొత్తం 9 దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని వివరించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నందుకు పెనుగంచిప్రోలు ఎస్‌ఐ, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఎస్‌ఐలు బీవీ రామారావు, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో నగర మేయర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

డయల్ యువర్ సీపీకి 12 ఫిర్యాదులు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో 12 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ టికె రాణా నేరుగా బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు నమోదు చేసుకున్నారు. అందులో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తులు, కుటుంబ గొడవలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. దీనిపై సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం జరుగుతుందని చర్చి పాస్టర్ సజ్జా రత్నకుమార్ తెలిపారు. ప్రముఖ వైద్యులు పాల్గొని, రోగులకు 10 రకాల పరీక్షలు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 94947 67633, 94947 67733 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌సీసీ కేడెట్లకు క్రమశిక్షణ అవసరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్‌సీసీ కేడెట్లకు క్రమశిక్షణ ఎంతో అవసరమని 4(ఎ) బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలెందర్ సింగ్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ ఆఫ్ ఎన్‌సీసీ క్యాడెట్స్ 2023–24కు శుక్రవారం సెలక్షన్స్ నిర్వహించారు. కొత్తగా సెలక్ట్ అయిన ఎన్‌సీసీ కేడెట్లను ఉద్దేశించి కల్నల్ బలెందర్ సింగ్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ ఉపయోగాలు, ప్రాధాన్యత, క్యాంప్‌ల గురించి వివరించారు. ప్రతి క్యాంప్‌కు కేడెట్లు తప్పకుండా హాజరవ్వాలని సూచించారు. రిపబ్లిక్ డే పేరెడ్స్ టీఎస్‌సీ క్యాంప్‌కు వెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ సుబేదార్ రాజ్‌పాల్, నాయక్ కుందన్‌కుమార్, హవల్దార్ పీవీటీ రెడ్డి, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ ఎస్‌కే రఫీయాబేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ప్రింటర్ బహూకరణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు కళాశాల అవసరాలను గుర్తించి ప్రింటర్ బహూకరించడం అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉపయోగించడానికి ప్రింటర్‌ను కొనుగోలు చేసి ప్రిన్సిపాల్ ఎం.విజయసారథికి శుక్రవారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు, కార్యదర్శి గోపీచంద్, సభ్యుడు కిషోర్, కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి బి.భీమా నాయక్, మెటాలజీ విభాగాధిపతి శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ అధ్యాపకుడు వి.భానుమూర్తి పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నిరసన ర్యాలీ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మాన్ని కించపరుస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేతలు శుక్రవారం సత్యనారాయణపురం ర్యాలీ నిర్వహించారు. ఉదయనిధి అనుచిత వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సుమోటాగా కేసు స్వీకరించి కఠినంగా శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు. స్టాలిన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సత్యనారాయణపురం నుంచి శివాజీకేఫ్, శారద కళాశాల జంక్షన్, ఫుడ్‌జంక్షన్ మీదుగా ర్యాలీ చేపట్టారు.

‘తూర్పు’ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- చంద్రబాబు, గద్దె స్పందించాలి
- ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ రాధిక తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, దీనిపై చంద్రబాబు, గద్దె రామ్మోహన్ చర్చకు రావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సవాల్ విసిరారు. 16వ డివిజన్‌లో రూ.94 లక్షలతో వీఎంసీ ఖాళీ స్థలంలోని రూపేష్‌గుప్తానగర్‌లో పార్క్ ఫెన్సింగ్‌తో ఏర్పాటు చేస్తున్న పార్క్ నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో విజయవాడ నగరంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరగలేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. విజయవాడలో వర్షం వస్తే ఇబ్బందులు అని గద్దె చేసి వ్యాఖ్యలకు అవినాష్ ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా... మీరు చెప్పిన ప్రదేశానికి చర్చకు వస్తామని దేవినేని ఛాలెంజ్ చేశారు. వైఎస్సార్ సీపీలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేక పనికిమాలిన చర్యలకు దిగడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

చంద్రబాబు అండ్ పార్టీ ప్రతి రోజు మాట్లాడే అబద్ధాలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌చిట్ అవుతుందని అవినాష్ జోస్యం చెప్పారు. విజయవాడ తూర్పునియోజకవర్గంలో ఈ నాలుగు సంవత్సరాల్లో సుమారు రూ.400 కోట్లకు పైగా వివిధ డివిజన్‌లలో అభివృద్ధి జరిగిందన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రజలను నట్టేట ముంచే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. వర్షం వస్తే విజయవాడ ముంపునకు గురవుతుందని అబద్ధాలు చెప్పడం దుర్మార్గమన్నారు. రెండు గంటలు వర్షం పడితే వెంటనే నగరపాలకసంస్థ అధికారులు రంగంలోకి దిగి ఆ నీటిని బయటకు పంపించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఏపీఐఐసీ కాలనీలో గతంలో ముంపునకు గురయ్యేదని... వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. అక్కడ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని వ్యవహరించడం మీ పార్టీ దినావస్థలో ఉందని తేటతెల్లమవుతుందన్నారు. నిర్మలా కాన్వెంట్, పిన్నమనేని రోడ్డును అభివృద్ధి చేశామన్నారు. మాజీ కార్పొరేటర్ ఉమ్మిడిశెట్టి బహదూర్ మాట్లాడుతూ.. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.800 కోట్లు మంజూరు చేశారన్నారు. మరలా ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి అభివృద్ధికి నాంది పలికారన్నారు. కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక, నాయకులు వేణు, దుర్గారావు, రామకృష్ణ, గట్టెం దుర్గ, దివ్య, దుర్గాభవాని, శ్రీదేవి పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల సర్వే పక్కాగా చేపట్టాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటింటికీ సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమం నూటికి నూరు శాతం పక్కాగా చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్, ఏఈఆర్వో జీవీవీ ప్రసాద్ ఆదేశించారు. 61వ డివిజన్ హెచ్ బ్లాక్‌లో 61, 62, 63, 64 డివిజన్లలోని బూత్‌స్థాయి ఏజెంట్లు, బూత్‌స్థాయి అధికారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఈఆర్వో ప్రసాద్ మాట్లాడుతూ.. సర్వే పూర్తయిన వాటిలో తప్పులున్నాయన్నారు. రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇంటింటికీ సమగ్ర సర్వేను రెండు దఫాలుగా చేయాలని చెప్పారు. ఓటర్ల జాబితా సమర్థవంతంగా ఉండాలన్నారు. ఒకే ఓటరు పేరు రెండు చోట్ల ఉండరాదని, ఈ విషయంలో రాజకీయపార్టీల ఏజెంట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సర్వే సక్రమంగా చేయాలన్నారు. అక్టోబర్ 17వ తేదీ నాటికి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని, డబుల్ ఓట్లను తొలగించడంతో పాటు కొత్త ఓట్లను నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



గ్రాండ్ పేరెంట్స్‌తో పర్యావరణ హిత వేషధారణల్లో చిన్నారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): చక్కని కుటుంబ వ్యవస్థ సమాజానికి, దేశానికి మూలస్థంభమని, అలాంటి కుటుంబం అందమైన హరివిల్లులా ఆనందంతో నిండుదనం సంతరించుకుంటుందని సెయింట్‌జాన్స్ స్కూల్ ప్రెసిడెంట్ మోనికా సుమన్ అన్నారు. చక్కటి కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యతను తెలియచేస్తూ శుక్రవారం సెయింట్‌జాన్స్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాల చిన్నారులు తమ గ్రాండ్ పేరెంట్స్‌తో కలిసి వచ్చి సందడి చేశారు.

ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో మానవతాదృక్పథం, నైతిక విలువలు కొరవడుతున్నాయన్నారు. చక్కని క్రమశిక్షణ, విలువలతో కూడిన రేపటి తరాన్ని దేశానికి అందించడంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సంస్కృతి సాంప్రదాయాల వారధిగా నిలుస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు స్కూల్ అకడమిక్ హెడ్ కె.కళ్యాణి బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ భారతి చిల్లకూరి, వైస్ ప్రిన్సిపాల్ వై.సీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్‌లో వంద ‘పోయెమ్’ చికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ బత్తిన రాజేష్, డాక్టర్ సౌజన్య

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఆహార నాళం మూసుకుపోయి, ఆహారం మింగుడు పడక ఇబ్బందులు పడుతున్న 100 మందికి అత్యాధునిక పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయాటమీ(పోయెమ్) చికిత్సలు నిర్వహించినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బత్తిన రాజేష్ చెప్పారు. రాష్ట్రంలోనే అత్యధిక మందికి ఈ శస్త్రచికిత్సలు తాము నిర్వహించామన్నారు. హాస్పిటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ఆహార నాళం మూసుకుపోయి మింగుడు పడకుండా ఉండటాన్ని అఖలేసియా కార్డియాగా పేర్కొంటామన్నారు. అఖలేసియా కార్డియా అనే వ్యాధిలో ఆహారనాళం నుంచి పొట్టలోనికి వెళ్లకుండా కండరాలు అడ్డుపడతాయని, దీంతో ఆహారం ఆహార నాళిక వద్దేనే అడ్డుపడిపోతుందన్నారు. చికిత్స చేయని పక్షంలో మింగడమే అసాధ్యమవుతుందని, ఏమి తిన్న గుండెలో మంట, ఛాతీనొప్పి, దగ్గు, ఆయాసం, ఆహారం ఊపిరితిత్తుల్లోకి చేరడం, బరువు తగ్గడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి ఏ వయస్సువారికైనా రావచ్చునన్నారు. సమావేశంలో గ్రూపు క్వాలిటీ హెడ్ డాక్టర్ సౌజన్య, ఎనస్థీషియా డాక్టర్ చెరుకూరి పద్మజ పాల్గొన్నారు.

అల్లర్లు చేస్తే టీడీపీ పదవులిస్తామనడం సిగ్గుచేటు

- అవినీతి చేస్తే చంద్రబాబును అరెస్ట్ చేయరా!
- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్




మీడియాతో మాట్లాడుతున్న అవినాష్, పక్కన కడియాల బుచ్చిబాబు, కొరివి చైతన్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో రౌడీయిజం, గూండాయిజం, అల్లర్లు చేస్తే టీడీపీ పదవులిస్తామనడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ధ్వజమెత్తారు. గుణదలలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ ఉనికి కోల్పోతుండటంతో లోకేష్ యువగళం పేరుతో వెళ్లిన ప్రతి చోటా ప్రజల్ని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. టీడీపీని రౌడీ షీటర్లు, గూండాలను తయారు చేసే ఫ్యాక్టరీలా లోకేష్ మార్చారన్నారు. పాదయాత్రకు జనం రాక, నాయకులు లేక లోకేష్ యువగళం రౌడీలను రెచ్చగొడుతున్నారని చెప్పారు. పుంగనూరులో చంద్రబాబు విధ్వంసం సృష్టిస్తే, భీమవరంలో లోకేష్ అదే విధ్వంసం కొనసాగించారని పేర్కొన్నారు. ఎల్లో మీడియా చంద్రబాబు అవినీతిపై ఎందుకు డిబేట్లు పెట్టదని ప్రశ్నించారు. రూ.118 కోట్లు ముడుపులపై ఎందుకు స్పందించడం లేదన్నారు. బీజేపీ, పవన్‌కళ్యాణ్‌లు ఎందుకు నోరు మెదపడం లేదని అవినాష్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో తన కుమార్తెల దగ్గరకు వెళితే టీడీపీ, ఎల్లో మీడియా సిగ్గులేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో సింగపూర్, మలేషియా, బ్యాంకాక్ ట్రిప్పులు వేసింది ఎవరన్నారు.

పంటినొప్పి వస్తే సింగపూర్ వెళ్లింది ఎవరో అందరికీ తెలుసునన్నారు. అవినీతి చేస్తే చంద్రబాబును అరెస్ట్ చేయరా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొరివి చైతన్య పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



అంగన్‌వాడీ చిన్నారులతో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అక్షరాస్యతతోనే అభివద్ధి సాధ్యమని అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ అన్నారు. స్థానిక 27వ డివిజన్ గులాబీతోట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా చిన్నారులకు పలకలు, స్లేట్ పెన్సిల్స్, పెన్సిల్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద పిల్లలకు వారి తల్లిదండ్రులకు తెలియచేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పక చదువు చెప్పించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, ఉపాధ్యక్షులు ఎం.రాము, కె.వరప్రసాద్, నాగ మల్లిక, షఫీ, విశ్వేశ్వరయ్య, పార్వతి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యుడు జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంపర తాతాబ్బాయ్ ట్రస్ట్, ఏబీసీడీ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తోపుడు బండ్లు పంపిణీ చేశారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అర్జునవీధిలో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది సంపర శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు, సమాజానికి మేలు కలిగించే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ నిర్వహించాలని సూచించారు. నేత్రదానంపై అవగాహన కల్పించడంతో చూపు లేని వారి ఎందరికో చూపును ప్రసాదించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏబీసీడీ ట్రస్ట్ చైర్మన్ ఆవులు వెంకట్రావు, న్యాయవాది ఎస్.కోటబాబు పాల్గొన్నారు.

దేశ సేవలో పాల్గొనటం సంతోషంగా ఉంది

- ఇస్రో ఉపగ్రహాలకు విడిభాగాలు అందించటం నా అదృష్టం
- కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి నాగభూషణరెడ్డి



నాగభూషణరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల పాలకవర్గం, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశం రోదసిలోకి పంపించే శాటిలైట్లలో వినియోగించే విడిభాగాలను అందించటం తద్వారా దేశానికి సేవలో పాల్గొనటం ఎంతో సంతోషాన్నిస్తోందని నాగసాయి ప్రెసెషియస్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, కేబీఎస్ కళాశాల పూర్వ విద్యార్థి బి.నాగభూషణరెడ్డి అన్నారు. ఇస్రో రోదసిలోకి పంపించే ఉపగ్రహాల్లో బ్యాటరీకు రక్షణ కవచాలకు సంబంధించిన విడిభాగాలను తయారు చేసే నాగభూషణరెడ్డి విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో సంఘ నాయకులు, కళాశాల పాలకవర్గం నాగభూషణరెడ్డిని ఘనంగా సత్కరించారు.

గత సేవలతో అవకాశమిచ్చారు..

ఈ సందర్భంగా నాగభూషణరెడ్డి మాట్లాడుతూ ఇస్రో పంపించే ఉపగ్రహాలకు సంబంధించి బ్యాటరీ వ్యవస్థకు కవచాలను తమ సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. తాను విజయవాడ గాంధీనగర్‌లోని హిందూ హైస్కూల్‌లో హైస్కూల్ విద్యను, కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌ను అభ్యసించానని, ఆ తరువాత ఇంజినీరింగ్ చేశానన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే టూల్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పీజీ చేశానని చెప్పారు. ఆ తరువాత తాను పని చేసిన కొన్ని రక్షణ వ్యవస్థ సంస్థల్లో పొందిన అనుభవంతో ఉపగ్రహాలకు అవసరమయ్యే కొన్ని భాగాలను తయారు చేస్తున్నానన్నారు. గత సేవలతో ఇస్రో తనకు అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనందరామసుధాకర్ మాట్లాడుతూ.. 1907లో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన తమ విద్యాసంస్థ నేడు వేలాది మంది విద్యార్థులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో అద్భుతమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డీపీ రామకృష్ణ, జుల్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతి



విశ్వనాథ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మార్కండేయశర్మ తదితరులు


మధురానగర్(విజయవాడసెంట్రల్): విశ్వానికి లోకశ్రేయస్సే విశ్వనాథ రచనల పరమావధి అని కవులు, కళాకారులు మన సంస్కృతికి నిలువుటద్దాలు అని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ జె.వి. మార్కండేయశర్మ అన్నారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శుక్రవారం జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, కళాప్రపూర్ణ, పద్మభూషణ్, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 128వ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హాహా హూహూ, విష్ణుశర్మ ఇంగ్లిష్ చదువు వంటి రచనలలో విశ్వనాథ ప్రతిపాదించిన అంశాలను ఆసక్తికరంగా వివరించారు. చిన్నకథలతో విశ్వనాథను చదవడం ప్రారంభించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ సహృదయతతో కవుల సృజన రచనలను చదివినవారికి విజ్ఞానంతో పాటు ఉత్తమ సంస్కారం కూడా కలుగుతుందన్నారు. విశ్వనాథ వారు పనిచేసిన కళాశాల ప్రాంగణంలోనే తాము పనిచేయటం పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. కళాశాల అంతర్గత ప్రమాణాల భరోసా మండలి, తెలుగు విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథ పద్యాలను ఆలపించిన విద్యార్థులు మాధురిని, విశ్వనాథ గురించి ప్రసంగించిన వెంకాయమ్మను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ వివాహాలపై అవగాహన సదస్సు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీఐడీ ఎన్‌ఆర్‌ఐ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఎన్‌ఆర్‌ఐ వివాహ సమస్యలు, భారతీయ మహిళల హక్కులపై సామాజిక–చట్టపరమైన సాధికారత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.బబిత పాల్గొని మహిళల హక్కులు, తమను తాము రక్షించుకోవడానికి సాధికారత కల్పించడం లక్ష్యంగా భారతీయ చట్టం ప్రకారం మహిళలకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన చట్టపరమైన హక్కులు, నిబంధనలను తెలియజేశారు. ఎన్‌ఆర్‌ఐ సంబంధాల కోసం ప్రయత్నించేముందు వారి పాస్‌పోర్ట్, వీసా, ఐటీ రిటర్న్స్ నేర చరిత్ర, మునుపటి వివాహ పరిస్థితులను తెలుసుకోకుండా వివాహ సంబంధాలు చేసుకోకూడదని సూచించారు. అలాగే పోలీసు అధికారులు ముఖ్యంగా గ్రామ, వార్డు మహిళా పోలీసులు తమ ప్రాంతాల్లోని ప్రజలకు ఈ వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓవర్సీస్ ఇండియన్ మ్యారేజెస్ – సేఫ్టీ గైడెలైన్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌ఆర్‌టీ ప్రెసిడెంట్ మేడపాటి వెంకట్, రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ కె.శివహర్ష, సీఐడీ లీగల్ అడ్వైజర్ ఎం.లక్ష్మణ్‌రావు, సీఐడీ ఎన్‌ఆర్‌ఐ సెల్ ఎస్పీ కేజీవీ సరిత, పలు జిల్లాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేణుగోపాలుని నగరోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణాష్టమిని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఉట్టి మహోత్సవాలు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. కేటీరోడ్డు, బ్రాహ్మణవీధి, నెహ్రూబొమ్మ సెంటర్‌తో పాటుగా పలు ప్రాంతాల్లో యువజన సంఘాలు, కులసంఘాల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి నగరోత్సవంగా ఆయా ప్రాంతాలకు తరలిరాగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఉట్టి మహోత్సవ నిర్వాహకులు స్వామికి పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు సందడిగా దర్శనమిచ్చాయి. నగరోత్సవం స్వామి వారి సన్నిధి నుంచి ప్రారంభమై కేటీ రోడ్డు, శేషయ్య వీధి, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. అదేవిధంగా వసంత మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం మాజీ చైర్మన్ బొట్టా కొండలరావు స్థానిక మరుపిళ్ల చిట్టి ఇంటి సెంటర్‌లో ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు హాజరయ్యారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు.


రైమతి ఘురియా


సుబాసా మోహన్తా



చిరుధాన్య లక్ష్మికళ

కలెక్టర్ పిల్లలు కలెక్టర్, హీరో పిల్లలు హీరో, రాజకీయ నాయకుడు పిల్లలు రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటే, ఇక మధ్యతరగతి తల్లిదండ్రులు... తమలా తమ పిల్లలు ఇబ్బందులు పడకూడదని, తిని, తినక ఒక్కోరూపాయి పోగుచేసి, కష్టపడి చదివించి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారు. పంటలు పండించి అందరి ఆకలి తీర్చే రైతన్నలు మాత్రం తమ పిల్లలు తమలా రైతులు కావాలని అస్సలు కోరుకోవడం లేదు. ''పెద్దయ్యాక రైతును అవుతాను'' అని కూడా ఎవరూ చెప్పరు. ''మేము వ్యవసాయం చేస్తాం, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాం. ఇప్పుడు ప్రపంచ దేశాధ్యక్షులు సైతం మేము చెప్పబోయేది ఆసక్తిగా వినబోతున్నారు అదీ వ్యవసాయం గొప్పతనం'' అని చాటిచెబుతున్నారు ఇద్దరు మహిళా రైతులు.

అవును గొప్పగొప్ప చదువులు చదివినవారి కంటే..తమ పూర్వీకుల నాటి నుంచి ఆచరిస్తోన్న పద్ధతులతో వ్యవసాయం చేస్తూ అందరి దృష్టి తమవైపు తిప్పుకున్న రైతులకు జీ–20 సదస్సుకు ఆహ్వానాలు అందాయి. పెద్దపెద్ద డిగ్రీలు, హోదాలు లేకపోయినప్పటికీ.. కేవలం వ్యవసాయం చేస్తున్నారన్న ఒక్క కారణంతో ... ప్రపంచ దేశాధ్యక్షులు పాల్గొనే 'జీ–20 సమితి'లో పాల్గొనే అవకాశం ఇద్దరు మహిళా రైతులకు దక్కింది. ఒడిశాకు చెందిన గిరిజన మహిళా రైతులు 'రైమతి ఘురియా, సుబాసా మోహన్తా' లకు ఈ అరుదైన గౌరవం లభించింది. సంప్రదాయ, గిరిజన చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు పద్ధతులను జీ–20 వేదికపై ఈ ఇద్దరు ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

కోరాపుట్ జిల్లాలోని నౌగుడా గ్రామానికి చెందిన రైతే 36 ఏళ్ల రైమతి ఘురియా. భూమియా జాతికి చెందిన రైమతికి ముగ్గురు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తోంది. ఏళ్లపాటు వరిధాన్యాలు పండించే రైమతి... చిరుధాన్యాల సాగు మెళకువలు నేర్చుకుని మిల్లెట్స్ సాగు మొదలు పెట్టింది. అధునాతన సాంకేతికతను జోడించి పంటలో అధిక దిగుబడిని సాధిస్తోంది. సాగులోలేని 72 దేశీయ వరి రకాలు, ఆరు చిరుధాన్యాలతో కలిపి మొత్తం 124 రకాల ధాన్యాలను అంతరించిపోకుండా కాపాడుతోంది. మంచి దిగుబడితో సాధిస్తున్న రైతుగానే గాక, తోటి గిరిజన రైతులకు చిరుధాన్యాల సాగులో సాయం చేస్తూ వారికీ జీవనోపాధి కల్పిస్తోంది. సంప్రదాయ పంటలైన వరి, మిల్లెట్ రకాలను పండిస్తూనే తన గిరిజన మహిళలెందరికో ఆదర్శంగా నిలుస్తూ... మిల్లెట్ సాగును ప్రోత్సహిస్తోంది. పంటమార్పిడి, అంతర పంటలు, సేంద్రియ పంటల్లో తెగులు నివారణ మెళకువల గురించి, స్కూలును ఏర్పాటు చేసి ఏకంగా 2500 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది. చిరుధాన్యాల సాగులో రైమతి చేసిన కృషికిగా గుర్తింపుగా అనేక ప్రశంసలు కూడా అందుకుంది. 2012లో జీనోమ్ సేవియర్ కమ్యునిటీ అవార్డు, 2015లో జమ్షెడ్జీ టాటా నేషనల్ వర్చువల్ అకాడమీ ఫెలోషిప్ అవార్డు, టాటా స్టీల్ నుంచి 'బెస్ట్ ఫార్మర్' అవార్డులే గాక, ఇతర అవార్డులు అందుకుంది.

చిరుధాన్యాల సాగులో అనుసరిస్తోన్న పద్ధతులు, దిగుబడి, తోటి రైతులను ఆదుకునే విధానమే రైమతిని జీ20 సదస్సుకు వెళ్లేలా చేసింది. ఈ సదస్సులో ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల చిరుధాన్యాలు, ఈ ధాన్యాలతో చేసిన విభిన్న వంటకాలు, చిరుధాన్యాలతో వేసిన ముగ్గులను ప్రదర్శించనుంది. చిరుధాన్యాల సాగులో తాను ఎదుర్కొన్న పరిస్థితులు, అధిక దిగుబడి కోసం అవలంబిస్తోన్న విధానాలు వివరించనుంది. మిల్లెట్ సాగులో అనుసరించాల్సిన అధునాతన సాంకేతికత, దాని ఉపయోగాల గురించి ఎమ్ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ సెంటర్ ఇచ్చిన శిక్షణ సంబంధిత అంశాలను ప్రస్తావించనుంది.

> జీ20 సదస్సుకు హాజరవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చిరుధాన్యాల సాగు, ఈ ధాన్యాల ప్రాముఖ్యత గురించి అందరికీ చెబుతాను. గిరిజన మహిళగా గిరిజన సాగు పద్ధతులను మరింత విపులంగా అందరికీ పరిచయం చేస్తాను.
>
> **- రైమతి ఘురియా**

సుబాసా మోహన్తా

మయూర్‌భంజ్ జిల్లాలోని గోలి గ్రామానికి చెందిన చిరుధాన్యాల రైతే 45 ఏళ్ల సుబాసా మోహన్తా. తన జిల్లాలో ఎవరికీ చిరుధాన్యాల సాగుపై ఆసక్తి ఏమాత్రం లేదు. 2018లో ఒడిశా ప్రభుత్వం రైతులను చిరుధాన్యాల సాగు చేయమని మిల్లెట్ మిషన్‌ను తీసుకొచ్చింది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితుల్లో ధైర్యం చేసి ముందుకొచ్చింది సుబాసా. ఏళ్లనాటి గిరిజన సాగుపద్ధతులను ఉపయోగిస్తూ రాగుల సాగును ప్రారంభించింది. అప్పటి నుంచి మిల్లెట్స్‌ను పండిస్తూ అధిక దిగుబడిని సాధిస్తోంది. ఇది చూసిన ఇతర రైతులు సైతం సుబాసాను సాయమడగడంతో వారికి సాగు పద్ధతులు, మెళకువలు నేర్పిస్తూ మిల్లెట్ సాగును విస్తరిస్తోంది. సుబాసాను ఎంతో మంది గిరిజన మహిళలు ఆదర్శంగా తీసుకుని చిరుధాన్యాలు సాగుచేయడం విశేషం. సుబాసా కృషిని గుర్తించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవార్డులతో సత్కరించాయి.

> చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిచేస్తాయి. ఇవి అనేక రకాల వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఒకప్పుడు గిరిజనుల ప్రధాన ఆహారం చిరుధాన్యాలు. కానీ ఇప్పుడు పొలాల నుంచి దాదాపు కనుమరుగయ్యాయి. నేను ధాన్యాలు పండించడం మొదలు పెట్టిన తరువాత నన్ను చూసి చాలామంది రైతులు చిరుధాన్యాలు సాగుచేయడం ప్రారంభించారు. ఇతర రైతులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాను. వరికంటే చిరుధాన్యాల సాగులో అధిక దిగుబడులు వస్తుండడంతో అంతా ఈ సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
>
> **- సుబాసా మోహన్తా**


గ్రామీణ మహిళలతో షెఫాలికా

మహిళా సాధికారతకు మార్గదర్శనం

పెద్ద ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కన్న షెఫాలికా పండా ఆ కలకు దూరమై పేదలకు దగ్గరైంది. మహాపట్టణం నుంచి మారుమూల పల్లె వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది. తమ ఫౌండేషన్ తరపున ఎంతోమందికి అండగా నిలబడింది. కష్టాలు, సమస్యల్లో ఉన్నవారికి సహాయం చేయడమే కాకుండా స్త్రీ సాధికారతకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది.

'జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటార్‌షిప్' కన్వీనర్‌గా స్త్రీ సాధికారతకు సంబంధించి విస్తృత స్థాయిలో పనిచేసే అవకాశం షెఫాలికా పండాకు లభించింది...

కాలేజీ రోజుల్లో 'సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలని కలలు కనేది షెఫాలికా. అయితే ఒకానొక సంఘటనతో ఆమె కలల దారి మారింది. తమ బంధువు ఒకరు అనారోగ్యం పాలుకావడంతో, ఒడిషాలో సరియైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఢిల్లీకి తీసుకుపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి అసౌకర్యాల వరకు ఎన్నో సంఘటనలను దగ్గరగా చూసింది షెఫాలికా పండా.

'చదువుకున్న వారు, ఆర్థికంగా కాస్త మెరుగైన స్థితిలో ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే ఒడిశాలోని మారుమూల ప్రాంతాలలో ఉండే పేద ప్రజల పరిస్థితి ఏమిటి?' అని ఆలోచించింది. ఆ ఆలోచనల ఫలితంగా సేవారంగంలోకి వచ్చిన షెఫాలికా ఎంతోమంది పేదలకు అండగా నిలబడింది.

బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లింది.

'నాయకుల ఎదుగుదలకు సంబంధించి అనుభవం అనేది కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఎంత అనుభవం ఉంటే అంత బలం సమకూరుతుంది. సామాజిక సేవా రంగంలో పదహారు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. సమాజంలో సానుకూల మార్పు తేవాలనుకునేవారికి సమస్యను అర్థం చేసుకోవడంతో పాటు దానిపై పని చేయడానికి చాలా ఓపిక కావాలి. సామాజిక సేవలో మా అత్తమ్మ 'ఇలా పండా' నాకు ఆదర్శం. ఎలాంటి ఆడంబరం లేకుండానే ఎన్నో సంవత్సరాలు సేవ చేసింది. ఎండనకా, వాననకా తిరిగినా ఆమె ముఖంలో ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. సామాజిక సేవ తన ఆరోగ్య రహస్యంగా చెప్పుకునేది. ఆమె చురుకుదనం, సామాజిక సేవాదృక్పథాన్ని చూసి ఎంతో మంది స్ఫూర్తి పొందారు. అందులో నేను ఒకరిని' అంటుంది షెఫాలికా.

'అవసరం ఉన్న చోట మేముంటాం' అనే నినాదంతో బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ట్రస్టీ, సీయివోగా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టింది.

'మహిళలపై ప్రధానంగా దృష్టి పెట్టడానికి కారణం అసమానత, లింగ వివక్షత. మహిళల జీవితాలు మారాలంటే ఆమె పిల్లల జీవితాల్లో కూడా మార్పు రావాలని బలంగా నమ్ముతాను' అంటుంది షెఫాలికా.



> అవకాశాలు దొరికేవారు, దొరకని వారు అని మహిళలకు సంబంధించి రెండు రకాల వర్గీకరణలున్నాయి. అవకాశాలు దొరికేవారు సులభంగానే విజయం సాధించి పెద్ద స్థాయికి చేరుకుంటారు. మరి దొరకని వారి పరిస్థితి ఏమిటి? సాంకేతిక, జీవన నైపుణ్యాలు, చదువు రూపంలో అలాంటి వారిని వెలుగులోకి తీసుకువచ్చి విజయపథంలోకి తీసుకువెళ్లడంపై, మహిళలకు సమాన అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై జీ20 సదస్సు దృష్టి పెడుతుంది. జీ20 ఉమెన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపారవేత్తలు కావాలనుకునేవారికి, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఎంతో మేలు జరుగుతుంది. 30,000 మంది ఎంటర్‌ప్రెన్యూర్‌ల అనుభవాలు పాఠాలుగా ఉపయోగపడతాయి.
>
> **- షెఫాలికా,**
> కన్వీనర్, జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటార్‌షిప్

చెత్త ఏరుతూ ఎత్తుకు ఎదుగుతూ

* స్ఫూర్తి

మూసారాంబాగ్ సమీపంలోని సలీం నగర్‌లో తెల్లవారుజామున 'చెత్తబండొచ్చిందమ్మా' అని అరుస్తూ కనిపిస్తుంది జయలక్ష్మి. డిగ్రీ చదువుతూ తల్లి నడిపే చెత్తబండిలో సాయం చేస్తుంది జయలక్ష్మి. 'ఎదగాలనుకుంటే చెత్త నుంచి కూడా ఎదగొచ్చు' అంటుందా అమ్మాయి. తాను నివాసం ఉండే మురికివాడ పిల్లల కోసం ట్యూషన్లు చెబుతూ, వాలంటీర్‌గా పని చేస్తూ, ప్రతిష్ఠాత్మక 'గాంధీ - కింగ్ స్కాలర్లీ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్'లో భాగంగా జూన్‌లో అమెరికా వెళ్ల వచ్చింది జయలక్ష్మి. చిన్న చితకా సవాళ్లకే డీలా పడుతున్న యూత్‌కు జయలక్ష్మి ఇచ్చే స్ఫూర్తి చాలానే ఉంది.


అమెరికాలో జయలక్ష్మి

యునైటెడ్ స్టేట్స్- ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యు.ఎస్.ఐ.ఇ.ఎఫ్) వారి 'గాంధీ- కింగ్ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్' స్కాలర్‌షిప్ పొంది, అమెరికా వెళ్లి రెండు వారాల పాటు మార్టిన్ లూథర్ కింగ్ మార్గంలో అహింసా పద్ధతితో ప్రజా ఉద్యమాలు ఎలా నిర్వహించాలో అధ్యయం చేసి రావడానికి దరఖాస్తులు కోరినప్పుడు మన దేశ వ్యాప్తంగా 4 వేల అప్లికేషన్లు వచ్చాయి. వారిలో కేవలం 10 మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆ పది మందిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉన్నారు. వారిలో ఒకరు అరిపిన జయలక్ష్మి.

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ సమీపంలో అతి పెద్ద మురికివాడ– సింగరేణి కాలనీలో ఉంటూ, చెత్త బండి లాగుతూ చదువుకుంటున్న ఈ అమ్మాయి ఇలా అమెరికా వరకూ చేరుకోవడం సామాన్యం కాదు. పోరాడే తత్వం, సాధించాలనే పట్టుదల ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. జయలక్ష్మిలోని అసాధారణమైన చొరవ, తపన ఆమెను ఇలా ముందుకు నడుపుతున్నాయి.

ముగ్గుపిండి అమ్మే దళిత కుటుంబం

అరిపిన జయలక్ష్మిది రాయలసీమ ప్రాంతానికి చెందిన దళిత కుటుంబం. తండ్రి రామ్మోహన్, తల్లి హుసేనమ్మ చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని హైదరాబాద్ వలస వచ్చారు. వీరి ఇళ్లల్లో ముగ్గుపిండి అమ్ముకుని తరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే జయలక్ష్మి తల్లిదండ్రులు చెత్తబండి నడపడాన్ని ఉపాధి చేసుకున్నారు. 'అమ్మ ఒక బండి, నాన్న ఒక బండి నడుపుతారు. కాలనీ వాళ్లు నెలకు ఇంతని ఇచ్చే డబ్బులే మాకు జీవనాధారం. గవర్నమెంట్ నుంచి ఏమీ జీతం రాదు. చెత్త తీయడం చాలా కష్టమైన పని. నాన్న తానొక్కడే చెత్త తీయగలిగినా అమ్మకు కష్టమని నేను ఏడో క్లాస్ నుంచి ఇవాళ్టి వరకూ ఆమెకు తోడు వెళుతూనే ఉన్నాను. చెత్త సేకరించడం, తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, డంపింగ్ యార్డ్‌లో పడేయడం అన్నీ చేస్తాను. ఇది చాలా దారుణమైన పని అని కొందరు అంటారు. కాని నా మటుకు నాకు ఇది అన్నం పెట్టే వృత్తి. నేను దానిని గౌరవిస్తాను. మా ఇంట్లో నేను కాకుండా అన్నయ్య, చెల్లెలు ఉన్నారు. అందరూ మంచిగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని మా అమ్మ తపన. అంతవరకు ఈ పని చేయకతప్పదు' అంటుంది జయలక్ష్మి.


బండిలో చెత్త వేస్తున్న జయలక్ష్మి

ఎన్.జి.ఓ దృష్టిలో పడి

జయలక్ష్మి చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉండేది. కాలనీలోని సమస్యలపై మాట్లాడేది. స్కూల్లో ఒకసారి ఇలాగే మాట్లాడితే 'మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్' అనే ఎన్.జి.ఓ దృష్టిలో పడింది. పేదవర్గాల కోసం పని చేసే ఆ సంస్థ జయలక్ష్మిని తన కార్యకలాపాల్లో భాగం చేస్తూ ప్రోత్సహించింది.

'స్లమ్స్‌లో ఉండే పిల్లల వికాసం కోసం నేను పని చేశాను. హైదరాబాద్‌లో 56 స్లమ్స్ ఉంటే వాటిలో 21 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. మేమందరం మహిళా సంక్షేమ శాఖ దగ్గరకు వెళ్లి మాట్లాడి వాటిని సాధించాం' అంటుంది జయలక్ష్మి. ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకుని తన వాడ నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్న జయలక్ష్మి తన వాడలోని పిల్లలకు సాయంత్రాలు ట్యూషన్ చెప్తూ వారి చదువుకు మేలు చేస్తోంది. 'కోవిడ్ సమయంలో మా కాలనీలో నేను కార్యకర్తగా పని చేశాను. కోవిడ్ రాకుండా చాలా వరకు సక్సెస్ అయ్యాను' అంది.

ఐ.ఎ.ఎస్ కావాలని

'యువతకు నాయకత్వ లక్షణాలు ఉండాలి. హక్కుల కోసం పోరాడాలి. అమెరికాలో శాంతియుత పోరాటాల విజయగాథలను అధ్యయనం చేయగలగడం నా అదృష్టం. ఒక యువ ప్రతినిధిగా పోరాడుతూనే ప్రజల సేవ కోసం ఐ.ఎ.ఎస్ సాధించాలనుకుంటున్నాను. అందుకు కావలసిన సహాయం పొందగలననే అనుకుంటున్నాను. నాకు ఎంతమంచి పేరున్నా చెత్త అమ్మాయి అనే పిలుస్తారు కొందరు. వారి చేత ఉత్తమ అమ్మాయి అనిపించుకునేందుకు, లక్ష్యం లేని వారి బుర్రలే చెత్త అని నిరూపించేందుకు మరింత కష్టపడతాను' అంది జయలక్ష్మి.

– సాక్షి ఫీచర్స్ డెస్క్


పక్షులతో ప్రయాణం

* సందర్భం

ఛాయాచిత్ర ప్రేమికుడు జి.వి. ప్రసాద్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ


జి.వి. ప్రసాద్

ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానం. పక్షులు, వన్యప్రాణుల ఫొటోలు తీయాలంటే, గంటల కొద్దీ వేచి చూడాలి. వాటి ప్రశాంతతకు భంగం కలగకుండా ఫొటోలు తీయడం కత్తిమీద సాములాంటిదే. పారిశ్రామికవేత్త, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్‌కి మాత్రం అది ఆట విడుపు. ఆయన దేశ విదేశాల్లో పర్యటించి తీసిన ఫొటోలతో ఇటీవల 'ది బర్డ్స్ అండ్ బిలీఫ్స్' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా... సాక్షితో సంభాషణ.



■ ఔషధాల తయారీ రంగంలో తీరిక లేకుండా ఉండే మీకు, పక్షుల కోసం పర్యటనలు, ఫొటోగ్రఫీ హాబీ ఎప్పటి నుంచి?

గత పది, పదిహేనేళ్లుగా ఫొటోగ్రఫీ చేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి, స్వయంగా తీసిన ఫొటోల సమాహారమే ఈ పుస్తకం. కొన్ని ఫొటోలతో పుస్తకాన్ని తీసుకురావాలని, మరికొన్నింటితో ప్రదర్శన ఏర్పాటు చేయాలని నా ఆలోచన. గతంలో రెండు పుస్తకాలు ప్రచురించాను. ఒకటి అలాస్కా మీద, మరొకటి స్పితి వ్యాలీ. ఇది మూడో పుస్తకం.

■ 'బర్డ్స్ అండ్ బిలీఫ్స్' లో మంచి కొటేషన్‌లు కూడా కనిపిస్తున్నాయి!

నన్ను ప్రభావితం చేసే సూక్తులు కనిపించినప్పుడు, విన్నప్పుడు పుస్తకంలో రాసుకోవడం నాకు పాతికేళ్లుగా అలవాటు. వాటిలో కొన్నింటిని ఇందులో పొందుపరిచాను. ఈ పుస్తకం నా అభిరుచికి, జ్ఞాపకాలకు నిలువుటద్దం.

■ ఇందులో ఏఏ ప్రదేశాల పక్షులున్నాయి?

మనదేశంలో దక్షిణాదిలో హైదరాబాద్, ఉత్తరాది నుంచి భరత్‌పూర్, కాన్హా నేషనల్ పార్క్. ఆఫ్రికా ఖండంలో కెన్యా, టాంజానియా, బొట్సువానా, నార్త్ ఆర్కిటిక్, అంటార్కిటికా తదితర ప్రాంతాల పక్షుల ఫొటోలున్నాయి. అంటార్కిటికాలో పెంగ్విన్స్ కూడా తీశాను. నార్త్ అమెరికాలో అలాస్కా కూడా కవర్ చేశాను. ఈ ప్రాంతాలలో కనిపించే పక్షులతో పాటు క్షీరదాలు, ప్రకృతి ఫొటోలూ తీశాను. కానీ, ఈ పుస్తకాన్ని మాత్రం పక్షుల కోసమే కేటాయించాను.

■ వలస పక్షులు భారీగా వచ్చే ఆంధ్రప్రదేశ్, పులికాట్ సరస్సుకు వెళ్లారా?

వెళ్లాను, ఫ్లెమింగో ఫొటోలు తీశాను. కానీ ఈ పుస్తకంలో ప్రచురించలేదు.



■ బర్డ్ వాచింగ్ కోసం విభిన్నమైన అనేక ప్రాంతాలను సందర్శించారు. మీకు బాగా నచ్చిన ప్రదేశం, సందర్భం, ఫొటో ఏది?

అలాస్కాలో ల్యాండ్ స్కేప్‌లు, మంచినీటి సరస్సులు, ఉప్పు నీటి చెరువులు, పొరలు పొరలుగా పేరుకుపోయిన మంచు... మొత్తంగా చూస్తే ప్రకృతి అద్భుతంగా స్ఫూర్తిదాయంగా అనిపిస్తుంటుంది. పెద్ద ఎలుగుబంట్లు, బాల్డ్ ఈగల్స్, సాల్మన్ చేపలతోపాటు రకరకాల చేపలుంటాయి. సముద్రం నుంచి మంచి నీటి సరస్సుల వైపుకు గుంపులుగా వచ్చే చేపల్ని చూడడం వర్ణించలేనటువంటి అనుభూతి. అలాగే మరొకటి... ఆఫ్రికాలో ప్రాణులు వలస వెళ్లడం. వైల్డ్ బీస్ట్ పెద్ద సంఖ్యలో నదిని దాటుతున్న దృశ్యం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతోంది.

■ ఆర్నిథాలజిస్టు ఆశిష్, కెమెరా మెళకువలు నేర్పిన సురేశ్ చిత్తూరి గురించి మీ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు!

ఆశిష్‌తో చాలా ఏళ్ల పరిచయం. వాళ్ల పిల్లలు, మా పిల్లలు క్లాస్‌మేట్స్. బర్డ్ వాచింగ్‌ను పరిచయం చేసింది ఆయనే. ఇక శ్రీనివాస హ్యాచరీస్ సురేశ్ చిత్తూరి కూడా నాకు మంచి మార్గదర్శి.

■ ఎన్నిరకాల పక్షులను ఫొటో తీశారు?

రెండువందలకు పైగా పక్షి జాతులను ఫొటో తీశాను.

■ మీ పుస్తకంలో పాలపిట్ట, కాకి, కోకిల కనిపించాయి. కానీ రామచిలుక కనిపించలేదు! అలాగే కొల్లేటి కొంగలు, చిల్కా సరస్సులో విహరించే పక్షులను మేము తర్వాతి పుస్తకంలో చూడవచ్చా?

రామచిలుకల ఫొటో తీశాను. కానీ, పుస్తకానికి ఫొటోల ఎంపికలో వదలిపెట్టాను. కొల్లేరు వెళ్లలేదు. చిల్కా సరస్సుకు వచ్చే ఏడాది వెళదామనుకుంటున్నాను.

శాస్త్రీయతకు గౌరవం

డాక్టర్ రెడ్డీస్ సంస్థలో 1990 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీవీ ప్రసాద్ ఆ సంస్థ ఎదుగుదల, 66 దేశాలకు విస్తరణలో తనవంతుగా విశేషమైన కృషి చేశారు. సశాస్త్రీయమైన పరిశోధనల పరంపరలో ఆయనను వరించిన కొన్ని ప్రత్యేక గుర్తింపులు... పురస్కారాలివి.

- వైపీఓ గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డు– 2020
- వి. కృష్ణమూర్తి అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ బై ద సెంటర్ ఫర్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్, 2019
- బౌండరీ బ్రేకర్ లీడర్ అవార్డ్, సీఈఓ అవార్డ్స్ 2018
- ఇండియా బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2015
- ఇండియాస్ బెస్ట్ సీఈవో బై బిజినెస్ టుడే, 2014
- ఇండియా టాలెంట్ మేనేజ్‌మెంట్ అవార్డ్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2014

■ మీ నేపథ్యం మొత్తం హైదరాబాదేనా?

లేదు, పాక్షిక హైదరాబాదీని. నాల్గవ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాను. తర్వాత నెల్లూరులో 12వ తరగతి వరకు, రెండున్నరేళ్లు చెన్నై అన్నా యూనివర్సిటీ, ఆ తర్వాత చికాగోలో ఇలినాయీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్, మాస్టర్స్ పర్‌డ్యూ (Purdue University) యూనివర్సిటీలో పూర్తి చేసి హైదరాబాద్‌కి వచ్చాను.

■ పుస్తకం విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని వన్యప్రాణుల సంరక్షణ కోసం విరాళమని ప్రకటించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపట్లేదని అనుకుంటున్నారా?

ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తోంది. కానీ, ప్రభుత్వం ఒక్కటే అన్నింటినీ పరిష్కరించలేదు. వ్యక్తుల విరాళాలు చాలా ఉపయోగ పడతాయి. పర్యావరణం, వన్యప్రాణుల పరిరక్షణ ముఖ్యమైన అంశం అని నేను మద్దతు ఇస్తున్నాను. ఆన్‌లైన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయిస్తున్నాం. పుస్తక విక్రయాలతో వచ్చే డబ్బు నాకవసరం లేదు. ఉచితంగా ఇస్తే పుస్తకం గౌరవం తగ్గిపోతుంది. అందుకే విక్రయాలను మంచి పనికి విరాళంగా ఇవ్వాలనుకున్నాను.

■ అంజిరెడ్డి (డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వ్యవస్థాపకులు)గారు చెప్పినట్లుగా మన కుండ నిండిన తర్వాత, అదనంగా వచ్చి పడుతున్న నీటిని మరొకరికి ఉపయోగపడేలా చేయాలి అనే సూత్రాన్ని పాటిస్తున్నారా? ఆయన నుంచి అలాగే మీ నాన్నగారి నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?

మా నాన్నగారు (గ్రీన్ పార్క్ హోటల్ వ్యవస్థాపకులు) చాలా డీటెయిల్ ఓరియెంటెడ్. మనం చేస్తున్న పని గురించి సూక్ష్మ స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెబుతారు. వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడేవారు. మా మామగారు (అంజిరెడ్డి) విజన్ చాలా విస్తృతమైనది. వారిద్దరినీ ఒకే 'ఫ్రేమ్'లో చెప్పాలంటే... 'అడవి అందులో చెట్లు' అని చెప్పవచ్చు. అంజిరెడ్డి గారి ద్వారా అడవిని చూస్తే, మా నాన్న గారి ద్వారా అందులో వృక్షాలను చూశాను.

■ పాఠకులకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?

'ప్రపంచంలోని ప్రతిదీ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. మన ఆరోగ్యం అడవి ఆరోగ్యంతో ముడిపడి ఉంది. మన శ్రేయస్సు కోసం ప్రకృతి పరిరక్షణ తప్పనిసరి' అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరూ 'కొంతవరకైనా ప్రకృతితో మమేకమవుదాం' అనుకుంటే... ప్రకృతి పరిరక్షణ కోసం చేయగలిగిన చిన్న చిన్న పనులు అందరమూ చేయగలుగుతాం.

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి